**ముహూర్తం**

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ పంచమి మ.12.30 వరకు, అనంతరం షష్ఠి; నక్షత్రం: హస్త మ.2.38 వరకు, అనంతరం చిత్త; అమృతకాలం: ఉ.8.40 నుండి 10.15 వరకు; వర్జ్యం: రా.10.47 నుండి 12.25 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు;

Estd 1938

# ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!





సంపుటి:56 • సంచిక:295 • సోమవారం 5 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad


## రోబో సైనికులు వస్తున్నారు!

**వాషింగ్టన్:** రోబోలతో సైనిక కార్యకలాపాలను చేయించేసరికొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నిక్‌ను అమెరికా సైనిక పరిశోధన ప్రయోగశాల, ఆస్టిన్‌లో టెక్సాస్ యూనివర్శిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఒక మానవ ఇన్‌స్ట్రక్టర్‌తో ముచ్చటించే పద్ధతిని తాజా టెక్నిక్ రోబోలు, కంప్యూటర్‌ప్రోగ్రామ్‌లకు నేర్పిస్తుంది. ఒక మానవ శిక్షకుడితో స్వల్ప వ్యవధిలో వీడియోలను చూడటంద్వారా కార్యకలాపాలు ఎలా నిర్వహించాలో నేర్చుకునే సామర్థ్యాన్ని రోబో అలవరుచుకుంటుంది. పరిస్థితులకు అనుగుణంగా ఏది మంచిపని ఏది చెడ్డపని అనే విచక్షణకు సం బంధించి మానవ బోధకుడి ద్వారా రోబోలకు నేర్పం చాల్సిన పరిస్థితులను పరిశోధకుల బృందం పరిగణనలోకి తీసుకుంది. అది ఒక శునకానికి ఒక పనిని నేర్పించిన విధానాన్ని పోలి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఒక గోడలోపలకు పరిగెత్తడం, కొండ చరియ పక్కగా పరిగెత్తడం లాంటి తప్పుడు పనులను సైతం రోబోలకు నేర్పించాల్సి ఉంటుంది. తనతో ➪ 3వ పేజీలో...



## రోడ్డు పనుల్లోనూ రోబోలు!

**ముంబై:** మున్ముందు మనం జాతీయ రహదారులపై వెళుతుంటే రోడ్డు నిర్మాణ పనుల జరుగుతున్నవి..నిదానంగా ఆగి చూసి వెళ్లండి అంటూ ఒక చేతిలో ఎర్ర జెండా పట్టుకొని, మరో చేత్తో దారి చూపుతున్న రోబో కనిపిస్తే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. రహదారుల నిర్మాణ పనుల్లో ఇలా సంకేతాలు ఇచ్చే పనులు చేసేవారిని ఫ్లాగ్‌మెన్ అంటారు. మనదేశంలో ఇప్పటికే రహదారి నిర్మాణ కంపెనీలు రోబో ఫ్లాగ్ మెన్‌ను రంగంలోకి దించాయి. కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ఇదే మంచి దారి అనుకుంటే ఇదే ఒరవడి అన్ని చోట్ల విస్తరించవచ్చు.

**ఆకారంలో రోబో ఫ్లాగ్‌మ్యాన్**

రోబో ఫ్లాగ్‌మ్యాన్ చూడ్డానికి ప్లాస్టిక్‌తో తయారు చేసిన యాంత్రిక మానవ అస్తిపంజరాన్ని పోలి ఉం టుంది. ఉక్కు ఫ్రేమ్ ఈ నిర్మాణానికి ఆధారంగా ఉంటుంది. కొన్నిసార్లు చక్రాలు సైతం రోబో ఫ్లాగ్ మ్యాన్‌కు ఆసరాగా ➪ 3వ పేజీలో...



## గ్రీన్ హైదరాబాద్!



- ప్రసిద్ధ నగరం ప్రతిష్ట పెంచుదాం
- పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం
- అర్బన్ ఫారెస్ట్రీ రెండింతల పెంపునకు 'సేవ్ హైదరాబాద్' కార్యాచరణ
- మూసీ రివర్ ఫ్రంట్ బోర్డుకు కీలక అధికార బాధ్యతలు
- ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష
- పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై సమన్వయంతో పనిచేయాలి
- మూడు నెలల్లోగా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దినదినాభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగర ప్రతిష్టను పెంచే విధంగా అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. భౌగోళికంగా విస్తరిస్తున్న నగరం పరిసర ప్రాంతాలను పరిరక్షించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నగరం నుంచి కాలుష్యాన్ని తరిమికొట్టేందుకు ఇప్పుడున్న అర్బన్ ఫారెస్ట్రీని రెండింతలు పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ అంశంపై ఆదివారం ప్రగతి భవన్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మహానగరం అన్ని వైపులా దాదాపు 60 కిలోమీటర్ల వరకు విస్తరిస్తున్నందున ప్రజారోగ్య పరిరక్షణ దిశగా పెద్దఎత్తున చెట్ల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరం చుట్టూ లక్షన్నర ఎకరాలకు పైగా అటవీ భూములున్నాయని, వాటిని పరిరక్షించుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. హైదరాబాద్ అర్బన్ ఫారెస్ట్రీని అభివృద్ధి చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ బోర్డుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కేబీఆర్ పార్కు తరహాలో మూసీ నది పొడవునా వాక్‌వేను ఏర్పాటు చేయాలన్నారు. సేవ్ హైదరాబాద్ నినాదంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు.

మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయాలని నిర్ణయించినందున రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేయాలన్నారు. పాస్ పుస్తకాల ముద్రణ పురోగతి, ధరణి వెబ్‌సైట్ ఆధునీకరణపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంచుకున్న లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ అంశాలపై నిరంతరం పర్యవేక్షించాలని ➪ 2వ పేజీలో...

## అసైన్డ్ భూములకూ పెట్టుబడి సాయం

- ఆక్రమణదారులకు నో
- క్రమబద్ధీకరించే భూములకు సాయం లేదు
- సామాజిక, ఆర్థిక హోదా అంచనా
- లక్షలాది ఎకరాల క్రమబద్ధీకరణ?

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** అసైన్డ్ భూములకూ పెట్టుబడి సాయం ఇస్తే ఎలా ఉంటుందనే కోణంలో ప్రభుత్వం పరి శీలన చేస్తున్నట్లుగా తెలిసింది. పేదలకు ప్రభుత్వం దానంగా ఇచ్చిన భూముల ను కూడా పెట్టుబడి సాయంలో పరిగణలోకి తీసుకోవాలని యోచిస్తోంది. తొలుత 1.42 కోట్ల ఎకరాలకు సాయం అందించాలని నిర్ణయించారు. ఆయా భూములన్నీ వివాదరహిత భూములు, రైతులు కొనుగోలు చేసి సాగు చేస్తున్న భూములుగా గుర్తించారు. అయితే తాజాగా పేదల ఆధీనంలో ఉన్న 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకూ సా యం కోరుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసి నట్లుగా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కౌలు రైతుకు సాయం ప్రతిపాదన లేదని, కానీ నిరుపేదలు సాగుచేసుకుని జీవించేందకు ఇచ్చిన భూ ములకు కూడా సాయం ఇస్తే సముచితంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్త మవు తోంది. పేదలకు ➪ 2వ పేజీలో...



- సంప్రదాయం పేరిట దురాచారం
- వసివారుతున్న బాలికల బతుకులు
- ఉమ్మడి హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు 11మంది బాలికలు లేఖాస్త్రం
- విచారణకు స్వీకరించిన సీజే
- దక్షిణాదిన బాల్యవివాహాలు అధికం

## బాల్యానికి మూడుముళ్లా?



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** బాల్యం మసక బారుతోంది. బాల్య వివాహాల పేరిట అనాగరికం కొనసాగుతూనే ఉంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా బాలికలను వదిలించుకునేందుకు తలిదండ్రులు ఈ దురాచారానికి ఒడిగడుతూనే ఉన్నారు. ఎన్ని నిరోధక చట్టాలు వచ్చినా ... ఎన్ని దాడులు జరిగినా బాల్య వివాహాల తంతు కొనసాగుతుండటం గమనార్హం. తెలిసీ తెలియని వయసులోనే బాలికలను వివాహ చట్రంలో బిగించడాన్ని ఎవరూ హర్షించరు. అయితే అనాధిగా వస్తోందని తాము ఇప్పుడు ఆపమంటే ఎలా ఆపుతామని అడ్డుకునేందుకు వెళ్ళిన అధికారులను సైతం ఆయా బాలికల తలిదండ్రులు ప్రశ్నించిన సందర్భాలు కోకొల్లలు.

ఆడపిల్ల పుట్టిందంటే భారమేనని నేటికీ తల్లిదండ్రులు భావిస్తుండటం గమనార్హం. ఏ విధంగానైనా ఓ ఆయ్య చేతిలో పెట్టి చేతులు దులుపుకోవాలని భావించే వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. చదువుల విష యంలో కూడా ఆడపిల్లల పట్ల నిర్లక్ష్యం కొనసా గుతూనే ఉంది. మగ పిల్లాణ్ణి ఒక రకంగా ఆడ పిల్లను మరోరకంగా చూసే దుస్సంప్రదాయం నేటికీ ఉంది. ఆడపిల్లను భారంగానే చూస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా వదిలించుకోవాలని ఉబలాటపడుతున్నారు. అందుకు అనుగుణంగా బాల్య వివాహాలకు తెరదీస్తూనే ఉన్నారు. బాల్య వివాహాలు చట్ట సమ్మతం కాదని తెలిసినా ఏ మాత్రం పట్టించుకోకుండా కుంపటిలా భావించి ఆడపిల్లలను చిన్నతనంలోనే వివాహ బంధంతో ముడేస్తున్నారు. మరోవైపు తాము చిన్నతనం నుంచి తమ బిడ్డను తమ కుటుంబంలోని వారికే ఇచ్చి చేద్దామని అనుకుంటున్నామని ఒక వేళ పెద్దదైతే తమ మాట వినక పోవచ్చునని, అందుకే తొందరగా వివాహం జరిపిస్తున్నామని అధికారుల ముందు వాపోయిన సందర్భాలు లేక పోలేదు.

ఆడపిల్ల ఎప్పటికైనా పరాయి పిల్లేనన్న సాకుతో తొందరగా వివాహం జరిపించి చేతులు దులిపే సుకుంటున్న వారు లేకపోలేదు. ఇలా పలు రకాలుగా అధికారులు వచ్చినపుడు బాల్య వివాహాలను సమర్థించుకుంటూ తలిదండ్రులు చెప్పే మాటలు విన్న అధికారులు విస్తుపోతున్నారు. బాల్య వివాహాలు నేరమని తెలిసినా ఈ రకంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించిన సందర్భంలో అధికారులపై సైతం ➪ 3వ పేజీలో...

## సౌర విద్యుత్‌లో తెలంగాణ టాప్

- 31 మెగావాట్ల నుంచి 3,150 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- రెండోస్థానంలో రాజస్థాన్
- అయినా తీరని కరెంట్ కష్టాలు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సౌర విద్యుత్‌లో తెలంగాణ ప్రభుత్వం దూసుకు పోతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడానికి ముందు రాష్ట్రంలో 37 మెగావాట్ల సౌర విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అయ్యేది. పరిస్థితి మొత్తం మారిపోయింది. రాష్ట్రంలో నేడు 3000 మెగావాట్లకు పైగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఇప్పటికే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, హరితహారం, మిషన్ భగీరథ, కాకతీయ తదితర ప్రతిష్ఠాత్మకమైన పథకాల అమలులో దేశంలోనే ప్రప్రథమ స్థానాన్ని సాధించిన తెలంగాణ ప్రభుత్వం తాజాగా సౌర విద్యుత్‌లోనే వెలుగులు విరజిమ్ముతూ ధగధగలాడుతోంది. దేశంలో ఏ రాష్ట్రమైనా పారిశ్రామిక, వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించా లంటే విద్యుత్ అత్యంత కీలకమైనది. విద్యుత్‌తోనే అన్ని ➪ 2వ పేజీలో...

## పదికాలాలు ఉండేలా నీటిప్రాజెక్టుల నిర్మాణం



ఇరిగేషన్ బ్రాండ్ అంబాసిడర్ 3

**యూకేజీ విద్యార్థి నెహాల్**

## నాణ్యతలో రాజీలేదు

- నిర్మాణాల వేగంతోపాటు నాణ్యతా కీలకమే
- క్వాలిటీ, డిజైన్స్ ఇంజనీర్లతో హరీశ్ మేథోమథనం
- ఇప్పుడు ఎడారి కాదు...మన చేను మన చెలక మాగాణి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తలాపున పారుతుంది.. గోదావరి. మన చేను, మన చెలక ఎడారి అని తెలంగాణ అవతరణకు ముందు పాడుకునేవారమని, ఇపుడు తలాపున పారుతుంది.. గోదారి. మన చేను మన చెలక మాగాణి అని పాడుకోవాల్సిన రోజులొచ్చాయని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సాగునీటిరంగంలో నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఇంజనీర్లకు సూచించారు. ఆదివారం జలసౌధలో ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్, సిడిఓ ఇంజనీర్లతో మేథోమథనం జరిపారు. పలువురు ఇంజనీర్లు చేసిన సూచనలకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆ సూచనలకు అనుగుణంగా తగిన చర్యలు చేపడుతామని హామీనిచ్చారు. ఇకపై ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగం పనితీరుపై ఈఎన్‌సి అడ్మిన్ నాగేందర్ రావు పర్యవేక్షణ చేస్తారన్నారు. తెలంగాణ అంతటా ఇరిగేషన్ రంగంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు 40దాకా ఉన్నాయని.. రాబోయే ఏడాది కాలంలో క్వాలిటీ కంట్రోల్ విభాగానికి అత్యంత కీలకమన్నారు. ప్రాజెక్టులు పూర్తిచేయడానికి కాలంతో పోటీపడుతున్నామని, అదే సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతపై రాజీ కుదరదని స్పష్టం చేశారు. నిజాయితీగా 16గంటల పాటు పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించాలని, తగిన గుర్తింపును ➪ 2వ పేజీలో...



## ఏఎన్ఎంల వేతనాలు పెంపు

- 21 వేలకు చేరిక

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** ప్రత్యేక కమిషన్ ద్వారా 2003 సంవత్సరంలో నియామకమైన 710మంది ఎఎన్‌ఎంలకు వేతనాలు భారీగా పెంచుతూ ఆదివారం సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. 2003 సంవత్సరంలో యూరోపియన్ కమిషన్ పథకం కింద నియామకమైన ఎఎన్‌ఎంలు తమ వేతనాలు పెంచాలని కోరుతూ గతంలో సీఎంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శులకు విన్నవించుకున్నారు. వారి విజ్ఞప్తి మేరకు సీఎం సానుకూల నిర్ణయం తీసుకొని ప్రస్తుతం 10 వేల నుంచి 21 వేలకు పెంచారు. అయితే 2వ ఎఎన్‌ఎంలకు కూడా త్వరలో వేతనాలు పెంచుతామని సీఎం ప్రకటించారు.




## రాజకీయాల్లోకి వస్తున్నా

- జేఏసీ చైర్మన్ కోదండరాం 2

## రెండేళ్లలో 2.53 లక్షల ఉద్యోగాలు

- రానున్నది ఉద్యోగనామ సంవత్సరం
- మార్చిలో భారీగా నియామకాలు
- 2016-17లో పోలీసుశాఖలో అధికం
- 2017 మార్చికి 34.8 లక్షల జాబ్స్
- 2018 మార్చి1కి 35.05 లక్షలకు చేరనున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ కొలువులకు సంబంధించిన అంశాలను 2018-19 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. గత రెండేళ్లలో 2.53లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చినట్టు వివరించారు. కేంద్ర ఉద్యోగాలకు సంబంధించిన అంశాలను పరిశీలించగా.. మార్చి 1, 2018 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యో గుల సంఖ్య 35.05లక్షలకు చేరుకుంటుందని అంచనా వేశా రు. మార్చి 2016 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 32.52 లక్షలుగా నమోదైంది. రెండేళ్లలో గమనిం చగా.. కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల సంఖ్య 2.53లక్షలు పెరి గిందని బడ్జెట్ పత్రాల్లో వెల్లడైంది. 2016-2017 మధ్య కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 2.27 లక్షల మంది ఉద్యోగులుగా చేరారు. 2017, మార్చి 1 నాటికి కేంద్రంలో సుమారు 34.8 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నట్టు బడ్జెట్ పత్రాలు చెబు తున్నాయి. 2016, 2017లో పోలీస్ శాఖలోనే అత్యధిక నియామకాలు జరిగాయి. దీంతో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో కూడా ఉద్యోగుల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. వ్యవసాయ, సహకార, కుటుంబ సంక్షేమ శాఖల్లో మార్చి 1, 2018 నాటికి 1944 ఉద్యోగాలు పెరగ నున్నాయి. 2016లో ఈ విభాగంలో ➪ 7వ పేజీలో...



- ఎవరెన్ని చెప్పినా వెనక్కి తగ్గొద్దు
- పార్లమెంట్ వేదికగా ఎంపీలు గళమెత్తాలి
- తెదేపా అధినేత బాబు దిశానిర్దేశం

3

## సమరమే!




# బడ్జెట్ సమావేశాల్లోనే పీఆర్ బిల్లు

•పారదర్శక పాలనే లక్ష్యం •జనాభా ఆధారంగా గ్రామాలకు రూ.5-30 లక్షల నిధులు •నిధులు నేరుగా పంచాయతీలకు •త్వరలో విధి విధానాలు •అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు •సర్పంచ్ ఎన్నికలపై రాని స్పష్టత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : గ్రామీణ తెలంగాణ వికాసం లక్ష్యంగా టీఆర్ఎస్ సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది. స్థానిక స్వపరిపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ పంచాయతీరాజ్ వ్యవస్థకు జవసత్వాలు కల్పించే దిశగా నూతన పంచాయతీరాజ్ చట్టం ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

దేశంలోనే ఆదర్శవంతమైన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పన ద్వారా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలవాలని టీఆర్ఎస్ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. న్యాయశాఖ పరిశీలనలో ఉన్న నూతన పంచాయతీరాజ్ బిల్లు ప్రతిపాదనలు తుది రూపు దిద్దుకుంటున్నాయి. మరో వారం రోజుల్లో న్యాయశాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశాలు ఉన్నాయి. బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నూతన పంచాయతీరాజ్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రగతి భవన్‌లో జరిగిన పంచాయతీరాజ్ శాఖ సమీక్షలో వెల్లడించారు. ముసాయిదా బిల్లు పురోగతితోపాటు కొత్త పంచాయతీల ఏర్పాటు, నగర పంచాయతీల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అన్ని జిల్లాల నుంచి ఇప్పటికే కొత్త పంచాయతీల ప్రతిపాదనలు అందాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

కొత్తగా 4500 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయని, వీటిలో 300, ఐదు వందల జనాభా ప్రాతిపదికన ఎన్ని గ్రామాలకు కొత్త పంచాయతీ హోదాకు అర్హమైన ఉన్నాయో ప్రక్రియ పూర్తి చేసినట్టు అధికారులు సీఎంకు నివేదించారు. జనాభా ప్రతిపదికన గ్రామ పంచాయతీలకు నిధులు అందేలా 2018-19 రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని సీఎం ఆర్థికశాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రతి పంచాయతీకి జనాభా ప్రాతిపదికన కనిష్ఠంగా రూ.5లక్షల నుంచి గరిష్ఠంగా 30 లక్షల వరకూ నిధులు కేటాయింపుల జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, ఆర్థిక సంఘం నుంచి అందే నిధులు, రాష్ట్ర బడ్జెట్ నుంచి అందే నిధులు, అస్సెస్సుల వసూలు ద్వారా నిధులకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నుంచి నిధులు ఏ విధంగా పొందే అవకాశాలు ఉన్నాయో సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్‌కు సూచించారు.

**ఎన్నికల విధానంపై ఏటూ తేల్చని ప్రభుత్వం**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికల గడువు కూడా దగ్గర పడుతోంది. మరోవైపు ప్రభుత్వం ఇపుడున్న పంచాయతీరాజ్ వ్యవస్థలో పెద్ద ఎత్తున మార్పులు తెస్తోంది. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవిపై కీలకం. ఇపుడున్న విధానం మేరకు గ్రామ సర్పంచ్‌ని నేరుగా ఆ గ్రామంలోని ఓటర్లు ఎన్నుకునే విధంగా కాకుండా, పరోక్ష పద్దతిలో వార్డు సభ్యులే ఎన్నుకునే విధానం కొత్త చట్టంలో ఒక ప్రతిపాదనగా ఉంది. అయితే సర్పంచ్ ఎన్నికల విధానంపై ప్రభుత్వ అభిప్రాయంలో ఇంకా స్పష్టత రాలేదంటున్నారు. ముఖ్యమంత్రి వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో కూడా ఎన్నికల అంశంపై ఏవిధమైన నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

## కువైట్ బాధితులను ఆదుకుంటాం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : కువైట్ ప్రభుత్వం ప్రకటించిన అమ్నెస్టీ (క్షమాభిక్ష) నేపథ్యంలో పర్మిట్, వీసా లేకుండా అక్రమంగా పని చేస్తున్న వారిని తెలంగాణకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎన్నారై శాఖ మంత్రి కెటి రామారావు తెలిపారు. ఏడేళ్ళ తర్వాత కువైట్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష అవకాశాన్ని ఉపయోగించుకోవాలని గత వారం విజ్ఞప్తి చేసిన మంత్రి అక్కడి నుంచి తిరిగి వస్తున్న వారికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందించాలని ఎన్నారై శాఖ అధికారులను ఆదేశించారు. ఎన్నారై శాఖ నిరంతరం కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నారని తెలిపారు. కువైట్‌లోని భారత ఎంబసీ అధికారులతో ఆదివారం మాట్లాడారు. తెలంగాణ కార్మికుల విషయంలో ఎన్నారై శాఖ అధికారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో అవసరమైతే కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సహాయం కోరుతామని మంత్రి చెప్పారు. ఈ క్షమాభిక్షలో తెలంగాణకు రావాలనుకున్న వారు ఇప్పటికే అక్కడి ఎంబసీని కలుస్తున్నారని, ఇందులో కొంత మందికి కనీసం విమానచార్జీలకు కూడా డబ్బులు లేవన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిని ప్రభుత్వం మానవతా దృష్టితో ఆదుకుంటున్నారు. ఎంత మందికి టికెట్లు అవసరమవుతున్నాయి, తిరిగి వస్తున్న కార్మికుల సంఖ్య ఎంత తదితర వివరాలను తెలుసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం నిధులెన్ని కావాలన్న అంచనాలను సమర్పించాలని సూచించారు. కువైట్‌లోని తెలంగాణ సొసైటీలవారిని సహకారం కావాలనుకుంటే ఎన్నారై శాఖను సంప్రదించాలని కోరారు. ఎన్నారై అధికారి ఫోన్ నంబర్ 94408 54433ని సంప్రదించాలని కోరారు.

## సౌర విద్యుత్‌లో తెలంగాణ టాప్

(మొదటిపేజీ తరువాయి)

రంగంలో ఉత్పత్తి సాధ్యమవుతుంది. అత్యంత ప్రధానమైన విద్యుత్ రంగంపై ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి రోజు నుంచే ప్రత్యేక దృష్టి సారించి ఈ రంగంలో నెలకొన్న ఇబ్బందులను క్రమేణ అధిగమిస్తూ వచ్చారు. రాష్ట్ర విభజనకు ముందు విద్యుత్ కోతలతో రాష్ట్రంలోని అన్ని రంగాలు కుదేలైపోతున్నాయన్న ప్రమాదాలను గుర్తించిన సీఎం కేసీఆర్ ఈ రంగంపైనే పూర్తిగా దృష్టిసారించి ఎలాగైనా సరే విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీసుకువెళ్లలని తలంచారు. ప్రభుత్వ ఏర్పాటైన సంవత్సరంలోనే విద్యుత్తు సాధించి రాష్ట్రంలోని రైతాంగానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తూ సత్తా చాటింది.

రోజుకు 5 లేదా 6 గంటలు కూడా విద్యుత్ ఇవ్వలేని పరిస్థితి నుంచి మిగులు విద్యుత్ సాధనకు ప్రభుత్వం వచ్చింది. వ్యవసాయ రంగానికి ఇస్తున్న 24 గంటల కరెంటు సరఫరాకు సౌర విద్యుత్ ఎంతో ఉపయోగపడుతోంది. గతేడాది విద్యుత్ సాధారణ డిమాండ్ 7000 మెగావాట్లు ఉండగా.. జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్రంలో 9 నుంచి 9500 మెగావాట్ల వరకు విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. 15000 మెగావాట్ల సామర్థ్యం వరకూ విద్యుత్ శాఖ సిద్ధంగా ఉండగా.. ఇందులో 3,150 మెగావాట్ల విద్యుత్ కేవలం సౌర విద్యుత్ నుంచే వస్తుండటం రాష్ట్రానికి గర్వకారణంగా మారిందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 37 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి మాత్రమే రాష్ట్రంలో జరుగుతూ ఉండేది. కాని రైతాంగానికి పగటిపూట 3,150 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేసే పరిస్థితి ఏర్పడింది. సౌర విద్యుత్‌లో ఊహించని ఫలితాలు సాధించి తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలిచింది. రాష్ట్రం ఏర్పడ్డాక సౌర విద్యుత్‌కు సంబంధించి సీఎం కేసీఆర్ నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల అనుమతికి ఏకగవాక్ష విధానం ప్రవేశపెట్టి వాటికి పెద్ద ఎత్తున సౌర విద్యుత్‌ను సరఫరా చేస్తూ వచ్చారు. పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు పరిశ్రమలు సైతం ముందుకు రావడంతో ఈ రంగంలో ఆశించిన లక్ష్యాలను సాధించగలిగామని అధికారులు చెబుతున్నారు. సౌర విద్యుత్‌లో మొదటిస్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉండగా.. ఆ తర్వాత రాజస్థాన్ నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడంతో విద్యుత్ వినియోగం అధికమైంది. భవిష్యత్తులో సౌర విద్యుత్ రంగంలో మరో 1000 మెగావాట్లు ఉత్పత్తి చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. రూఫ్‌టాప్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలు సైతం ఆసక్తి కనబరుస్తుండటంతో వారికి ప్రోత్సాహకాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇంటి డాబాల మీద సౌర విద్యుత్ ఉత్పత్తికి అనేకమంది ముందుకు వస్తుండటంతో వారినుంచి విద్యుత్ కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నెట్ మీటరింగ్ విధానం ద్వారా విద్యుత్ సంస్థలకు కరెంటును విక్రయించడం లాభసాటి కావడంతో ఈ సౌర విద్యుత్ రంగంపై వినియోగదారుల్లో మరింత ఆసక్తి పెరిగిందని అధికారులు అంటున్నారు. గృహ వినియోగదారులకు సైతం ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ని సరఫరా చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉంది.

## గ్రీన్ హైదరాబాద్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉచిత నేత్ర శిబిరాలను నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. గరిష్టంగా మూడు నెలల్లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసే విధంగా లక్ష్యాన్ని ఎంచుకుని పనిచేయాలన్నారు. ఈ శిబిరాల్లో ఉచిత స్క్రీనింగ్‌తో పాటు కళ్ళద్దాలు కూడా ఉచితంగా అందజేయాలని సూచించారు.

## తపాలా కార్యాలయాల్లో రిజర్వేషన్లు




**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ప్రధానమైన తపాలా కార్యాలయాల్లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్లను ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే ఉన్న ఇలాంటి కౌంటర్ల సంఖ్యను పెంచేందుకు తపాలా శాఖతో రైల్వే అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే కొన్ని తపాలా కార్యాలయాల్లో ఈ సౌకర్యం ఉంది. అధీకృత డీలర్ల ద్వారా కూడా రైలు ప్రయాణికులు సీట్లను రిజర్వు చేసుకొనే వెసులుబాటు కలిగించారు. అయినప్పటికీ ప్రయాణికుల ఇబ్బందులు తప్పడం లేదు. అన్ని ప్యాసింజర్ రిజర్వేషన్ కౌంటర్లలో రద్దీ భారీగా పెరుగుతుంది. రెండవ తరగతి ప్రయాణికులు అత్యధికులు రైల్వే బుకింగ్ కౌంటర్ల ద్వారానే సీట్లు రిజర్వు చేయించుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైలు సౌకర్యం ఉన్న సమీప ప్రాంతాల్లోని తపాల కార్యాలయాల్లో రిజర్వేషన్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు భావించారు. కౌంటర్ల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలను తపాలా అధికారులు సమకూర్చవలసి ఉంటుంది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ద్వారా టికెట్ల రిజర్వేషన్లు భారీగా పెరిగిపోతున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు. సమీపంలోనే నగదు రూపంలో ఛార్జీలు చెల్లించే ప్రయాణికులు, ఆన్‌లైన్ సౌకర్యంలేని ప్రయాణికులు, కౌంటర్ల ద్వారా రైళ్ల రాకపోకలను విచారించి టికెట్ బుక్ చేసుకొనే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సదుపాయం అందుబాటులోకి తేబోతున్నామని వివరించారు. ఇప్పటికే తపాలా కార్యాలయాను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే సేవలను ప్రారంభిస్తామని వెల్లడించారు. తపాలా కార్యాలయాల్లో ఏర్పాటు చేసే రిజర్వేషన్ కౌంటర్లలో నగదుతో పాటుగా నగదు రహిత ఛార్జీల చెల్లింపులను కూడా అనుమతించడం జరుగుతుందన్నారు.

## రైల్వేలో వారసత్వ ఉద్యోగాలు



•ఏటా 2,500 మందికి పైగా నియామకం •గత నాలుగేళ్లలో పదివేల మందికి ఉద్యోగాలు •వివిధ కేటగిరీల్లో 3262 పోస్టుల భర్తీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : దక్షిణ మధ్య రైల్వేలో 'లార్జెస్' పథకం నాల్గవ తరగతి ఉద్యోగులకు వరంగా మారింది. ఈ కేటగిరిలోని సిబ్బంది ఆరోగ్యరీత్యా ఉద్యోగులుగా కొనసాగడానికి అనర్హులని గుర్తించిన పక్షంలో స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ చేసే అవకాశం ఉంది. వారి స్థానంలో కుటుంబంలోని అర్హులైన వారికి అదే ఉద్యోగం రైల్వే కల్పిస్తుంది. ఈ విధంగా రైల్వేలో ఏటా సుమారు 2,500 మంది వారసత్వ ఉద్యోగులుగా చేరుతున్నారు. గత నాలుగు సంవత్సరాల్లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్లలో సుమారు 10 వేల మంది డిపెండెంట్ ఉద్యోగులుగా చేరి ఉంటారని రైల్వే అధికారులు తెలిపారు.

ట్రాక్‌మెన్, కలాసీ, లోకోపైలెట్ విభాగాల్లో పని చేస్తున్న సుమారు 35 వేల మంది ఉద్యోగులకు 'లార్జెస్' పథకం వర్తింప చేస్తున్నారు. కొంతకాలంగా రైల్వేలో వారసత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసే వారి సంఖ్య కూడా అదే స్థాయిలో ఉంది. ఈ వెసులుబాటు నాల్గవ తరగతి కేటగిరీలకు మాత్రమే పరిమితమైంది. దీనికోసం లిబరలైజ్డ్ యాక్టివ్ స్కీం ఫర్ గ్యారంటీ ఎంప్లాయిమెంట్ ఫర్ సేఫ్టీ పథకం దోహదపడుతుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆరు డివిజన్ల పరిధిలో గత నాలుగు సంవత్సరాల కాలంలోనే సుమారు 10 వేల మందికి పైగా వారసత్వ ఉద్యోగులుగా చేరారు. కలాసీ, ట్రాక్‌మెన్, లోకోపైలెట్ కేటగిరిలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అనారోగ్యం కారణంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన పక్షంలో వారి కుటుంబంలో అర్హులైన వారికి వారసత్వ ఉద్యోగం ఇవ్వడం కోసం రైల్వేలో లార్జెస్ పథకం అమలు చేస్తోంది. రైల్వేలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయాలని, ఉద్యోగులపై పని భారం తగ్గించాలని ఉద్యోగ సంఘాలు కొంతకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. అఖిల భారత స్థాయిలో సమస్య తీవ్రతను కేంద్రం దృష్టికి తీసుకొచ్చాయి. దీంతో 25,505 ఉద్యోగాలు భర్తీ చేయడానికి రైల్వే మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంది. ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. ఈ మొత్తంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 3,262 మంది ఉద్యోగులను నియమించే అవకాశం ఉంది.

దీనికి తోడు లార్జెస్ పథకం కింద కూడా నిరంతర ప్రక్రియగా ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయి. ఈ పథకం వర్తించే కేటగిరిలోని ఉద్యోగులు ఐదేళ్ల సర్వీస్ ఉండగానే స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకొనవలసి ఉంటుంది. ఈ విధంగా దరఖాస్తు చేసుకొనేవారు 28 ఏళ్ల నుండి 33 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నవారై ఉండాలి. మెడికల్ అన్‌ఫిట్ ధ్రువీకరణతో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలి. అప్పుడే ఉద్యోగి పిల్లల్లో అర్హులైన వారికి అదే ఉద్యోగం ఇవ్వడం జరుగుతుంది. సంతానం లేని ఉద్యోగికి ఈ వెసులుబాటు లేదు. వాలంటరీ రిటైర్మెంట్ కోసం దరఖాస్తు చేసుకొనే వారి వయస్సు 50 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. వైద్యపరంగా వారు విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నారని వైద్యులు నిర్ధారించవలసి ఉంటుంది. దీనికి కూడా కొన్ని కచ్చితమైన ప్రమాణాలను గుర్తించడం జరిగింది. రైల్వేలో ఉద్యోగ విరమణ వయస్సు 60 సంవత్సరాలు. కొంతమంది ఉద్యోగులు పిల్లల భవిష్యత్‌ను పరిగణలోకి తీసుకొని వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని వారసత్వ ఉద్యోగాలు ఇప్పించుకుంటున్నారు. ఏ పోస్టులో రిటైర్మెంట్ కోరితే ఆ పోస్టులోనే డిపెండెంట్ ఉద్యోగం ఇస్తారు. నాల్గవతరగతి ఉద్యోగుల్లో లార్జెస్ పథకం కింద గుర్తించిన ఉద్యోగుల పని శ్రమతో కూడినదైనందున వారు 50 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత పనిచేయలేక అనారోగ్యం పాలవుతున్నందున కుటుంబపోషణ భారంగా మారిందని, ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని డిపెండెంట్ ఉద్యోగం కల్పించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించిందని ఉన్నతాధికారులు తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగులుగా చేరుతున్న యువకుల్లో అత్యధికులు ఉన్నత విద్యను అభ్యసించిన వారే ఉంటున్నారని, ఉద్యోగావకాశాలు లేక డిపెండెంట్‌గా నాల్గవ తరగతి ఉద్యోగాలు చేయడానికి ముందుకొస్తున్నారని తెలిపారు.

## నాణ్యతలో రాజీలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని కోరారు. కనివిని ఎరుగనిరీతిలో పనులు జరుగుతున్నందున క్వాలిటీ కంట్రోల్ విభాగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో పాలు పంచుకుంటూ ఆకుపచ్చని తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములవుతున్నందుకు ఇరిగేషన్ శాఖకు చెందిన అన్ని స్థాయిలలోని ఇంజనీర్లు గర్వపడాలని మంత్రి హరీష్‌రావు అభిప్రాయపడ్డారు. సాగునీటి శాఖను ప్రాజెక్టుల అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్తీకరించినట్లు చెప్పారు. గత కాంగ్రెస్ హయాంలో ఈపిసి విధానం వల్ల సాగునీటి శాఖ నిర్వీర్యం అయిందన్నారు. సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైన్, ఎస్టిమేట్స్ అన్నీ కూడా గతంలో ఏజెన్సీలే చేసేవని.. నాణ్యతా ప్రమాణాలు కూడా థర్డ్‌పార్టీకి అప్పగించారన్నారు. ఇంజనీర్ల సామర్థ్యాన్ని నిర్వీర్యం చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈపిసి విధానం రద్దు చేసి నీటిపారుదల శాఖను బలోపేతం చేసిందన్నారు.

**ఇంజనీర్లలో జవాబుదారీతనం**

సాగునీటి శాఖలో ఇంజనీర్ల బాధ్యతను పునరుద్ధరించామని మంత్రి హరీష్ చెప్పారు. బాధ్యతతో పాటు ఇరిగేషన్ ఇంజనీర్లలో జవాబుదారీతనం పెరిగిందన్నారు. వేలకోట్ల రూపాయల పనులు రాష్ట్రంలోఅన్ని జిల్లాల్లో జరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, వాటి పంపు హౌజ్‌లు, సర్జ్‌పూల్స్ , టన్నెల్‌ల తవ్వకం, లైనింగ్ పనులు చూసి దేశమంతా అబ్బురపడుతున్నదన్నారు. రోజుకు ఒక లక్ష క్యూబిక్‌మీటర్ల మట్టి పని, 20వేల క్యూబిక్‌మీటర్ల కాంక్రీట్ పనులు జరుగుతున్నాయన్నారు. రోజుకు 2లక్షల సంచుల సిమెంట్ వినియోగం జరుగుతున్నదన్నారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి, చనాకా- కొరాట, తుపాకుల గూడెం, సదర్‌మాట్ బ్యారేజీల నిర్మాణం, వందలాది భారీ స్ట్రక్చర్లు జరుగుతున్నాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్లు అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. వెయ్యేళ్ళ కిందట కాకతీయులు నిర్మించిన చెరువులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, మనం కూడా కాకతీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. బిల్లులు చెల్లించేముందు తప్పనిసరిగా సైట్‌కు వెళ్ళాలని, కొలతలు.. నాణ్యత పరిశీలించాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు సంతృప్తి చెందిన తర్వాత సర్టిఫికెట్లు జారీచేయాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఎన్‌సి మురళీధర్‌రావు, నాగేందర్ రావు, సిఈలు సునిల్, హరిరామ్, ఖగేందర్, సురేష్, శ్యాం సుందర్, మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములకూ పెట్టుబడి సాయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిలో నిజమైన లబ్ధిదారు పొజిషన్‌లో ఉండి సాగు చేస్తున్న భూములను తాజాగా గుర్తించారు. ఇవి దాదాపు 20 లక్షల ఎకరాలుగా తేలింది. 1.62 కోట్ల ఎకరాలకుగానూ 56 లక్షల ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.4వేలు సాయంగా ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. మిగిలిన కోటీ 31 లక్షల ఎకరాలకు వానాకాలంలో రూ.4వేలు ఇవ్వాలని యోచిస్తున్నట్లుగా సమాచారం. రెండింటికీ కలిపి రూ. 9700కోట్లు అవసరం కానున్నట్లు అంచనా.

బీడు భూముల పరిస్థితిపై ఎటువంటి సమాచారం కోరలేదని రెవెన్యూ శాఖ అంటోంది. రాష్ట్రంలో 71 లక్షల మంది భూ యజమానులు ఉన్నారు. 5 లక్షల మంది కౌలు రైతులకు పంట సాయం అందజేసేది లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. వీరి వివరాలు, రుణ అర్హత కార్డుల జారీ నిల్చి పోయింది. మరోవైపు భూ యజమానులు తమ భూములను కౌలుకు ఇచ్చే పరిస్థితి కూడా కనిపించడంలేదు.

**మరోవైపు క్రమబద్దీకరణ...**

నిరుపేదలకు ప్రభుత్వం దానంగా ఇచ్చిన అసైన్డ్ భూముల్లో పాగా వేసినవారికి, ఆక్రమణదారులకు, కొనుగోలుదారులకు ఎటువంటి సాయం ప్రస్తావన లేకుండా మరో వరం అందించాలని చూస్తోంది. రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లను యాజమాన్య కాలమ్‌లో నమోదు చేసి పట్టాలిచ్చి క్రమబద్దీకరించాలని చూస్తోంది. ఇందుకు అవసరమైన రీతిలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్(ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) పీఓటీ చట్టం-1977లోని సెక్షన్ 4ను పరిశీలిస్తున్నది. ఆయా భూములను కొనుగోలు చేసిన బీపీఎల్ కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ కులాలవారీగా లెక్కలు తీస్తూ వారి సామాజిక హోదాను గణిస్తున్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 22,63,139 ఎకరాల అసైన్డ్ భూమి 15.83లక్షల మంది వద్ద ఉండగా 1,85,101 ఎకరాలతో అసిఫాబాద్ మొదటి స్థానంలో ఉంది. భద్రాద్రి కొత్తగూడెంలో 1,66,557 ఎకరాలు, నల్గొండలో 1,38,686ఎకరాలు, కామారెడ్డిలో 1,33,157 ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని గుర్తించారు.

**అన్యాక్రాంతంలో కొంత...**

రాష్ట్రవ్యాప్తంగా 22,63,139 ఎకరాల భూమిని పేదలకు ఆయా ప్రభుత్వాలు అసైన్ చేశాయి. 15.83 లక్షల మంది నిరుపేదలకు వీటిని పంపిణీ చేసినా అవి వారి చేతిలో లేవని తాజాగా ప్రభుత్వం గుర్తించింది. సమాచారం మేరకు 98 వేల అసైన్డ్ భూములు ఇతరుల చేతుల్లోకి చేరినట్లు గుర్తించారు. పట్టా ఒకరి పేరుతో ఉండగా పొజిషన్‌లో మరొకరు ఉండటం, కొందరి భూములు నిరుపేదల కబ్జాలో, కొందరి భూములు వివాదాల్లో ఉండటం, కోర్టు పరిధిల్లో పేరుకుపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి.

# రాజకీయాల్లోకి వస్తున్నా!

•ఉద్యమ ఆకాంక్షలు సాధించేందుకే పార్టీ •పోరాటమే కాదు... రాజకీయమూ తెలుసునని నిరూపిద్దాం •సమస్యలు పోవాలంటే ఇంకా గట్టిగా కొట్లాడాలి •జేఏసీ ఇలాగే కొనసాగుతది... సమాంతరంగా పార్టీ •రైతులు, నిరుద్యోగ సమస్యపై గట్టి పోరు •గ్రామస్థాయి నుండి రైతు ఉద్యమానికి కార్యాచరణ •జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో చైర్మన్ ప్రొ. కోదండరాం




**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చేందుకు రాజకీయ పార్టీ ఏర్పాటుచేయబోతున్నామని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ప్రకటించారు. హైదరాబాద్ శివారులోని తుర్కయంజాల్‌లో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై ఉద్యమ కార్యాచరణ ఖరారు చేసేందుకు నిర్వహించిన జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాజకీయాల్లోకి తాను రాకూడదని అనుకున్నానని, కానీ అనివార్యంగా పార్టీ పెట్టాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. జయశంకర్ సార్ తెలంగాణ రాగానే పని అయినట్లు కాదు.. దానిని కాపాడుకోవాలని చెప్పారని, ఇపుడు అందుకోసమే రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విధానాలపై యువత పెద్ద ఎత్తున ప్రశ్నించాలన్నారు. రైతుల సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని అనేకసార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చినం. ముఖ్యమంత్రికి కూడా బహిరంగంగా విజ్ఞప్తి చేసినం.. బ్రతిమిలాడినం.. ప్రశ్నించినం.. అయినా మార్పురాలేదు.. అందుకే నిలబడ్డం. ఇక ఉద్యమ ఆకాంక్షలు సాధించితీరుతాం. ఆ లక్ష్యం సాధించడానికి ఏ పనయినా చేస్తం అని కోదండరాం ప్రకటించారు. కోర్టులు చెప్పినా.. ఈ ప్రభుత్వం వినే పరిస్థితి లేదని, రైతుల సమస్యలపై అనేక అధ్యయనాలు చేసి నివేదిక ఇస్తే.. ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని, కోర్టులో అందజేస్తే ప్రభుత్వాన్ని స్పందించమని ఆదేశించిందని, అయినా స్పందన లేదన్నారు. రైతు కమిషన్ ఏర్పాటుపైనా కోర్టు ఆదేశాలకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో అందరికీ తిండిపెట్టే రైతు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. అందరికి తిండిపెట్టే మాకా ఈ పరిస్థితి అని ఆవేదన చెందుతున్నారన్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో సమస్య ఉందని.. ఒక జిల్లాలో నీటి సమస్య ఉంటే, ఇంకో జిల్లాలో నకిలీ విత్తనాలు, మార్కెట్‌లో ధరలేని పరిస్థితులున్నాయన్నారు. పశువుల దాడి సమస్యతో కూడా రైతులు.. వరి, పప్పు ధాన్యాలు కాకుండా అనేక చోట్ల పత్తి పంట వేస్తున్న పరిస్థితి ఉందన్నారు. మార్కెట్ రైతుపై పెత్తనం చేస్తున్నదని, రైతులు దోపిడీకి గురవుతున్నారన్నారు.

**వచ్చింది.. భౌగోళిక తెలంగాణనే..**

ప్రస్తుతం భౌగోళికంగా మాత్రమే తెలంగాణ ఏర్పడిందని, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడం లేదని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చేందుకే రాజకీయ పార్టీ పెడుతున్నామన్నారు. వ్యవసాయం బాగుపడలేదని, పాలీహౌజ్‌లకు వేలకోట్లు ఇస్తున్నారు గానీ రైతుకు మాత్రం ఇవ్వడం లేదన్నారు. జేఏసీ పక్షాన రైతుల సమస్యలపై పోరాడినా.. ఈ ప్రభుత్వం మారలేదన్నారు. రాజకీయాలు మార్చేందుకు, రాజకీయ వ్యవహారం మార్చేందుకు ఒక్కొక్క అడుగు వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతు డిక్లరేషన్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో గద్దర్, ప్రముఖ న్యాయవాది రచనా రెడ్డి, తీన్మార్ నవీన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తం, కంచర్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 10న పార్టీ ఆవిర్భావ సభ

•వరంగల్ వేదిక... •గుర్తు రైతు నాగలి

ప్రొఫెసర్ కోదండరాం కొత్తగా ఏర్పాటు చేయనున్న పార్టీ ఆవిర్భావ సభ మార్చి10న వరంగల్‌లో జరగనున్నది. మిలియన్ మార్చ్ నిర్వహించిన రోజునే పార్టీ జెండా, ఎజెండా, విధి విధానాలు అన్నీ ప్రకటించే అవకాశం కనబడుతోంది. ఆదివారం నిర్వహించిన జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించిన కోదండరాం పేరును ప్రకటించలేదు. అయితే తెలంగాణ జనసమితి పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే దరఖాస్తు చేసిన నేపథ్యంలో పార్టీ పేరు దాదాపు అదే ఉంటుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి.

మార్చి 10 తర్వాత దక్షిణ తెలంగాణలో రెండు సభలు, ఉత్తర తెలంగాణలో రెండు సభలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ గుర్తుగా రైతు నాగలిని ఎంచుకున్నారు.

## అమెరికాలో రెండు రైళ్లు ఢీ

•ఇద్దరు మృతి.. 50 మందికి గాయాలు



**న్యూయార్క్**: అమెరికాలో రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. 50 మందికిపైగా గాయపడ్డారు. ప్రయాణికుల రైలు న్యూయార్క్ నుంచి మియామికి వెళుతుండగా దక్షిణ కరోలీన వద్ద ఒక సరుకు రవాణా రైలును ఢీకొంది. ఈ ఘటన అమెరికా కాలమానం ప్రకారం తెల్లవారు జామున 2.35 సమయంలో (భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం1.05) జరిగింది. ఈ ప్రమాదంలో ప్రయాణికుల రైలు ఇంజిన్ ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలును ఢీకొని వెనుకబోగీలపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో రైల్లో 8 మంది సిబ్బంది, 139 మంది ప్రయాణికులున్నారు. దక్షిణ కరోలినాలోని కొలంబియా పట్టణ శివార్లలో ఈ ఘటన చోటు చేసుకుంది. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



- ఫిబ్రవరిలో కొత్త శోభ
- మొదలైన పెళ్లిళ్ల సందడి
- ఊపందుకున్న వ్యాపారాలు

శుభ ముహూర్తాలు

# పెళ్లిళ్లు షురూ!

● ఫిబ్రవరి 21న దివ్యమైన ముహూర్తం... అదే రోజు వేలాది వివాహాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** వస్తున్న మండు వేసవి తనతో ఎండలే కాదు....కొత్త శోభనూ మోసుకొస్తోంది. రాష్ట్రానికి శుభగడియలు సమీపిస్తున్నాయి. శుభ ముహూర్తాలతో రాష్ట్రానికి పెండ్లి కళ రానున్నది. ఇన్నాళ్లూ గా నిస్తేజంగా ఉన్న మూఢాలతో కూడిన మూడు నెలల కాలానికి శుభ గడియలతో ముగింపు పలకనుంది. దీంతో రాష్ట్రమంతటా పెళ్లి భాజాలు మోగేందుకు ముస్తాబ వుతున్నది. మూడు నెలలుగా మూఢాలతో ముహూర్తం లేక వేచి చూసిన జంటలు వేదమంత్రాల సాక్షిగా మూడు ముళ్లతో ఏకమయ్యేందుకు సిద్ధమవుతున్నాయి. గతేడాది నవంబర్ 24నుంచి 16వరకు శుభ ముహూ ర్తాలతో మూడు రోజుల్లో లక్షకుపైగా వివాహాలు జరి గాయి. అప్పటినుంచి ఈ ఏడాది ఈనెల రెండో వారం వరకు శుక్ర మౌఢ్యమి కావడంతో మూఢాలు వచ్చాయి. ఈ మూఢాలు ఈ నెల రెండో వారంతో ముగి యనున్నాయి. ఈనెల 19నుంచి అక్టోబర్ వరకు అన్నీ శుభముహూర్తాలేనని వేదపండితులు చెబుతుండగా రాష్ట్రమంతా వివాహ గడియలకోసం సిద్ధమ వుతున్నతీరు కనిపిస్తోంది. హేవళంబి నామ సంవత్స రంలో ఎక్కువగా మూఢాలు వచ్చాయని పండితులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శుభ గడియలు, ముహూర్తాలు తక్కువగా ఉండటంతో ఉన్న మంచి ముహూర్తాల్లోనే ఎక్కువగా శుభ కార్యాలు నిర్వహించాల్సి వచ్చింది. దీంతో సహజంగానే రద్దీ పెరిగింది. అందుకు అనుగుణంగా ఫంక్షన్ హాళ్లు మొదలుకుని, భాజాలు, భజంత్రీలు, పురోహితులు, వంట వాళ్ల వరకు అంతా భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో భారీగా రేట్లు పెరిగాయి. ఈ నేపథ్యంలో గతేడాది కొందరు తమ వివాహాలను వాయిదా వేసుకుని ఫిబ్రవరి 19 ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. వీరి నిరీక్షణకు తెరదించేలా శుభ ముహూర్తాలు భారీగా వస్తున్నాయని వేద పండితులు చెప్పడంతో వారి ఆశలకు ఊపిరి వస్తున్నట్లుగా పరిస్థితి మారుతోంది. దీంతో రాష్ట్రమంతటా పచ్చటి పందిళ్లతో పెళ్లిళ్లకు సిద్ధమవుతున్న వాతావరణం పల్లెలనుంచి పట్నందాకా కనిపిస్తున్నది. అయితే ఎంతగా శుభ ముహూర్తాలు వస్తున్నప్పటికీ ఈ ఏడాది ధనుస్సులోకి శని రాకతో అంత పెద్దగా దివ్యమైన ముహూర్తాలు లేవని కూడా మరో వాదన ఉంది. కాగా ఉన్నంతలో ఈ ఏడాది ఈనెల 23, 24 తర్వాత మార్చి 4న దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని చెబుతున్నారు.

## 19నుంచి ముహూర్తాలు

ఈ నెల 19నుంచి మే నెల వరకు మంచి గడియలే ఉన్నాయని చెబుతున్నారు. శుక్ర మూఢం పూర్తవుతుండటంతో అమావాస్య దాటితే ఈ నెల 19న మంచి రోజులు ఆరంభం కానున్నాయని పండితులు పేర్కొంటున్నారు. కాగా ప్రతీ ఏడాది మాఘ మాసంలో వివాహ ముహూర్తాలు ఉంటుండగా ఈ ఏడాది శుక్ర మూఢం ఫలితంగా ముహూర్తాలు లేవు.దీంతో ఫాల్గుణ మాసంలో అమవాస్య దాటగానే శివరాత్రి తర్వాత శుభ గడియల రాకతో శుక్ర మూఢాలు ముగియనున్నాయి. దీంతో శుభ ముహూర్తాల జాఢ సమీపిస్తుండటంతో ఎవరి నోట విన్నా పెళ్లిముచ్చటే వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యాపారాలు జోరందుకున్నాయి. కొనుగోళ్లు, షాపింగ్‌లు హోరెత్తుతున్నాయి. మంచి రోజుల రాకతో అన్నిరకాల వ్యాపారాల్లో స్తబ్ధత వీడి ఉత్సాహం నెలకొంటోంది. వస్త్ర వ్యాపారం మొదలు, నగలు, ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్, హోటళ్లు, కార్లు, వాహనాల కొనుగోలు వంటివి జోరందుక న్నాయి. ఫంక్షన్ హాళ్ల బుకింగ్‌లకు పెళ్లి కుటుంబాలు క్యూ కడుతున్నాయి. ఈ నెల 21న మరోసారి రాష్ట్రం పెళ్ళిళ్లతో ఎక్కడికక్కడ స్థంభించనుంది. 21న భారీ ఎత్తున పెళ్లిళ్లు జరగనున్నాయని పండితులు చెబుతున్నారు. ఈ సీజన్‌లోనే మార్చి 4న అత్యుత్తమ దివ్యమైన ముహూర్తం ఉందని వేద పండితులు చెప్తుండటంతో అదే రోజు కోసం లక్షలాది జంటలు వేచిచూస్తున్నాయి. 21న దివ్యమైన ముహూర్తానికి తోడు ఆదివారం కావడం, విద్యార్థులకు పరీక్షలు ముగిసేందుకు సమయం కావడంతో కలిసి వస్తుందనే భావన నెలకొంది. మంచి రోజుల రాకతో గతంలో ఉన్న స్తబ్ధత పోయి పెళ్లిళ్ల సీజన్‌లో సహజంగా కనిపించే హంగూ ఆర్భాటాలు, పండగ వాతావరణం పునఃదర్శనమిస్తోంది. పెళ్లి వేడుకలకు అడుగడుగునా అడ్డుగా నిల్చిన జీఎస్టీ భారం, పెద్ద నోట్ల రద్దు, నగదుపై ఆంక్షల వంటి అవాంతరాలు తొలగిపోవడంతో పెళ్లి భాజాలు ఆనందోత్సాహాల మధ్య మోగనున్నాయి. పురాతన కాలంనుంచీ భారత హిందూ సంస్కృతి సాంప్రదాయాల్లో పెళ్లి వేడుకలకు ఉన్న విశిష్టస్థానం మరింత ద్విగుణీకృతం కానుంది.

## పెరుగుతున్న సగటు వ్యయం...

దేశవ్యాప్తంగా పెళ్లిళ్లకు వెచ్చించే ఖర్చు భారీగా పెరుగుతూ వస్తోంది. ఒక వ్యక్తి తన ఆస్తిలో 5వ వంతు పెండ్లి ఖర్చులకు వినియోగిస్తున్నారని ఒక అంచనా. ఒక్కో పెళ్లికి రూ. 3 లక్షలనుంచి గరిష్టంగా రూ. 8కోట్లు ఖర్చు చేసిన సందర్భాలు ఉన్నాయని ఇటీవలే ఒక నివేదిక బైట పెట్టింది. పెళ్లిళ్లకు డెకరేషన్లు, అందానికి మెరుగులు, అలంకారం, కాస్మొటిక్స్ వంటివాటిపై ఖర్చు చేస్తున్నారు. దేశంలో ఆన్‌లైన్ సంబంధాలకు వేదికలుగా ఉన్న షాదీ.కాం, భారత్ మాట్రిమోనీ వంటి వెబ్‌సైట్లే ఏడాదికి రూ. 300నుంచి రూ. 350కోట్లను ఆర్జిస్తున్నాయంటే ఏ మేరకు పెళ్లిళ్లకు వెచ్చిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పాత రోజుల్లో పెండ్లి అంటే ఇండ్లలో చేసేవారు. కానీ వాతావరణ పరిస్థితులు, స్టేటస్, స్థలాభావం వంటి అనేక కారణాలతో అందరూ ఫంక్షన్ హాళ్లలోనే పెళ్లిళ్లకు క్యూ కడుతున్నారు.

ఇరిగేషన్ ప్రచారకర్తగా...

# ఐదేళ్ల బుడతడు

• తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులు కంఠస్థం • అబ్బురపడ్డ మంత్రి హరీష్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** పట్టుమని ఐదేళ్లు లేని ఓ బుడతడు.. మంత్రినే ఆశ్చర్యపరిచాడు. తను సంపాదించిన పరిజ్ఞానం.. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల గురించి కంఠతా చెప్పే విషయాలతో రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్‌రావు అబ్బురపడ్డాడు. వెంటనే నీటిపారుదల శాఖ ప్రచారకర్తగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు ఎందుకు మార్చారు.. మహారాష్ట్ర అద్భుతాలు.. కెసిఆర్ దూరదృష్టిని నెహాల్ అనే ఐదేళ్ల బాలుడు అలవోకగా చెప్పగా, మంత్రి హరీష్‌రావుతో పాటు టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ గంటా చక్రపాణి, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, ఈఎన్‌సి మురళీధర్ సహా పలువురు ఇంజనీర్లు ఆదివారం నివ్వెరపోయారు. ఖమ్మం జిల్లాకు చెందిన హనుమంతరావు హైదరాబాద్ షాపూర్‌నగర్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి. కొడుకు నెహాల్ ప్రాజెక్టుల గురించి అనర్గలంగా మాట్లాడుతుండగా మంత్రి దృష్టికి టిఆర్ఎస్ నాయకులు తీసుకొచ్చారు. జలసౌధలో వందమంది ఇరిగేషన్ ఇంజనీర్ల సమక్షంలో నెహాల్ తన జ్ఞాపకశక్తిని మేధాశక్తిని ప్రదర్శించాడు. పాలమూరు-రంగారెడ్డి సహా ఇతర ప్రాజెక్టులన్నింటి గురించి నెహాల్ వివరంగా చెబుతుంటూ నేతలు అచ్చెరువొందారు. బుడతడి ప్రతిభకు ఆకర్షితుడైన మంత్రి హరీష్‌రావు తెలంగాణ ఇరిగేషన్ శాఖకు ప్రచారకర్తగా ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళపల్లికి చెందిన నెహాల్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి, ముఖ్యమంత్రి కెసిఆర్ రీడిజైన్ చేసిన తీరు గురించి అలవోకగా.. అనర్గళంగా దాదాపు 20నిమిషాల పాటు నెహాల్ తన ప్రతిభను ప్రదర్శించాడు. యుకెజి చదువుతున్న నెహాల్ తెలంగాణ ప్రాజెక్టుల ఆయకట్టు ఇతర ప్రయోజనాలపై ఐదేళ్లబాలుడు ప్రసంగించిన తీరుపై అందరూ ఆశ్చర్యపోయారు. నెహాల్ చదువుకయ్యే ఖర్చు మొత్తం నీటిపారుదల శాఖ భరిస్తుందని ప్రకటించారు. తనకు తాన సిఎం కెసిఆర్‌ను కలవాలని ఉందని నెహాల్ చెప్పగా, త్వరలోనే ఆ కోరిక నెరవేరుస్తామని హరీష్ హామీనిచ్చారు. నెహాల్‌తో పాటు అతని కుటుంబసభ్యులను కాళేశ్వరం ప్రాజెక్టుకు తీసుకెళ్ళి చూపాలని సిఈ హరిరామ్‌ను మంత్రి ఆదేశించారు. నెహాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు.

# క్లాస్‌రూం నుంచి ప్రజల్లోకి వెళ్లండి

• సామాజిక అధ్యాపకులకు, మేధావులకు టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి పిలుపు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా సాగునీటిరంగంలో జరుగుతున్న అనూహ్యమైన కార్యక్రమాలు, విజయాలను అధ్యయనం చేయాలని రాష్ట్రంలోని యూనివర్శిటీల సామాజిక శాస్త్రాల ప్రొఫెసర్‌లు, టీచర్లను టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి కోరారు. మిషన్‌కాకతీయ సుస్థిర గ్రామీణాభివృద్ధి సంకలనాన్ని ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు ఆదివారం జలసౌధలో ఆవిష్కరించారు. కాకతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ ఈ సంకలనానికి సంపాదకత్వం వహించారు. వ్యవస్థలు సక్రమంగా పనిచేయడంతో పాటు ఆ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చెప్పిన మాటలను చక్రపాణి గుర్తుచేశారు. ప్రాజెక్టుల రీడిజైన్‌తో తెలంగాణ పునర్నిర్మాణం ప్రారంభమైందన్నారు. తెలంగాణ సమాజం రూపురేఖలు అతిత్వరలో మారుతాయన్నారు. మిషన్ కాకతీయ వల్ల గ్రామీణ తెలంగాణ సామాజిక, ఆర్థికరంగం లో అనూహ్యమార్పులు స్పష్టం గా కనిపిస్తున్నాయన్నారు. కాళేశ్వ రం వంటి ప్రాజెక్టులు మిషన్‌కా కతీయ పథకాల అమలుతీరును సామాజిక శాస్త్రవేత్తలు, అధ్యాప కులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇటువంటి పరిశీలన వారు సమర్పించే నివేదికలు ప్రామాణికంగా ఉంటాయన్నారు. ప్రాజెక్టులు, చెరువుల పునరుద్దరణ కేవలం వ్యవసాయరంగానికే పరిమిత మెనవి కావని.. ఇవి తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి దోహదప డతాయ న్నారు. మిషన్ కాకతీయను రెండు విదేశీ యూనివ ర్శిటీలు అధ్యయనం చేసినపుడు మన యూనివర్శిటీలు ఎందుకు చేయకూడదన్నారు. మిషన్ కాకతీయ ప్రభావంపై లోతుగా అధ్యయనం చేయాల్సిన సామాజిక బాధ్యత సోషల్ సైన్సెస్ టీచర్లపై ఉందన్నారు.



# బాల్యానికి మూడుముళ్లా?

(మొదటిపేజీ తరువాయి)

దాడు లకు దిగుతున్నారు. దీంతో అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. ఈ అనాగరిక దుశ్చర్యను రూపుమాపాలంటే ముందుగా తలిదండ్రుల నుంచే మార్పు రావాలి. మరి ఆ మార్పు వచ్చేనా ... వచ్చే అవకాశం ఉందా అంటే ముమ్మాటికి లేదనే సమాధానం వస్తోంది. ఏదేమైనా ఆచారంగా వస్తున్న సాంప్రదాయాన్ని తాము వదులుకోలేమని అదే సాంప్రదాయం ముసుగులో బాల్య వివాహాలకు ఒడిగడుతున్నారు. ఈ సమస్య తీవ్రత ఏ విధంగా ఉందో జరుగుతున్న ఘటనలను బట్టే చెప్పవచ్చు. కనీసం 18 ఏళ్ళు నిండక ముందే బాలికల జీవితాలను సంసారమనే ఊబిలోకి నెట్టేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రా లలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఇలాంటి దారుణ ఘటనలపై 11మంది బాలికలు ఓ లేఖ ద్వారా హైకోర్టు సిజె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ అనాగరిక చర్య ఇంతలా విస్తరించిందా అని సిజె సైతం విస్మయాన్ని వ్యక్తం చేశారు. వెంటనే ఈ అంశాన్ని హైకోర్టు సీరియస్‌గా తీసుకుని పిల్‌గా స్వీకరించింది. సిజెకు బాలికలు రాసిన లేఖలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వేదనాపూరితంగా వివరించారు. తమకు చిన్నతనంలోనే వివాహం జరిపించారని అప్పటి నుంచి తాము అష్టకష్టాలు పడుతున్నామని తెలిపారు. చిన్నతనంలో పెళ్ళిళ్ళు చేయడం వల్ల తమ పిల్లలు సైతం అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వెళ్ళి వైద్యం చేయించుకోవాలన్నా ఆర్థిక స్థితి సరిగా ఉండటం లేదని కూడా వారు తెలిపారు. తమ లాంటి బాధితులు చాలా మంది ఉన్నారని వారు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పిల్ విచారణకు రానుంది. ఏది ఏమైనా బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరిత్యా నేరం. తలిదండ్రులు తమ పిల్లలు ఆడైనా, మగైనా సమాన దృష్టితో చూడాల్సి ఉంది. చిన్నతనంలోనే ఆడపిల్లలను వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు తప్పితే ఆ తర్వాత వారు పడే బాధలను తలిదండ్రులు పట్టించుకోవడం లేదు. ఇది ఒక సాంప్రదాయమంటూ ముసుగేసి వారి జీవితాలను బుగ్గి పాలు చేస్తున్నారు.

# రోడ్డు పనుల్లోనూ రోబోలు!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటాయి. దీనిని వినియోగంలోకి తీసుకోవడం ద్వారా కార్మిక ఖర్చులు, మానవ ప్రాణ నష్టం రెండింటిని తగ్గించవచ్చని రహదారుల నిర్మాణ కంపెనీలు, రహదారుల మంత్రిత్వశాఖ ఆశిస్తున్నాయి.

అశోక బిల్డ్‌కాన్, ఐఎల్అండ్ఎఫ్ఎస్ ట్రాన్స్ పోర్టేషన్ నెట్‌వర్క్స్(ఐటిఎన్ఎల్) అనే రెండు రహదారుల నిర్మాణ కంపెనీలు రహదా రుల నిర్మాణం జరుగుతున్న చోట్ల వాహనాల రాకపోకలను నిర్వహించడానికి రోబోలను వాడుతున్నాయి. వాహనాల రాకపోకలకు అనుగుణంగా స్థిరంగా ఉన్న రోబోను నియమించడం వలన నిర్మాణ పనులు జరిగే ప్రాంతంలోకి వాహనం ప్రవేశించినప్పుడు వాహనదారులు గాయాలపాలవ్వకుండా చూడవచ్చు అని ఐటిఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకుంద్ సప్రే తెలిపారు. దేశంలో రహదారుల నిర్మాణ పనులు జరిగే చోట అలాంటి రోబోలను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు గత డిసెంబర్‌లో రహదారుల మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌కు తెలిపింది. అనేక నిర్మాణ కంపెనీలు ప్రమాదాలకు తావులేనివిధంగా రోబోలను వినియోగిస్తున్నట్టు గత నెల నాల్గవ తేదీన లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు జవాబుగా మంత్రిత్వశాఖ తెలిపింది.

### 29.6 శాతంప్రమాదాలు హైవేలపైనే

భారతదేశంలో రహదారి ప్రమాదాలు నివేదిక ప్రకారం 2016లో మొత్తం రహదారి ప్రమాదాల్లో 29.6 శాతం జాతీయ రహదారులుపై చోటు చేసుకుంటున్నాయి. మొత్తం మరణాల్లో 34.5 శాతం జాతీయ రహదారులపై సంభవించాయి. అదే ఏడాది లో దాదాపు 4,80,652 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 1,50,785 మంది మరణించారు.

### ఖర్చు కూడా తగ్గుతుంది

అలాంటి రోబోల వినియోగంతో మానవ ప్రాణాలు కాపాడ్డమే కాకుండా, రహదారి నిర్మాణ కంపెనీలు కూలీ ఖర్చులను తగ్గించుకోవడంలో ఉపకరిస్తుంది. గత మూడేళ్ళలో ఈ ఖర్చులు దాదాపు 50 శాతం పెరిగిపోయాయి.

# రోబో సైనికులు వస్తున్నారు!


(మొదటిపేజీ తరువాయి)

పాటు మానవుడు చేస్తున్న పనుల ద్వారా సరైనదేదో రోబో తెలుసుకుంటుందని అమెరికా సైనిక పరిశోధన ప్రయోగశాల పరిశోధకుడు గారెట్ వార్నెల్ తెలిపారు. భవిష్యత్ సైన్యంలో సైనికులు, రోబోలు కలిసి పనిచేయవచ్చు అని ఆయన చెప్పారు. మానవులను, రోబోలకు ముందుగానే శిక్షణ ఇచ్చిన పక్షంలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని ప్రాంతాల్లో గాలింపు, సహాయక లేదా నిఘా చర్యలను చేపట్టాలని సదరు బృందాన్ని ఆదేశించవచ్చని వార్నెల్ చెప్పారు.

ఎవరెన్ని చెప్పినా.. వెనక్కి తగ్గొద్దు...

# సమరమే..!

● పార్లమెంటే తొలి వేదిక.. ● అన్యాయంపై గళమెత్తండి ● జనాక్రోశాన్ని వినిపించాలి ● మోడీకీ, మంత్రులకూ చెప్పండి ● ప్రజల మనోభావాలే ముఖ్యం ● సహనానికి హద్దుంటుంది ● నెయ్యం జరిపినా న్యాయం లేదు ● సస్పెన్షన్లకూ వెరవకండి ● ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి, ఆంధ్రప్రభ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంట్‌లో గళమెత్తి ప్రజా ఆక్రోశాన్ని, ఆవేదనను వినిపించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్‌లో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రాష్ట్రానికి అన్యా యం జరిగిందనే ఆవేదన చెందుతున్నారని, ప్రజల మనోభావాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం మనపై ఉందని ఉద్భో దించారు. దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకుందమని మార్గదర్శకం చేశారు. ప్రయో జనాల కోసం ఎంత దూరమైన వెళ్లేందుకు వెనకాడవద్దని, పార్లమెంట్ లో సస్పెండ్ చేసిన వెనుతిరగవద్దంటూ పిలుపునిచ్చారు. చర్చలు.. సమ న్వయం.. ఆందోళన.. ద్వారా మనకు రావాల్సిన న్యాయమైన నిధులు, ప్రాజెక్టులు, ప్రయోజనాలు రాబట్టుకునేందుకు పోరాటం కొనసాగించా లన్నారు. ఆదివారం ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో టిటిపి పార్లమెం టరీ పార్టీ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీలతో పాటు,పార్టీ సీనియర్ నాయకులు పాల్గొనారు. తొలుత రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రధానమంత్రి, మంత్రులకు వివరించాలని, ఆ తర్వాత పార్లమెంట్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించారు. పార్లమెంట్ సమావేశాల్లో సభ్యులు రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించాలని.. అవసరమైతే నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపాలని సూచించారు. రోజుకో రూపంలో ఆందోళన కొనసాగిం చాలని దిశానిర్దేశం చేశారు. రెండు నెలలు పాటు పార్లమెం టు సమావేశాలు జరుగుతాయని, సాధ్యమైనంత త్వరలో రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించు కోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోకపోతే ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, బడ్జెట్ కేటాయింపులపై ఎంపీలు, సీనియర్ నాయకులు అభిప్రాయాలను చంద్రబాబు తెలుసుకున్నారు. ఇదే సందర్భంలో బడ్జెట్‌లో ఏ శాఖకు ఏ విధంగా నిధులు కేటాయింపులు జరిగాయో ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర ఎంపీలు, నేతలకు వివరించారు. ఈ సమావేశం మూడు గంటల పాటు సుదీర్ఘంగా జరిగింది ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ, బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఈ పరిస్థితులలో మౌనంగా కూర్చుంటే కుదరదని, దీనిపై స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నాలుగు బడ్జెట్‌లలో కూడా రాష్ట్రానికి న్యాయం జరగలేదని, ఈ బడ్జెట్‌లో కూడా మరోసారి రాష్ట్రానికి కేంద్రం మొండి చెయ్యి చూపిందన్నారు. మిత్రపక్షంగా సర్దుకుపోతు ఉన్నా మన సహనానికి ప్రతిసారీ పరీక్ష పెడుతుండడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇంకా ఓపిక పట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మిత్రపక్షంగా రాష్ట్రానికి సరైన గౌరవం దక్కడం లేదని, పలుమార్లు న్యాయం చేయాలని తానే స్వయంగా ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులను కలిసిన ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా చూడాలని తాను ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశానని, అయినప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. మోడీ ఫొటోలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పెట్టడం లేదని కొందరు బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు నిజం కావని, దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీలకు, నేతలకు చంద్రబాబు సూచించారు. ప్రతిపక్ష నేత జగన్ ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తూ రోజుకోక నాటకం ఆడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రాధాన్యతాంశం కాదని, ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల అమలే ముఖ్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా బదులు ప్యాకేజి ప్రకటించిన కేంద్రం అవసరమైన నిధులు మంజూరు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, మెట్రో ప్రాజెక్టులపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. తాను ఉద్ధవ్‌థాక్రే, అమిత్‌షాలతో మాట్లాడినట్లు మీడియాలో వచ్చిన కథనాలను ఆయన ఈ సమావేశంలో ఖండించారు. తాను థాక్రేకు ఫోను చేయలేదని, అదేవిధంగా అమిత్‌షా తనతో మాట్లాడారన్న కథనాలు నిజం కావని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపీల అభిప్రాయాలను కోరారు. ఇక మౌనంగా ఉపేక్షిస్తే పార్టీకే నష్టం జరుగుతుందని, నిధులు కేటాయింపు అంశంపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకుందామన్న అభిప్రాయాన్ని కొంత మంది ఎంపీలు వ్యక్తం చేశారు. మరికొంత మంది కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించి ఎన్‌డిఏ నుంచి బయటకు వస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలకు ఇచ్చిన నిధులు మిత్రపక్షమైన మనకు ఇవ్వకపోవడం వివక్షతను చూపుతోందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్రం ఇప్పటి వరకు రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, అనుసరిస్తున్న వైఖరిని కేంద్ర మంత్రి సుజనా చౌదరి వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ, సభలో నిరసనలు, ఆందోళనకు ప్రణాళిక రూపొందించుకుని దిగాలని ఆదేశించారు. పార్లమెంట్‌లో రాష్ట్రప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఎంపీలు గళమెత్తి వినిపించాలని స్పష్టం చేశారు. సస్పెండ్ చేసినా ఏ మాత్రం వెనుకడుగు వేయవద్దని ఎంపీలను చంద్రబాబు ఆదేశించారు. ప్రజల అభిప్రాయాలను కేంద్రానికి వినిపించడంలో కఠినంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. మిత్ర ధర్మంతో ఇప్పటివరకూ మౌనం వహించామని, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు ఏ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

# విడాకుల ఆలోచన లేదు!

- బడ్జెట్ అన్యాయంపై రాజీలేని పోరాటం
- రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: సుజనాచౌదరి

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో రాజీలేని పోరాటం సాగిస్తామని కేంద్ర మంత్రి సుజనాచౌదరి అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటు వెలుపల, లోపల తమ నిరసన తెలియజేస్తామన్నారు. సీఎం నివాస గృహం ప్రాంగణంలోని గ్రీవెన్స్‌సెల్‌లో ఆదివారం కేంద్ర బడ్జెట్‌పై తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సుమారు మూడు గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం కేంద్రమంత్రి సుజనాచౌదరితోపాటు పలువురు ఎంపీలు మీడియా మాట్లాడారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ సాధారణంగా జరిగే పార్లమెంటరీ సమావేశం మాదిరిగానే ఈ సమావేశం జరిగిందని, అయితే కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో గళం విప్పాలని తమ అధినేత చంద్రబాబు దిశనిర్దేశం చేశారన్నారు. బీజేపీతో విడాకుల ఆలోచనేదీ లేదని, అయినా మీడియా కూడా పెళ్లిళ్లపైనే దృష్టిపెట్టాలని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో రాష్ట్రానికి జరిగిన నష్టంపై చర్చించామని, కేంద్రంతో గట్టిగా మాట్లాడి ఆంధ్రప్రదేశ్‌కు రావల్సిన వాటిని రాబట్టాలని నిర్ణయించామన్నారు. చర్చలు జరిపినప్పటికీ నిధులు రావట్లేదన్నారు. బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావన లేకపోవడం అందరికీ బాధ కలిగించిందన్నారు. మిత్రపక్షంగానైనా బీజేపీ తమను గౌరవించలేదన్న బాధ అందరిలో ఉందన్నారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రానికి రావల్సిన హామీలపై పోరాడుతున్నామని రాష్ట్ర ప్రయోజనాలకే తమకు ముఖ్యమన్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

# సాహితీ వాక్షం

## ప్రేమ పూజారి



సుదూర తీరతీర
దూరాన ఉన్న
నా రతీ మన్మధిని

కలువ పువ్వుల కన్నుల
నా కమనీయ రమణీ-
మెరుపు తీగలై మెరిసిన
ఓ..కనిపించని కుందనమా
కలలోకొచ్చిన సుందరివా-

ఏడడుగులు నడవలేదు
అరుంధతీ నక్షత్రము
చూడలేదు
చుక్కలు శుభమంత్రం
పాడలేదు
సన్నాయి రాగస్వరాలు
చవిచూడలేదు

తలంబ్రాల తంతు
చూడలేదు
నీటిబిందెలో
ఉంగరాలఆట
ఆడనూ లేదా
పెద్దల ఆశీర్వాదాలు
అందుకోనూ లేదు-

అయినా....
నా హృదయ తంత్రులను
నీ ప్రేమామృత
రసధారలతో
అభిషేకం చేస్తున్నట్లున్నది

నా గుండె చప్పుళ్లతో
నువ్వు చెమ్మ చెక్క
ఆడినట్లున్నది-
నా చేతి మునివ్రేళ్ల మధ్య
నీ సున్నితహస్తం జోడించి
బిరబిరా...
బిత్తి గీసినట్లున్నది-
నా కష్టాలలో సుఖాలలో
పాలుపంచుకుని
అష్టాచెమ్మా
ఆడినట్లున్నది-
కమనీయ రమణీయ
పండువెన్నెలలో
వెన్నెల మడుగులాడి
నట్లున్నది-
కలలో కనిపించి
కనిపించని ఓ...దేవతా
నీ ప్రేమపూజారి
అయినాడు
ఈనాడు
నీ రాకకై ఎదురు
చూస్తుంటాను
ఇలలో ప్రతిక్షణికం.

- కె. హరనాథ్
8886702117

## ధర్మ పీఠం

నా చుట్టూ ఇంత పెద్ద ప్రపంచం
కానీ నాలో నేనే ఓ చిన్ని వలయం
అందరూ నన్నెందుకో పొగిడేవాళ్లే
అవేవీ నా చెవులకు సోకవు
ఆస్వాదించే లక్షణం లేదని కాదు
అవి నా సొంతం కాదనిపిస్తుంది
అవేవీ శాశ్వతం కాదనిపిస్తుంది.
నాకు నేనే నాలో నేనే ఓ ధర్మపీఠం
నాకు నేనే నన్ను కొలిచే ఓ ధర్మామీటర్
ఉచితానుచితాలు అదే తీర్పులిస్తుంది
నాకు తెలీని నా మనసు లోతుల్ని చీలుస్తుంది
ఆత్మసాక్షినే సాక్షిగా నిలబెట్టి దండిస్తుంది
నాలోని పెడసరితనానికి పగ్గం వేస్తుంది
గర్వభంగం చేసి నిగర్విగా నిలబెడుతుంది



నేనెవరినని నన్నే ప్రశ్నించుకునేలా చేస్తుంది
లక్ష యక్ష ప్రశ్నల మధ్య అభిమన్యుణ్ని చేస్తుంది
నేనెవర్నో తెలీని బేలతనంతో నన్ను నిలబెట్టేస్తుంది
ఆ క్షణమే నాలో జ్ఞానోదయ వీచికలన్నట్టు
నా కళ్లలోకి చూస్తూ నవ్వుతుంది
అందుకే ఆ ధర్మపీఠం నా ఆత్మగీతం
అది పొగిడితే నేను పొంగిపోతాను.
ఆకాశానికి నేలకు మధ్య నిలిచిపోతాను
ఉత్సాహం ద్విగుణీకృతమై రెచ్చిపోతాను
నాలోని చిన్ని వలయంలో పెద్ద న్యాయస్థానం
విజయతీరాలకు అదే నన్ను ఆవిష్కరిస్తుంది
అందుకే బయటి పొగడ్తలు నా చెవులకు సోకవు!

- వయ్యుస్సారెస్
9000013367

# సందేశాత్మక నవల చక్రవాళం

**ఇటీవల ఒక పత్రికలో ధారావాహికంగా ప్రచురితమై పాఠకుల విశేషాదరణ చూరగొన్న నవల "చక్రవాళం! రచయిత వ్యాకరణం అచ్యుతరామారావుగారు! వారు ఇంగ్లండ్‌లో స్థిరపడిన ప్రముఖవైద్యులు ఇతఃపూర్వం 'చీకటిలో నీడలు' నవల మనదేశంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో వారు విశాఖపట్నం మెడికల్ కాలేజీ స్టూడెంట్‌గా వున్నప్పుడు కలిగిన అనుభవాలతో-చక్కని విశ్లేషణలతో రచించారు. ఎమెస్కో వారు ప్రచురించారు. 'చక్రవాళం' రెండవ నవల. ఈ నవల ఇటీవలి కాలంలో వస్తున్న నవలల కంటే భిన్నమైనది.**


శీలావీర్రాజు 'మైనా' నవల రాస్తూ-ముందుమాటగా పాఠకులకు ఒకప్రశ్న వేసారు. "సాహిత్యం జీవితాన్ని ప్రతిబింబించాలా? జీవితం సాహిత్యాన్ని ప్రతిబింబించాలా?" ప్రశ్న చూడటానికి చిన్నదే అయినా-ఆలోచించిన కొద్దీ అంతుపట్టని అగాధం ఆ ప్రశ్నలో ఉంది. "జీవితం-సాహిత్యం" ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. ఈరెండింటిలోనూ "అగాధమౌ జలనిధి"లో ఆణిముత్యాలు ప్రతి మనిషికీ తప్పకుండా లభిస్తాయి!

"జీవితం సంఘటనల సమాహారం-సాహిత్యం కూడా అంతే-ముఖ్యంగా నవలా సాహిత్యం" అన్నారు. మధురాంతకం రాజారామ్‌గారు...సుప్రసిద్ధ నవలా రచయితలు, రచయిత్రులుందరూ-తమ మేధాసంపత్తిని వినియోగించి నవలా సాహిత్యంలో జీవితాలని అనేక కోణాల లోంచి దర్శించి అద్భుతమైన సాహిత్యాన్ని ఆవిష్కరించారు. ఆ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

ఇటీవల ఒక పత్రికలో ధారావాహికంగా ప్రచురితమై పాఠకుల విశేషాదరణ చూరగొన్న నవల "చక్రవాళం! రచయిత వ్యాకరణం అచ్యుతరామారావుగారు! వారు ఇంగ్లండ్‌లో స్థిరపడిన ప్రముఖవైద్యులు ఇతఃపూర్వం 'చీకటిలో నీడలు' నవల మనదేశంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో వారు విశాఖపట్నం మెడికల్ కాలేజీ స్టూడెంట్‌గా వున్నప్పుడు కలిగిన అనుభవాలతో-చక్కని విశ్లేషణలతో రచించారు. ఎమెస్కో వారు ప్రచురించారు. 'చక్రవాళం' రెండవ నవల. ఈ నవల ఇటీవలి కాలంలో వస్తున్న నవలల కంటే భిన్నమైనది.

ఇతివృత్తం విలక్షణమైనది. పేద కుటుంబంలోంచి వచ్చిన 'రాంజీ' అనబడే శ్రీరామచంద్రమూర్తి-అతని స్నేహితుడు అంజిబాబు తండ్రి నారాయణమూర్తి హైదరాబాద్‌లో హోటల్ యజమానిగా అభివృద్ధి చెంది, రాంజీకి ఆ హోటల్ లోనే ఉద్యోగం ఇచ్చి అతని అభివృద్ధికి సహకరించడం-చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన సునీత-బోర్డింగ్ సూల్లో చదువుతూ, స్వేచ్ఛా జీవితాన్ని అలవాటు చేసుకుని, తాను అనుకున్నది సాధించాలనే పట్టుదలని పెంచుకోవడం, తన మనసుకి నచ్చిన రాంజీని ఎలాగైనా 'తన వాణ్ణి' చేసుకోవాలని ఆశపడి, భంగపడటంతో కథ మొదలవుతుంది. ఇక్కడ చెప్పుకోవలసిన గొప్ప విశేషం ఏమిటంటే, సునీతతో మంచి అవకాశాలు దొరికినా, మనో నిగ్రహం పాటించి, వివేకవంతుడిగా, విచక్షణాపరుడిగా హద్దులు దాటకుండా-తన 'స్థాయి'కి తగ్గట్టుగా ప్రవర్తిస్తూ-సునీత వంటి అమాయకురాలైన అమ్మాయికి అన్యాయం జరగకూడదనే ఉదాత్తమైన, ఉన్నతమైన భావనతో రాంజీ సంయమనం పాటించడం ఈ నవల చదివే ప్రతి యువకుడికి ఒక ఆదర్శవంతమైన సందేశం స్ఫురిస్తుంది. సునీతకి ఎదురైన మనుష్యులూ, వారి స్వభావాలూ, సంఘటనలూ, అదేవిధంగా 'రాంజీ' జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటనలూ, వీటితో కథని రచయిత-పాఠకుడికి ఉత్కంఠ కలిగేలా చాకచక్యంగా నడిపించారు. ఒక పక్క కథని నడిపిస్తూనే మనకు తెలియని ఎన్నో విశేషాలని రచయిత తన అనుభవసారంతో-తెలియచేశారు. ఈ కథకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మరో గొప్ప పాత్ర పిఠాపురం రాచ వంశానికి చెందిన, సంపన్న కుటుంబీకులైన శ్రీభూపతిగారు... ఒక అమెరికన్ అమ్మాయి జార్జినాతో వివాహం అయిన కారణంగా- ఆ అమ్మాయి తండ్రి నిక్సన్ వారిద్దరికీ ఇంగ్లండ్‌లో షేర్‌వుడ్ మ్యానర్‌లో ఒక భవంతి, భూమి, ఆస్తి ఏర్పాటు చేస్తాడు. భూపతిగారు ఇంగ్లాండ్‌లో స్థిరపడిపోతారు. యూరోపియన్ యూనియన్‌వారు లండన్‌లో అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తారు. దరిమిలా బ్రిటిష్ ప్రభుత్వం "హౌస్ ఆఫ్ లార్డ్స్" మెంబరుగా ఉన్నతమైన గౌరవప్రదమైన పదవిని ఇస్తారు. అయినప్పటికీ భారతదేశం అంటే భూపతిగారికి అమితమైన ప్రేమ. భారతీయులందరికీ ఎన్నో విధాలుగా సహాయసహకారాలు అందిస్తూ వుంటారు. ఆ క్రమంలోనే 'సునీత' వారికి పరిచయం అవుతుంది. భూపతిగారి అబ్బాయి 'విరాట్' అక్కడే పుట్టి పెరగడం వల్ల-విదేశీ సంస్కృతికి అలవాటుపడి, విచిత్రమైన అలవాట్లతో -ఎవరికీ 'చేరువ' కాకుండా, ఏ అనుబంధాలూ పెంచుకోకుండా కేవలం స్నేహం మాత్రమే పాటిస్తూ ఉంటాడు. ఇక్కడా సునీతకి మరోమారు 'చేదు' అనుభవం ఎదురౌతుంది. గొప్పహోదాలు వున్న భూపతి గారి జీవితంలో కూడా "వెలుగు నీడలు"న్నాయి. ఆయన సునీత పరిస్థితులని గమనించి "కన్నకూతురు"లా ఆదరించి, ఆమెకు మానసిక వికాసాన్ని కలిగిస్తారు.

నవలకి "చక్రవాళం" పేరు ఎందుకు పెట్టారో రచయిత రాంజీ పాత్ర ద్వారా చెప్పించారు. "మనం నివసించే భూమి ఒక గోళాకారంలో వుండే గ్రహం! మనకి కనబడే ఆకాశం అనంతమైనది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతూ వుంటుంది. అనంతమైన ఆకాశంలో తిరిగే భూమి చుట్టూ కనిపిస్తూ(అవి కలుసుకుంటున్నట్టు' మనందరినీ భ్రమపెట్టే వలయరేఖలని 'స్థితిజం' అనీ 'చక్రవాళం' అని పిలుస్తారు. ఇంగ్లీషులో హోరైజన్. ఈ పేరు పెట్టడంలో వున్న ఔచిత్యాన్ని విశ్లేషిస్తే-భూపతిగారి




పాత్ర- ఆకాశం! తన చుట్టూ తాను తిరిగే భూమి- సునీత! దగ్గరగా వచ్చినట్లు భ్రమ కలిగిస్తూ దూరంగా తొలగిపోయే-పాత్రలు "రాంజీ", "విరాట్"!ఈ పాత్రలకి సంకేతంగా, 'చక్రవాళం' పేరు పెట్టడంలో శ్రీ అచ్యుతరామారావుగారి "భావనా సామర్థ్యం" మనని ఆహ్లాదపరుస్తుంది. అంతేకాదు పాత్రల మానసిక విశ్లేషణ- ఆయా పాత్రల మనోభావాలు-అనుభూతికి లోనయ్యేలా ఉన్నాయి.

50 ఏళ్లక్రితం "బీస్‌సాల్‌బాద్" సినిమాలో చివరసస్పెన్స్ ఎవరికీ చెప్పవద్దు, ప్రేక్షకుడే చూడాలి అని ప్రకటన ఇచ్చేవారు. అదేవిధంగా ఈ కథ చివరలో సస్పెన్స్ ఎవరికీ చెప్పకూడదు. చెబితే చదివే థ్రిల్ పోతుంది. కాబట్టే కథ ముగింపు చెప్ప లేదు. కానీ తప్పకుండా నవలాప్రియులందరూ చదవదగ్గ నవల. శ్రీ వ్యాకరణం అచ్యుత రామారావు గారి 'కృషి' సర్వదా శ్లాఘనీయం, అభినందనీయం.

- వి.వి.సత్యప్రసాద్
9849592738

## అంతర్ముఖం


కనిపించని మరో
కోణపు అంతరంగం
కాలంతో పయనించని
భేషజాల వీరంగం.
చిమ్మ చీకటిలో
బురదలో అడుగేసినట్లు
నడుస్తున్న కాళ్ల
పంకిలమును
కడుగుతున్నట్లు.

రెండు ముఖాలు
రెండు నాల్కలు
చెప్పేది ఒకటి
చేసేది మరొకటి,

గొంతు మాత్రం ఒక్కటే
గుండెలే వేరు వేరు.

సమాజం పోకడలకు
వెలివేసి బలిచేసే ముఖం
సంస్కృతీ ,సాంప్రదాయాలకు
దివిటీల కళ్లుచూపించి
కొత్తగా కనిపించే ముఖం

గుండె గాయమైతే
లేపనం రాస్తుంది ఒకటి
కత్తులతో చిత్తు చేసి
గుండె కోతనే కోస్తుంది మరొకటి
ఒక వంక కురుస్తున్న నీలి గగనం



మరో వంక సూర్యబింబంలా
ఎరుపెక్కిన కారుమేఘం
తెరముందు నటనలో
అలంకరణ కళకళలు
తెరదించే నిజంలో
మచ్చలూ , మాయలూ

దండయాత్రకు బయలుదేరే
ఆ గర్భ శత్రువులా ఒకటి
ప్రేమ యాత్రలో మునిగితేలే
గర్భస్థ శాంతిలా మరొకటి
ఒకదానిపై ఒకటి పెత్తనం
అంతిమ పోరులో
గెలుపెవరిది
తేలని ఆధిపత్యం.
నీతి ధర్మాలు వేరు
నియంత్రణా పద్ధతులు వేరు.
ముఖం వెనుక అంతర్ముఖం
కనిపించని బహిర్ముఖం

- సముద్రాల శ్రీదేవి
9949837743

## సాహిత్య వార్తలు

### నియోగికి తెలుగువర్శిటీ పురస్కారం

కవి, రచయిత, విమర్శకుడు, ఆంధ్రప్రభ సీనియర్ పాత్రికేయుడు



నియోగికి సాహిత్య విమర్శాప్రక్రియలో ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల తెలిపారు. మూడు దశాబ్దాల కాలంగా సాహిత్య రంగంలో నియోగి విశేష కృషి చేశారు. ముఖ్యంగా సాహిత్యవిమర్శలో కొత్త మార్గాలను ఎంచుకొని తనదైన ఒక ముద్రతో ముందుకు సాగుతున్నారు. వి.ఆర్.విద్యార్థి రాసిన అపరిచితులు కవితలోని 'ఎవరీవిడ' అన్న మొదటి పదాన్ని తీసుకొని 88పేజీల విమర్శ చేసి దాన్ని ప్రచురించారు. విమర్శా రంగంలో నూతనత్వంతో సాగిపోతున్న నియోగికి త్వరలో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. పురస్కారానికి గాను రూ.20,116/-ల నగదు, పురస్కార పత్రం, శాలువాతో సత్కరిస్తారు.

### సిరివెన్నెలకు నాగభైరవ స్మారక అవార్డు

డా॥ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక 9వ అవార్డు 2017 సంవత్సరానికి గాను సిరివెన్నెల సీతారామశాస్త్రి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 11వ తేదీన నెల్లూరు టౌన్ హాల్లో జరిగే సభలో సిరివెన్నెలకు అవార్డు ప్రదానం జరుగుతుంది. ఈ అవార్డు కింద 25000/- నగదు పారితోషికం, సత్కారం ఉంటాయి. అలాగే కవితా సంపుటుల పోటీలో డా॥కోగంటి విజయబాబు రచించిన 'ఇలా రువ్వుదామా రంగుల్ని' కవితా సంపుటి ఎన్నికైంది. వారికి ఇదే సభలో బహుమతి ప్రదానం చేయబడుతుంది.

- చిన్ని నారాయణరావు, ప్రధానకార్యదర్శి,
డా॥ నాగభైరవ అవార్డు కమిటీ- నెల్లూరు

### డాక్టర్ దేవరకొండ సహదేవరావుకు డాక్టర్ వుప్పల లక్ష్మణరావు స్మారక సాహితీ పురస్కారం

డా॥ దేవరకొండ సహదేవరావుకు డా॥వుప్పల లక్ష్మణరావు స్మారక పురస్కారాన్ని అందజేయాలని కమిటి నిర్ణయించింది. ఈ అవార్డును 22వ తేదీన విశాఖ పౌర గ్రంథాలయంలో జరుగు సభలో ఈ పురస్కారాన్ని అందజేయబడును.

- అడపా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి
విశాఖ రచయితల సంఘం


### చిత్రావతి కథ ఆవిష్కరణ సభ

ఉప్పరపాటి వెంకటేశులు రచించిన "చిత్రావతి కథలు" సంకలనం ఆవిష్కరణ సభ 11వతేదీ ఆదివారం ఉదయం 10,00గంటలకు అనంతపురం ప్రెస్‌క్లబ్ హాల్ లో జరుగుతుంది. అధ్యక్షత డా॥శాంతి నారాయణ, ముఖ్య అతిథి: సింగమనేని నారాయణ, ఆవిష్కర్త: నగ్నముని, సమీక్షకులు: డా॥ జి.లక్ష్మీనరసయ్య, అంబటి సురేంద్రరాజు, బండి నారాయణస్వామి, డా॥జూపల్లి ప్రేమ్‌చంద్, ఏలూరి యంగన్న, నిర్వహణ: డా॥ ఉద్దండం చంద్రశేఖర్, గుత్తాహరిసర్వోత్తమనాయుడు.

- అనంతపురం జిల్లా రచయితల సంఘం

# సాహిత్య సమ్రాట్ నోరి

కథ, నవల, నాటిక, పద్యం ఇలా ఏ ప్రక్రియలోనైనా తనదైన ఒక విలక్షణత చూపిస్తూ రచనలు గావించి, కవిసమ్రాట్‌గా పేరు పొందిన వారు నోరి నరసింహశాస్త్రి. ఆయన తెలుగు, సంస్కృతము, ఇంగ్లీషు, కన్నడ భాషల్లో పండితుడనిపించుకున్నారు. నోరి నరసింహశాస్త్రి ఒక సాంప్రదాయ కుటుంబంలో 6 ఫిబ్రవరి 1900న గుంటూరులో జన్మించారు. బి.ఏ.బి.ఎల్. పట్టా పొంది, రేపల్లెలో న్యాయవాదిగా పేరు ప్రఖ్యాతులు గడించారు.



నోరి నరసింహశాస్త్రి

నోరి నరసింహశాస్త్రి గీతమాలిక, భాగవతావరణము (పద్యనాటిక) సోమనాథ విజయము (నాటకము) ఖేమాభికుని, వరాగమనము, ఆత్మమృతి, తేనెతెట్టె, పతంగాయాత్ర, స్వయంవరము, షణ్ణవతి వంటి నాటికలు, కావ్యములు రచించి ప్రతిభ చాటుకున్నారు. నారాయణ భట్టు, రుద్రమదేవి వంటి నవలలు ఆయనకు గొప్ప పేరును తెచ్చిపెట్టాయి. నరాంకితము, గానభంగము, చిలక, నాగమ్మ, వధూసర వంటి అనేకకథలతో పాటు 'స్వతంత్ర భారతంలో చరిత్ర' కావ్య ప్రయోజనం, గిడుగు రామమూర్తి పంతులు వంటి వ్యాసాలు రాశారు. వీరి రచనలు ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి. ఇవేగాక మల్లారెడ్డి, ధూర్జటి, కవిసార్వభౌముడు కవిద్వయము వంటి రచనలు ఆయన సాహిత్య కీర్తిని ఇనుమడింప జేశాయి.

1917లో నరసింహశాస్త్రి గుంటూరులో ఇంటరు చదివి తదుపరి, పచ్చయప్ప కళాశాలలో బి.ఏ. ఉత్తీర్ణత సాధించారు. అటు పిమ్మట గుంటూరు కళాశాలలో రెండేళ్లు ఉద్యోగం చేశారు. 1925 సంవత్సరంలో బి.ఎల్. పరీక్ష పూర్తిచేసి న్యాయవాద వృత్తి చేపట్టారు. చిన్నవయసులోనే కావ్య పఠనము అలవడినది. శివశంకర శాస్త్రి, కొడవటిగంటి వేంకట సుబ్బయ్య, త్రిపురారిభట్ల వీరరాఘవ స్వామి, పెద్దభట్ల పూర్ణశర్మ, కోపల్లె శివకామేశ్వరరావు వంటి సాహితీ పెద్దల ప్రోత్సాహంతో కావ్య రచనకు పూనుకున్నారు. నోరి నరసింహ శాస్త్రి రాసిన కథలు, వ్యాసములు సాహితీ, సఖి, భారతి, ఆంధ్రవార్షిక, వంటి పత్రికలలో విరివిగా ప్రచురించబడ్డాయి.

నరసింహశాస్త్రి గద్య రచనా విధానంలో చాలా వరకు చతురతతో సరసమాధుర్యంతో కనిపిస్తాయి. సంభాషణలు, పాత్రలు స్వభావాల కనుగుణంగా, ఉదాత్తంగా నడిపిస్తారు. **"అంతం గొండొకకాల మేగ శుకుడాత్మారాముడై సిద్ధుడై/ వింతంగొల్పుచు సర్వభూతములకున్ విద్యుత్ప్రభాపుంజభా/స్వంతుండై నెగసెన్ విహాయసిని భాస్వద్విసంభేదియై/భ్రాంతంబై గిరిశృంగ యుచ్చట ద్విధా ప్రయ్యంగనుతిప్రష్టమై"**

ఇలా పద్యరచనకు వన్నె తెచ్చారు. ఆయన దేవీ భాగవతాన్ని ఆంధ్రీకరించారు. పై పద్యం అందులోనిదే. వీరి ప్రతిభను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీలు వీరికి అవార్డులు ఇచ్చి గౌరవించాయి. ప్రతిభాశాలి అయిన ఈ సాహితీ మూర్తి జనవరి 1, 1978న కన్ను మూశారు.

**(రేపు నోరి నరసింహశాస్త్రి 118వ జయంతి సందర్భంగా)**

- నియోగి
9553097319

### కవి సమ్రాట్ నోరి నరసింహ శాస్త్రి 118 వ జయంతి మహోత్సవం

కవిసమ్రాట్ నోరి నరసింహశాస్త్రి 118వ జయంతి సభ రేపు సాయంత్రం ఆరు గంటలకు శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్ నందు నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షతన జరుగుతుంది. ముఖ్య అతిథిగా జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు, విశిష్ట అతిథిగా సి. రామకృష్ణ, ప్రత్యేక అతిథిగా ప్రొ.ముదిగొండ శివప్రసాద్, ఆత్మీయ అతిథిగా కళాజనార్ధన మూర్తి హాజరవుతారు.


ఈ సభలో ప్రతిష్ఠాత్మకమైన నోరి నరసింహశాస్త్రి పురస్కారాన్ని ఆచార్య అనుమాండ్ల భూమయ్య అందుకుంటారు. ఈ పురస్కారానికిగాను రూ.20,000/- జ్ఞాపిక, ప్రశంసా పత్రం వారికి అందజేయబడతాయి. నోరి యువ రచయిత ప్రోత్సాహక పురస్కారం డా॥బోచ్కర్ ఓం ప్రకాశ్ అందుకుంటారు. ఈ పురస్కారానికి గాను రూ.5000/-నగదు వారికి అందజేయబడుతుంది.

- నోరి శివసేనాని, నోరి కళ్యాణ సుందర్
నోరి నరసింహశాస్త్రి చారిటబుల్ ట్రస్టు

# జ్ఞాపకాల పరంపరలో ఉషశ్రీ

ఉషశ్రీ పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఆ పేరు వినగానే ఆయన రేడియోలో ధర్మసందేహాలకు చెప్పిన సమాధానాలు ఇప్పటికీ ఎందరో చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. ఆయన గురించి ఎందరెందరో రాశారు. ఆయన ఎన్నో పుస్తకాలు వెలువరించారు. ఇంకా ఆయన గురించి ఏం రాస్తాం! అనుకునే వాళ్లూ ఉంటారు. అయితే ఆయన గురించిన మరో మంచి పుస్తకం మళ్లీ ఇప్పుడు వచ్చింది. ఉషశ్రీ (ఇంతింతై వటుడింతయై) అని సరిగ్గా ఆయనకు సరిపోయే పేరునే పెట్టారు ఈ పుస్తకానికి. ఉషశ్రీ అల్లుడు/మేనల్లుడు అయిన అనామకుడు ఈ పుస్తకాన్ని తీసుకు వచ్చారు. అయితే ఇది ఆయన స్వయంగా రాశారా అంటే అవునని/కాదని రెండూ చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే ఉషశ్రీ గారి పెద్ద కుమార్తెగా గాయత్రీదేవి ఉషశ్రీ గురించి నెమరేసుకున్న జ్ఞాపకాలను గ్రంథంగా తెచ్చారు. ఇది ఒక ప్రయత్నం, ప్రయోగం అని చెప్ప వచ్చు. ఆమె చెప్పిన ప్రతి జ్ఞాపకానికి ఒక శీర్షికనిచ్చారు. ఇలా మొత్తం 28 శీర్షికలతో నూట నలభై పేజీలకు విస్తరించింది ఈ గ్రంథం. 'నాన్న నాన్నయ్యారు, నోరెట్టుకు బతుకుతాడు, "పందిళ్ళు, గుళ్లూ, బళ్లూ" ఇల్లు కట్టి చూడు ఇలా ఆసక్తికరమైన శీర్షికలు పెట్టడటమేగాక ఆగకుండా పుస్తకమంతా హాయి గా చదువుకుంటూ వెళ్లిపోయే విధంగా తీర్చిదిద్దారు ఈ పుస్తకాన్ని.

"పుట్టిన కాకర పర్రూ, పెరిగిన ఆలమూరూ, చదివిన భీమవరం, ఉద్యోగం చేసిన హైదరాబాదూ, విజయవాడ అన్నీ- ఉషశ్రీని ఆదరించి, చేరదీసి, అంచెలంచెలుగా పైకెక్కించాయి. ఉపన్యాసాలూ, రచనలూ ఉషశ్రీ ఒక పార్శ్వం. ఉషశ్రీలో మరో పార్శ్వం ఉంది. అది చాలామందికి




తెలియదు. అందులో ఓ కొడుకూ, ఓ అన్నా, ఓ నాన్న, ఓ స్నేహితుడూ, ఓ హితుడు ఉన్నారు. గురువుగారూ అంటూ జనాల నమస్కారాలు అందుకుంటున్న ఉషశ్రీ ఇంట్లోకి అడుగుపెట్టగానే, అమ్మానాన్నల దగ్గర పిల్లగాడే కూతుళ్లకు నాన్నే" అంటూ ఉషశ్రీ కుటుంబం గురించి అనామకుడు తన "ముందుమాట రాయించిన అనామిక"లో అంటారు.

నా 'రమణీయం' కథల సంపుటి ముందుమాట "దాంపత్య ఋతుసంహారం" చివరలో ముళ్లపూడి వెంకటరమణగారు "రాసిన అనామకుడికీ రాయించిన అనామికకూ "శతమానం భవతి" అని ఆశీర్వదించారు". "ఆయన ప్రస్తావించిన అనామిక నాకు మరదలు, శ్రీమతి-ఎవ్రీథింగ్ అయిన డాక్టర్ గాయత్రీదేవి"అంటారు అనామకుడు. వీరిద్దరూ రాయగలిగిన సత్తా ఉన్నవారు కాబట్టి ఈ గ్రంథంలో వారు అక్షర విన్యాసమే చేశారు. మనల్ని వారి వెంట నడిపించుకు వెళ్లారు.

**పేజీలు -140, వెల:రూ. 200/- ప్రతులు అన్ని పెద్ద పుస్తక విక్రయ కేంద్రాలలోను, ఉషశ్రీ మిషన్- 9848598797, 9912477763.**

- రమణ

## కన్నడ తెలంగాణ అసోషియేషన్ ఏర్పాటు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కన్నడ రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. నూతన అధ్యక్షుడిగా సందీప్ కుమార్ మక్తాల ఎన్నికయ్యారు. ఆయన రెండోసారి ఈ పదవికి ఆయన ఎన్నికయ్యారు. బెంగుళూరులోని కబ్బన్ ప్రెస్‌క్లబ్‌లో ఈ ఎన్నిక వివరాలను కన్నడ రాష్ట్ర తెలంగాణఅసోసియేషన్ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో అధ్యక్ష నియామకంతోపాటు రాష్ట్ర కమిటీనీ ప్రకటించారు. బెంగుళూరులో తెలంగాణ భవన్‌ను ఏర్పాటు చేసేం దుకు కేఆర్‌టీఏ కృషి చేస్తోంది. ఇప్ప టికే కర్నాటక ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు నూతన అధ్యక్షుడు సందీప్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఈవీ సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా చకినాల రాజేందర్, నాగేందర్, సంయుక్త కార్యదర్శులుగా శరత్‌చంద్ర, భవ్య తదితరులను ఎన్నుకున్నారు.

## టీసాట్‌లో పశుసంవర్ధకం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు ఉపయోగపడే విధంగా పశుసంవర్ధకంపై టీ-సాట్‌లో ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యాక్రమాలు ప్రారంబించినట్టు సీఈవో శైలేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశం టీసాట్ స్టూడియోకు హాజరవుతారన్నారు. ప్రతి సోమవారం శాస్త్రవేత్తలతో మెళుకువలు, 12న రబీపంటల్లో నీటి యాజమాన్యం, 19న ధాన్యం నిల్వలో మెళుకువలు , 26న వివిధ పంటల్లో సమగ్ర కలుపు నివారణ అంశాలపై సలహాలు సూచనలు ప్రసారం అవుతాయన్నారు. రైతులు ఈ అవకాశాలను ఉపయోగించుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సీఈవో శైలేష్ రెడ్డి ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉచిత నేత్ర శిబిరాల కార్యాచరణ షురూ!



- సీఎం నిర్ణయం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది
- ప్రైవేటు కంటి ఆస్పత్రుల యాజమాన్యాలకు గుండెల్లో గుబులు
- సాధ్యాసాధ్యాలపై ఆరా
- సెక్సెస్ అయితే ప్రబావం ఎలా ఉంటుందన్న దానిపై చర్చ

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్న నేపథ్యంలో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కంటి జబ్బులు లేని తెలంగాణగా రికార్డు సాధించాలన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో ప్రజలకు కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు వారికి అద్దాలు పంపిణీతో పాటు మందులను పంపిణీ చేయాలని సీఎం నిర్ణయించారు. సీఎం కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రైవేటు కంటి ఆస్పత్రి వారి గుండెల్లో గుబులు రేపుతోంది. గతంలో సీఎం ప్రకటించిన కేసీఆర్ కిట్స్ వలన ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. దీంతో చాలామంది ప్రైవేటు ఆస్పత్రుల వారు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. కేసీఆర్ కిట్‌ల వలన ప్రైవేటు ఆస్పత్రుల్లో చాలావరకు తమ సిబ్బంది సంఖ్యను తగ్గించుకున్నారు. ఆదాయం తగ్గడంతో ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఇలాంటి చర్యలను చేపట్టారు.

**సరోజినీ ఆస్పత్రి ఆధ్వర్యంలో 7 జిల్లాల్లో వైద్య శిబిరాలు**

ఇప్పటికే సరోజినీ దేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో మూడునెలలుగా ఇంటిం టికీ వైద్యం పేరుతో 7 జిల్లాలకు సరోజినీ వైద్యులు వెళ్లి అవసరమైన వారికి మందులను ఇచ్చి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఇక్కడకు తీసుకొచ్చి వారికి ఆపరేషన్ల అనంతరం ఇంటికి పంపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానాన్ని సీఎం అమలు చేయాలని నిర్ణయించడంతో తమకు వచ్చే రోగులు ఎక్కడ తగ్గుతారో అన్న భయం ప్రైవేటు ఆస్పత్రుల వారిలో నెలకొంది.

**చాలా ప్రాంతాల్లో వైద్యం అందడం లేదు**

గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కంటి సంబంధించి అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సంబంధించి చికిత్స పొందడం కూడా వారికి ఇబ్బందిగా మారింది. చాలా గ్రామాల్లో కంటి వైద్యానికి సంబంధించి చికిత్సా సౌకర్యం లేదు. ప్రైవేటు ఆస్పత్రులు సైతం పరిమిత సంఖ్యలో ఉన్నాయి. పరీక్షలు చేయించుకొని చికిత్స పొందడం అనేది పేదలకు భారంగా మారింది. చాలామంది కంటి అద్దాలు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈదిశగా ఆలోచించిందని అధికారులు పేర్కొంటున్నారు. దీనికోసమే సీఎం కేసీఆర్ ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలన్న ఆలోచనతో ముందడుగు వేసినట్టు పలువురు పేర్కొం టున్నారు. దీంతోపాటు శిబిరాలు నిర్వహించడంతో పాటు రోగులకు అయ్యే ఖర్చును మొత్తం భరిస్తానని పేర్కొంటుండంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా ప్రభుత్వ నిధులతో కంటి అద్దాల పంపిణీతో పాటు నేత్ర వ్యాధులకు శాశ్వత పరిష్కారం చూపే బాధ్యతను ప్రభుత్వం భుజస్కంధా లపై వేసుకుంది.

ఇక్కడ డాక్టర్ల కొరత ఉంటే పక్కరాష్ట్రాల నుంచి డాక్టర్ల సాయం తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయించడం గొప్ప నిర్ణయమని పేదలు పేర్కొంటున్నారు. ఇటీవలే కంటికి సంబంధించిన ఆస్పత్రుల గురించి చాలా చోట్ల నుంచి సీఎంకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు వైద్య ఆరోగ్య శాఖాధికారులు పేర్కొం టున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో త్వరలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నేత్ర శిబిరాలను నిర్వహించాలని సీఎం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

### లోలోపల గుబులు

సీఎం నిర్ణయంతో ప్రైవేటు నేత్ర చికిత్సాలయకు చెందిన యజమాన్యాలు లోలోపల మదనపడుతున్నట్టు తెలుస్తోంది. ఇదే కనుక అమలు జరిగితే ఎంతమేరో తమకు నష్టం జరుగుతుందోనన్న అంచనా వేస్తున్నట్టు తెలిసింది. ఎంతమేర సిబ్బందిని, ఖర్చులను తగ్గిం చుకోవాలన్న ఆవేదన చెందుతున్నారు. దీనిపై ప్రైవేటు ఆస్పత్రుల వారు చర్చించినట్టు తెలిసింది. మరికొం దరు మాత్రం ప్రభుత్వ పథకం ఎన్ని రోజులు జరుగుతుందో అందరికీ తెలిసిందేనన్న ధీమాలో ఉన్నట్టు తెలిసింది. మరికొందరు సీఎం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదని ఇలాంటి నిర్ణయం ఇంతవరకు ఎవరూ తీసుకోలేదని వారు ప్రశంసిస్తు న్నారు. ఇలా మూడురకాలుగా ప్రైవేటు ఆస్పత్రుల యజమాన్యులు ఆలోచనలో ఉన్నట్టు వినికిడి. త్వరలో జిల్లాల్లో జరిగే శిబిరాలు, వాటిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

**ఇంటింటి వైద్యం పేరుతో ముందుకెళుతున్నాం**

**సరోజినీ ఆస్పత్రి, సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్**

సీఎం తీసుకున్న నిర్ణయం అంధత్వ నివారణకు మార్గం చూపుతుంది. ఇది పేదలకు మేలు చేసేలా ఉంది. సీఎం ఏ నిర్ణయం తీసుకున్నా పేదలకు మేలు చేసేలా ఉంది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. సరోజినీ దేవి ఆస్పత్రి తరుపున కూడా మేము ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటాం. సూపరింటెండెంట్ అయిన తరువాత 3500 మందికి సరోజినీ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి అద్దాలను పంపిణీ చేశాం. 7 జిల్లాల్లో కంటి అవగాహన శిబిరాలను నిర్వహించాం. 1000 వరకు కంటి శస్త్ర చికిత్సలను నిర్వహించాం. 4వేల మందికి శిబిరాల్లో కంటి పరీక్షలు నిర్వహించాం. గతంలో సీఎం 'పిలుపుమేరకు ఇంటింటికీ వైద్యం అందించే ఆలోచనతోనే సరోజినీ ఆస్పత్రి ముందుకు వెళుతుంది.

### ఇంటింటి వైద్యం పేరుతో ముందుకెళుతున్నాం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన ప్రైవేటు వారికి ఎలాంటి నష్టం ఉండదు. ప్రభుత్వ ఆస్పత్రుల వలన ప్రజలందరికీ వైద్యం అందించలేం.ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు కలిస్తేనే అందరికీ వైద్యం అందించగలుగుతారు. నిరుపేదలకు ఉచిత వైద్యం అందించే బాధత్యలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు వారు లాభాపేక్షతోనే ఆస్పత్రులను నిర్వహిస్తూ ఉండవచ్చు. అలా అని అందరూ అదే ఉద్దేశ్యంతో ఉండరు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల వారు ఉచిత అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది పేదలను దృష్టిలో ఉంచుకొని ఉం టుంది. ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుంటుంది. ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి పరికరాలు, సిబ్బంది సమకూర్చినా రోగులు రాకపోతే అవి వృథానే అవుతుంది. అందులో భాగంగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్న భావన వారిలో కలిగించడానికి మా ప్రయత్నం.

**సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

మ్యాక్స్‌విజన్ ఐ ఆస్పత్రి ఫౌండర్ మరియు కో చైర్మన్, చీఫ్ సర్జన్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి

సీఎం తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. దీనివల్ల ప్రైవేటు ఆస్పత్రులకు ఎలాంటి నష్టం జరగదన్నది నా అభిప్రాయం. ఆయన తీసుకున్న నిర్ణ యం దేశవ్యాప్తంగా సంచలనం అవుతుంది. ఇది గొప్ప విషయంగా నేను అభివర్ణిస్తున్నా. ఒక మంచి పనిచేయాలను కున్న ప్పుడు ఎన్నో ఒడుదుడుకులు వస్తుంటాయి. వాటిని మనం తప్పించుకుంటూ ముందుకు వెళుతుండాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కంటి జబ్బుల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. వారందరిని చూడడానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు కూడా సరిపోవు. మేము కూడా సీఎం తీసుకున్న నిర్ణయంలో భాగస్వాములు కావ డానికి సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో జరిగే శిబిరాల్లో కూడా మా సంస్థ తరఫున పాల్గొన డానికి సిద్ధంగా ఉన్నాం. మా సంస్థ తరఫున ఇప్పటివరకు ఉచితంగా వేల ఆపరేషన్లు నిర్వహించాం.

---

## బియ్యం అక్రమ వ్యాపారిపై పీడీ కేసు నమోదు

**హెదరాబాద్, ఆంధ్రప్రభ:** బియ్యం అక్రమ వ్యాపారిపై ప్రభుత్వం పీడీ కేసును నమోదు చేసింది. త్వరలోనే మరి కొంత మందిపై పీడీ కేసులు పెట్టడానికి రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ముగ్గురిపై పీడీ కేసులు, పలువురిపై 6ఏ క్రిమినల్ కేసులు నమోదు చేసి నిఘాను కట్టుదిట్టం చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్ ఇటీవల ప్రకటించారు. మంత్రి ఆదేశాల మేరకు పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ నిఘాను కట్టుదిట్టం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అప్రమత్తం చేశారు. అక్రమ బియ్యం వ్యాపారుల కదలికలపై నిఘా పెట్టి దాడులు నిర్వహిస్తున్నారు. ప్రజాపంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టించిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన రావిరాల రామలింగం (42)పై ఆదివారం జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ పీడీ కేసు పెట్టారు.

మిర్యాలగూడ కేంద్రంగా గత కొన్ని సంవత్సరాలుగా రామలింగం రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నాడని నిర్ధారించుకొని కేసు నమోదు చేయడం జరిగింది. రామలింగం పైన బియ్యం అక్ర మ రవాణాకు సంబంధించి మొదటిసారి 2016 ఫిబ్రవరి 10న కేసు నమోదయింది. అయినప్పటికీ బియ్యం అక్రమ రవాణాను రామలింగం విరమించుకోలేదు. దశల వారిగా 2016 ఫిబ్రవరి 10, 22 మే 11, 25న, సెప్టెంబర్ 13, 14, 2017 ఫిబ్రవరి 18, మే 19, 22 తేదీల్లో మొత్తం ఆయనపైన 9 కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ రామలింగం బియ్యం అక్రమ రవాణాను కొనసాగిస్తునే ఉన్నాడని ఇటీవల టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో వెల్లడయింది.

**మరికొందరిపై పీడీ కేసులు**

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న మరి కొందరి పై త్వరలోనే పీడీ కేసులు నమోదు చేయబోతున్నామని పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు. కొంత మంది వివిధ ప్రాంతాల నుండి రేషన్ కార్డులు, డీలర్లు, ఇతర వ్యాపారుల నుండి రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారనే సమాచారం తమ వద్ద ఉందని పేర్కొన్నారు. వారిపై కూడా నిఘాను కట్టుదిట్టం చేశామని వెల్లడించారు. ఇప్పటికే కొందరిపైన 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు. గత సంవత్సరం ముగ్గురిపైన పీడీ కేసులు నమోదు చేసి జైలుకు పంపించామని తెలిపారు.

## దేవతా విగ్రహాల ముఠా అరెస్ట్



### రూ.3 కోట్ల విగ్రహాల స్వాధీనం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** పంచలోహ విగ్రహాలను దొంగిలించే అంత రాష్ట్ర ముఠా గుట్టును నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, కామారెడ్డి టౌన్ పోలీ సులు సంయుక్తంగా రట్టు చేశారు. కర్ణాటకకు చెందిన షేక్ హైదర్ (25), షేక్ అజీజ్(25)లను అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి సుమారు 600 ఏళ్ల కాలం నాటి వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ విగ్ర హాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3 కోట్లు ఉంటుందని హైదరాబాద్ నగర పోలీసు కమి షనర్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు కమి షనర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమా వేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడి చేశారు. దేశంలోని పలు రూరల్ ప్రాంతాలను ఈ ముఠా టార్గెట్ చేస్తుంది. ఆయా ప్రాంతాల్లో బస్‌లు, టాక్సీల్లో ప్రయాణిస్తూ ఆయా ప్రాంతాల్లోని పురాతన ఆలయాల్లో పంచలోహ విగ్రహాలు ఉన్నాయా? అన్నదానిపై రెక్కీ నిర్వహిస్తారు. ఆ తర్వాత తమ వద్ద తెచ్చుకున్న స్మాల్‌సైజ్ ఐరన్ రాడ్‌తో తాళం పగులగొట్టి ఆ ఆలయాల లోపల ఉన్న పంచలోహ విగ్రహాలను చోరీ చేస్తారు. గత జనవరిలో కామారెడ్డిలో పురాతన వేణు గోపాలస్వామి దేవాలయంలో వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభా మ విగహాలను వీరు దొంగిలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న కామారెడ్డి పోలీసులు హైదరాబాద్ నగర పోలీసులకు సమా చారం అందించారు. దీంతో హైదరాబాద్ పోలీసులు కామారెడ్డి పోలీసులతో కలిసి నగరంలోని ఓ హోటల్‌లో నిందితులు విగ్రహాలను విక్రయిస్తున్న తరుణంలో అదుపులోకి తీసుకున్నారు. వీరిపై మూడు కేసులు వున్నాయి. మహారాష్ట్రలోని హింగోరి, కిల్లారి పీఎస్‌లతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి పీఎస్‌లో ఈ కేసులు నమోదై ఉన్నా యి. మహారాష్ట్రలోని హింగోరీ పీఎస్ పరిధిలో అక్టోబర్ 2017లా (2/ 3-10-2017) పోస్టాఫీస్‌రోడ్‌లోని జైన్ టెంపుల్‌లో 7.5కేజీల పురాతన పంచలోహ మహా విగ్రహాన్ని దొంగిలించారు. అదే విధంగా కిల్లారి పీఎస్ పరిధిలో శ్రీకేదార్లింగ ఆలయంలో శివుడి పంచలోహ విగ్ర హాన్ని నవంబర్ 2017లో (20/21-11-2017) దొంగిలించారు. తెలంగాణలోని కామారెడ్డి పీఎస్ పరిధిలో వేణుగోపాలస్వా మి ఆలయంలో జనవరి 2018(27-1-2018)న రుక్మిణి, సత్య భామ, వేణుగోపాలస్వామి పంచలోహ విగ్రహాలను దొంగిలించారు. కాగా, కర్ణాటక రాష్ట్రంలోని జంఖండి, భన్‌కట్టి, ముద్దోల్ పీఎస్‌ల పరిదిలోని చోరీ కేసుల్లో షేక్ హైదర్ అరెస్ట అయినట్లు పోలీసులు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో ఈ కేసును ఛేదించిన సిబ్బందిని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు అభినందించారు. అరెస్టయిన నిందితులతో పాటు చోరీ సొత్తును తదుపరి విచారణ నిమిత్తం కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌వోకి అప్పగించారు.

## ముంబై ఎయిర్ పోర్టు వరల్డ్ రికార్డు

**ముంబై:** ప్రపంచంలోనే అత్యంత రద్దీతో కూడిన ఏకైక రన్ వే విమానాశ్రయంగా గుర్తింపు తెచ్చుకున్న ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ మరోసారి తన రికార్డును తానే తిరగరాసింది. ఈ విషయాన్ని ఎయిర్‌పోర్ట్ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది సమన్వయం... ఓ ప్లాన్ ప్రకారం ముందుకు సాగడంతో... ఇది సాధ్య మైం దంటున్నారు. జనవరి 20న 24 గంటల వ్యవధిలో 980 విమానాలు ఇక్కడి రన్ వే పై ల్యాండింగ్, టేఖాఫ్ తీసుకున్నాయి. అంతకుముందు డిసెంబర్ 6న 974 ఫ్లయిట్ల రికార్డు నమోదై ఉంది. రెండో స్థానం బ్రిటన్‌లోని గట్విక్ విమానాశ్రయానిదే. వాస్తవానికి గట్విక్ విమానాశ్రయ సామర్థ్యం ఎక్కువే అయినప్పటికీ రోజులో ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకే విమానాల రాకపోకలకు తెరిచి ఉంటుంది. దీంతో ఈ విమానాశ్రయం ఒక్క రోజులో 870 విమానాల రాకపోకలను మాత్రమే నిర్వహించగలదు. మన దేశంలో మొదటి స్థానం ఢిల్లీ అంతర్జాతీయ విమానశ్రయానిదే. గంటలో 82 ఫ్లయిట్ల ట్రాఫిక్ రికార్డు నిర్వహణ ఉంది.

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఎద్దుల బండిని ఢీకొన్న ఐషర్ వాహనం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- రెండు ఎద్దులు మృతి..ముక్కముక్కలైన బండి

**పాణ్యం , ప్రభ న్యూస్ :** కర్నూలు జిల్లా పాణ్యం మండలం బలపనూరు మెట్ట సమీపంలో ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పొలం పనులకు వ్యవసాయ కుటుంబం ఎద్దుల బండిపై వెళ్తుండటంతో ఐషర్ వాహనం ఢీకొట్టింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్లితే . . బలపనూరు గ్రామానికి చెందిన కౌలు రైతు సుబ్బరాయుడు నాలుగు ఎకరాలు జొన్న పంట వేసి కంకులు కొయ్యడానికి అతని భార్య నాగలక్ష్మమ్మ, కూతురు సుజాతతో కలసి బండిపై బయలుదేరారు. గ్రామ సమీపంలోని నాలుగు లైన్ల రహదారిపైకి వచ్చే సరికి అతివేగంగా వస్తున్న ఐషర్ వాహనం వేగంగా వస్తూ ఎదురుగా ఎద్దుల బండిని ఢీకొంది. బండిపై ఉన్న ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. రెండు ఎద్దులు మృతి చెందగా, బండ్ల బండి ముక్కలు ముక్కలయ్యాయి. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉప్పరి సుబ్బరాయుడు (65), భార్య నాగలక్ష్మమ్మ (50), కూతురు సుజాత (30), రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆదివారం ప్రొద్దు పోడవక ముందే పొలానికి ఎడ్ల బండిపై బయలుదేరి కుటుంబ సభ్యులు ఎదురుగా వస్తున్న ఐషర్ వాహన రూపంలో ఆ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. బండి పై ఉన్న సుమలత, జహీర్‌లకు తీవ్ర గాయాలు తగిలి చికిత్స పొందుతున్నారు. ప్రొద్దు పొడవక ముందే జాతీయ రహదారి రక్తంతో తడిసి ముద్దయింది. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డిఎస్పీ గోపాలకృష్ణ సీఐ పార్థసారధిరెడ్డి, ఎస్సై చిరంజీవిలు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

---

## జెఎన్‌టీయూకు ఎంసెట్ సవాల్

### 9న ఎంసెట్ కమిటీ భేటీ

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది ఎంసెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎంసెతోపాటు మిగిలిన అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో లక్షలాది దరఖాస్తులు వచ్చే ఎంసెట్ పరీక్ష నిర్వహణ పరీక్షను నిర్వహించనున్న జెఎన్‌టియుకి సవాలుగా మారనుంది. ఎంసెట్-2018 నిర్వహణ కోసం ఎంసెట్ కన్వీనింగ్ కమిటీ ఈ నెల 9న సమావేశం కానుంది.

**9న కమిటీ భేటీ...**

ఎంసెట్-2018 కమిటీ సమావేశం ఈ నెల 9న జెఎన్‌టియు క్యాంపస్‌లో జరుగనుంది. కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్య అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో ఎంసెట్ నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. గత ఆరు, ఏడు సంవత్సరాలుగా ఎంసెట్ పరీక్షను జెఎన్‌టియు నిర్వహిస్తున్నప్పటికీ ఈ ఏడాది నిర్వహించడం సవాలుగా మారనుంది. ఈ ఏడాది పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కమిటీ కృతనిశ్చయంతో ఉంది. ఆన్‌లైన్ పరీక్ష కాబట్టి ప్రధానంగా కంప్యూటర్ల కొరత లేకుండా, దాంతోపాటు టెక్నికల్ సమస్యలు రాకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవడం కోసం ప్రధానంగా చర్చించనున్నారు. గత ఏడాది జెఎన్‌టియు ఈ సెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. అయితే ఈ పరీక్ష సందర్భంగా పలు కేంద్రాల్లో పరీక్ష ఆలస్యంగా ప్రారంభం కావడం, కొన్ని కేంద్రాల్లో సర్వర్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ఆందోళనకు గురయ్యారు. కాబట్టి అటువంటి సమస్యలు రాకుండా తగిన విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం కోసం ఈ సమావేశంలో చర్చించనున్నారు.

**ప్రశ్నాపత్రం తయారికీ విస్తృత మంతనాలు**

ఆన్‌లైన్ పరీక్షకావడంతో ఎంసెట్ పరీక్షను సెషన్లవారీగా నిర్వహించనున్నారు. ప్రతి సెషన్‌కు 25,000 మందికి పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి కేంద్రంలోనూ అదనంగా కొన్ని కంప్యూటర్లను అందుబాటులో ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఏమైనా సమస్యలు వస్తే వాటిలో స్థానంలో వెంటనే విద్యార్థులకు ఇవ్వడానికి ఈ ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎంసెట్ ఇంజనీరింగ్‌లో ప్రశ్నాపత్రాన్ని 160 మార్కులకు తయారు చేస్తారు. 160 వేర్వేరు ప్రశ్నలతో కనీసం 5 ప్రశ్నాపత్రాలను రూపొందిస్తారు. పరీక్ష రోజు వాటిలో ఒకదానిని ఎంపిక చేస్తారు. కానీ ఇప్పుడు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ కాబట్టి ఒకసారి 25,000 మందికి పరీక్షను నిర్వహిస్తారు. ఇలా చూస్తే ఇంజనీరింగ్‌కు 1,50 లక్షల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో మొత్తం 5 నుంచి 6 సెషన్లల్లో పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో సెషన్‌కు సెట్ తప్పకుండా ఉండాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నల నిధి(క్వశ్చన్ బ్యాంక్)ని రూపొందించి అందులో నుంచి ప్రశ్నపత్రాలను ఇస్తారా? లేకపోతే ప్రతి సెషన్‌కు ఒకసెట్‌లాగా ముందే తయారు చేస్తారా? అనే దానిపై 9న జరిగే సమావేశంలో తేలనుంది.

**గత ఏడాది ఎంసెట్‌కు 2.20 లక్షల మంది దరఖాస్తు**

2017లో నిర్వహించిన ఎంసెట్ పరీక్షకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా రెండింటికి కలిపి 2,20,067 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్‌కు 1,41,054 మంది దరఖాస్తు చేసుకోగా అగ్రికల్చర్, ఫార్మ కోర్సుల్లో చేరడానికి 79,013 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది కూడా 10వేలు అటు, ఇటుగా అంతే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ఇంజనీరింగ్‌కు 1,41,054 దరఖాస్తులు వస్తే సెషన్‌కు 25,000 చొప్పున 6 సెషన్లు నిర్వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా అగ్రికల్చర్, ఫార్మాకు 79,013 దరఖాస్తులు వస్తే 3 సెషన్లల్లో పరీక్షను నిర్వహించాల్సి వస్తుంది. ఈ ఏడాది అగ్రికల్చర్, ఫార్మా, వెటర్నరీ కోర్సులకు మే 2, 3 తేదిల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

## ప్రాక్టికల్ పరీక్షలకు 47,980 మంది హాజరు

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ఆదివారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలకు 47,980 మంది హాజరయ్యారు. గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 544 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం జరిగిన పరీక్షలను జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్లు, సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తోపాటు హైపవర్ కమిటీ సభ్యులు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

## స్టంట్ల ధరల్లో నియంత్రణ లేదు

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :** గుం డెకు అమర్చే స్టంట్ల ధరల నియంత్రణలో ఎలాంటి పురోగతి లేదని మెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అభ్యప్రెత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2017 ఫిబ్రవరిలో జాతీయ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) నోటిఫికేషన్ జారీ చేసిందని నాటి నుంచి స్టంట్ల ధరల నియంత్రణలో ఉన్నాయా.. లేదా అన్న విషయంపై అడ్వా మెడ్ సంస్థతో ఐక్యూవీఏ సర్వే నిర్వహించిందన్నారు. ఈ సర్వేలో స్టంట్ల ధరలు కేవలం 8-18 శాతం తగ్గించాయని పూర్తి స్థాయిలో ఆ ధరలు తగ్గలేదన్నారు. స్టంట్లు వేయించుకున్న రోగులు భారీగానే ఆస్పత్రులకు ఫీజుల రూపంలో చెల్లిస్తున్నారన్నారు. ఇదే విషయమై డాక్టర్ ముఖర్జీ మాడివాడ మాట్లా డుతూ స్టంట్ల ధరలను నియంత్రించాలని ప్రభుత్వ ఆలోచన మంచిదేనని కానీ మొత్తం గుండె సంబంధ వ్యాధుల చికిత్సకు ఇటువంటి ఆంక్షలపైనే సరైన గ్యారంటీ ఇవ్వలే దన్నారు.

## కశ్మీర్ యువతకు వీసాలిచ్చి.. పాక్ ఉగ్రవాద శిక్షణ!

**శ్రీనగర్:** ఉగ్రవాదులకు ఊతమివ్వడం కాదు. ఏకంగా యువతను ఉగ్రవాదం వైపు మళ్లించి, శిక్షణ ఇవ్వడంలోనూ తన వంతు పాత్ర పోషిస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన సమాచారం మేరకు ఎంపిక చేసిన కశ్మీర్ యువకులకు తమ భూభాగంలోని ఉగ్రవాద శిబిరాల్లో ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇవ్వడానికి పాకిస్థాన్ వీసాలను మంజూరు చేసినట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు గుర్తించారు. వీసాలను జారీచేసి తీసుకెళ్లిన కశ్మీర్ యువతకు ఇస్లామాబాద్ సమీపంలోని లష్కరే తోయిబా ఉగ్రవాద స్థావరంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పక్కా ఆధారాలు లభించాయని ఆ రాష్ట్ర డీజీపీ ఎస్పీ వైద్ తెలియజేశారు.

## జూన్‌లోగా కాళేశ్వరం నుంచి శ్రీరాం సాగర్‌కు నీళ్లు



**ఆర్మూర్‌రూరల్, ప్రభ న్యూస్ :** వచ్చే జూన్‌లోగా కాళేశ్వరం నుంచి మోడిగడ్డ మీదుగా శ్రీరాంసాగర్‌కు నీళ్లు తరలిస్తామని దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మంటపంలో మున్సిపల్ చైర్మన్ స్వాతిసింగ్ అధ్యక్షతన మంత్రి కేటీఆర్ పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేసినందున పట్టణ అభివృద్ధిపై అవగాహన సదస్సును ఆదివారం పట్టణ ప్రముఖులతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో తాగునీరు, విద్యుత్, నీటివసతి కల్పనతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపడుతుందని, అందులో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గానికి రెండు వేల ఇళ్ళ మంజూరైనాయని తెలిపారు. ప్రభుత్వం చరిత్రలో ఎన్నడు లేని విధంగా 24 గంటల పాటు వ్యవసాయానికి కరెంటు సరఫరా చేస్తుందని, దీని వలన ఆర్మూర్, బాల్కొండ రైతులకు కరెంటు కష్టాలు తప్పుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం లక్ష 50 వేల కోట్ల బడ్జెట్‌లో 18 శాతం గ్రోత్ ఉందన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ. 2 లక్షల కోట్లు ఉంటుందన్నారు.

కుల సంఘాలకు, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అధిక ప్రాధన్యత ఇస్తుందన్నారు. ఆర్మూర్‌లో సబ్ కోర్టును మంజూరు చేస్తానని హామి ఇచ్చారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో కోటిన్నర మంది భక్తజనంతో పాటు సీఎం కేసీఆర్, ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్‌లు పాల్గొన్నారని చెప్పారు. నల్గొండలోని యాదాద్రి నర్సింహస్వామి ఆలయ నిర్మాణాన్ని సీఎం దసరా వరకు పూర్తి చేయించి మరో తిరుపతి మాధిరిగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు.


Andhraprabha business 2018

# బిజినెస్

## భూషణ్ స్టీల్ కొనుగోలుకు... క్యూలో పెద్ద కంపెనీలు

**న్యూఢిల్లీ :** పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన భూషణ్‌స్టీల్‌ను కొనుగోలు చేయడానికి అతి పెద్ద ఉక్కు కంపెనీలు జెఎస్‌డబ్ల్యు స్టీల్, టాటా స్టీల్‌తో పాటు ఆర్సెలర్‌మిట్టల్‌లు కూడా బిడ్‌లు దాఖలు చేశాయి. బిడ్‌లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఫిబ్రవరి 3వ తేదీ. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం భూషణ్‌స్టీల్‌తో పాటు పిరామిల్ ఎంటర్‌ప్రైజెస్‌లు కలిసి బిడ్‌లుదాఖలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటు టాటాస్టీల్‌తో పాటు ఎన్ ఆర్ఐ బిలియనీర్ లక్ష్మీనివాస్ మిట్టల్‌కు చెందిన ఆర్సెలర్ మిట్టల్ కూడా భూషణ్‌స్టీల్ కొనుగోలుకు బిడ్‌లు దాఖలు చేశా యని ఆ వర్గా లు తెలియ జేశాయి. పైన తెలిపిన మూడు కంపెనీలకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం తెలుసుకోవాడానికి చేసిన ప్రయత్నాలువిఫలం అయ్యాయి. కాగా మంగళవారం నాడు అత్యధిక బిడ్‌లు దాఖలు చేసిన కం పెనీ వివరాలు తెలిసిపోతాయి. రిజర్వ్‌బ్యాంకు మొత్తం 12 నిరర్థకాస్తులను నేషనల్ కంపెనీ లా ట్రైబ్యూనల్ (ఎన్‌సీఎల్‌టి)కి సిఫారసు చేసింది. కాగా భూషణ్‌స్టీల్ బ్యాంకులకు మొత్తం రూ.44,478 కోట్లు బకాయిపడింది.



# వృద్ధి రేటు 8% పక్కా

**● రుతుపవనాలు, ముడి చమురుధరలు స్థిరంగా ఉంటనే ● ఆర్థిఖమంత్రి అరుణ్‌జైట్లీ**

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది రుతుపవనాలు సాధారణంగా ఉండి... ముడి చమురుధరలు పరిమితిస్థాయిలో ఉంటే స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ 8 శాతం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశాలున్నాయని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. వృద్ధిరేటు ఎనిమిది శాతానికి చేరుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని దీనికి ఆయన వివరణలు కూడా ఇచ్చారు. వ్యాపారపరిభాషలో గ్రీన్‌షూట్స్ అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. దీనికి ఆయన ఉదాహరణ ఇస్తూ.. వ్యాపారుల్లో నమ్మకం, పర్చేజ్‌మేనేజర్స్ ఇండెక్స్, కీలక రంగాల్లో వృద్ధిరేటు అన్నీ సవ్యంగా ఉన్నాయి కాబట్టి భవిష్యత్తు ఎలా ఉంటుందో వేచి చూద్దామని జైట్లీ జాతీయ టెలివిజన్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. వ్యవసాయరంగానికి రుతుపవనాలు కీలకమని అయన అన్నారు. అలాగే ముడి చమురు ధరలు ఈ స్థాయి నుంచి మరింత పైకి పోవని, ఇప్పటికే చమురు ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. గత వారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2017-18 ఆర్థిక సర్వే ప్రకారం చూస్తే 2018-19 లో జీడీపీ వృద్ధిరేటు 7 నుంచి 7.5 శాతం సాధించవచ్చునని, ప్రపంచదేశాలతో పోల్చుకుంటే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్‌దేనని ప్రకటించింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి తర్వాత పరిస్థితులు సాధారణస్థితికి వస్తున్నాయని సర్వే వివరించింది. ఇదే సర్వేలో పెరిగిపోతున్న ముడిచమురు ధరలతో పాటు వ్యవసాయరంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పింది. వృద్ధిరేటు రెండకెల్లో దూసుకుపోవాలంటే రెండు అంశాలు కలిసి రావాలన్నారు. ఒకటి రెవెన్యూ పెరగాలి.. రెండోది వ్యయం కూడా అదే స్థాయిలో పుంజుకోవాలి. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లు కూడా అనుకూలంగా ఉండాలన్నారు. ఒక వేళ ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు పరిమితి స్థాయిలో ఉంటే మాత్రం వృద్ధిరేటు రెండంకెలకు చేరుకోవడం కష్టమేనని ఆయన వివరించారు. ప్రస్తుతపరిస్థితుల్లో వృద్ధిరేటు ఒకవేళ 8 శాతం సాధిస్తే.. మంచి వృద్ధిరేటు సాధించినట్లు లెక్క అని.. ప్రపంచంలోని ఏ ఇతర దేశం 7 శాతం సాధించిన దాఖలాల్లేవన్నారు. ఒక వేళ వృద్ధిరేటు 8 శాతం సాధిస్తే.. అందరి కంటే సంతృప్తి చెందేది తానేనన్నారు. గ్లోబల్ మార్కెట్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జీడీపీ వృద్ధిరేటును విశ్లేషించుకోవచ్చన్నారు. ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ప్రపంచవృద్ధిరేటు క్రమంగా పుంజుకుంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని.. ఈ ఏడాది 2018లో వృద్ధిరేటు 3.9 శాతం సాధించవచ్చునని అంచనా. ఒక వేళ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.9 శాతం సాధిస్తే.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు శరవేగంగా ముందుకు దూసకుపోతాయి. వాటిలో భారత్ వృద్ధిరేటు మరింత జోరందుకుంటుందని ఆయన అన్నారు. భారత్ ఎగమతుల రేటుక్రమంగా పుంజుకుని 14-15 శాతం పెరిగిందని, దీన్ని బట్టి చూస్తే గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ పెరిగిందని తెలుస్తోందని జైట్లీ వివరించారు. ఇదిలా ఉండగా పెద్దనోట్ల రద్దు, జీఎస్టితో ప్రభావంతో 2017-18 ఆర్థికసంవత్సరంలో భారత్ జీడీపీ వృద్దిరేటు 6.75 శాతానికి పరిమితం అయ్యే అవకాశాలున్నాయి. ప్రతి ఆర్థిక వ్యవస్థను చూస్తే జీడీపీ వృద్దిరేటు 5 పర్సెంటేజీ పాయింట్లు పెరిగిన దాఖలాలులేవన్నారు. ప్రతి ఆర్థిక వ్యవస్థకు ఒకస్థాయిలో పరిమితి ఉంటుందన్నారు. గత కొన్ని సంవత్సరాలనుంచి చూస్తే.. వృద్దిరేటు 5 శాతం స్థాయిలో పెరిగిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం జీడీపీ వృద్దిరేటు 7.1 శాతం, అటు తర్వాతి సంవత్సరం 8.2 శాతం, అటు తర్వాత 7.1 శాతం సాధించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం పెద్దనోట్ల రద్దు, జీఎస్టి ప్రభావంతో తన అంచనా ప్రకారం 6.7 నుంచి 6.8 శాతం వృద్దిరేటు సాధించవచ్చునని జైట్లీ ఆశాభావం వ్యక్తం చేశారు.



### ఎల్‌టీసీజీ టాక్స్‌తో ఖజానాకు రూ.40వేల కోట్లు

ఖజానాను నింపుకోడానికి ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్నీ అవకాశాలను చక్కగా వినియో గించుకుంటోంది. బడ్జెట్‌లో ప్రభుత్వం దీర్ఘకాలిక మూలధనం లాభాలపై రూ.1 లక్ష దాటితే 10శాతం పన్ను విధిస్తోంది. దీంతో ప్రభుత్వం ఖజానాకు 2019-20 నాటికి రూ. 40వేల కోట్లు జమ అయ్యే అవకాశాలున్నాయి. పధ్నాలుగు సంవత్సరాల తర్వాత తిరిగి ఎల్‌టీసీజీ పన్నును అమలు చేయడాన్ని ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముఖ్ ఆదియా సమర్థించుకున్నారు. దీనికి ఆయన చెబుతున్న కారణం ఉద్యోగులు ఆదాయంపై 30 శాతం వరకు పన్ను చెల్లిస్తున్నప్పుడు, స్టాక్ మార్కెట్లో పెద్దమొత్తంలో లాభాలను ఆర్జిస్తున్నప్పుడు వారిని పన్ను పరిధిలోకి ఎందుకు తేరాదని ఆయన ప్రశ్నించారు. 2017-18 మదింపు సంవత్స రంలో ఐటి రిట ర్న్స్‌లో లిస్టెడ్ షేర్లలో దీర్ఘకాలిక పెట్టుబడులపై రూ.3.67 లక్షల కోట్లమినహాయింపులు ఇచ్చారని గుర్తుచేశారు. కాగా వచ్చే బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పన్ను ఎగవేతను తగ్గిం చడానికి స్టాక్‌మార్కెట్లో దీర్ఘకాలిక పెట్టుబడి లాభాలపై 10 శాతం పన్ను విధించారు. అయితే జనవరి 31,2018 వరకు ఆర్జించిన లాభాలపై మినహా యింపు ఇచ్చారు. జనవరి 31, 2018 నాటికి షేర్ల ధరల ఆధా రంగా లెక్క గట్టి క్యాపిటల్ గెయిన్ టాక్స్ విధిస్తున్నట్లు ఆది యా పిటిఐకి చెప్పారు. మొదటి సంవత్సరం 2018-19లో క్యాపిటల్ గెయిన్‌టాక్స్ కింది రూ.20వేల కోట్లు, వచ్చే ఆర్థికసంవత్సరం రూ. 20వేల కోట్లు ప్రభుత్వానికి రెవెన్యూ రావ చ్చునని ఆయన అన్నారు. ప్రస్తుతం క్యాపిటల్ గెయిన్‌టాక్స్ 15 శా తం విధిస్తున్నామని.. అది ఒక సంవత్సరం లోపు షేర్లు కొనుగోలు చెసి విక్రయిస్తేనని ఆదియా అన్నారు. అయితే షేర్లు కొనుగోలు చేసి ఏడాది తర్వాత విక్రయిస్తే మాత్రం ఎల్ టీసీ జీ టాక్స్ ఉండదన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1, 2018 లో కొత్త ఎల్‌టీసీజీ పన్ను వ్యవస్థ అమల్లోకి వస్తుంది.

## సీబీఈసీ ఇక సీబీఐసీ

**● ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి...**



**న్యూఢిల్లీ :** పరోక్షపన్నుల విధాన నిర్ణాయక సంస్థ సీబీఈసీ ఏప్రిల్ 1 నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ)గా మారబోతోంది. బడ్జెట్‌పై పార్లమెంటులో చర్చలు జరిగిన తర్వాత ఇది అమల్లోకి వస్తుంది. గత ఏడాది జులై 1 నుంచి జీఎస్టి అమల్లోకి వచ్చిన వచ్చిన తర్వాత సుమారు డజను రకాల కేంద్ర, రాష్ట్రస్థాయి పన్నులు వాటిలో ఎక్సైజ్ సుంకం, సేవల పన్ను అన్నీ మటుమాయం అయ్యాయి. దీంతో సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) పరిధి మరింత పెరిగింది. 2018-19 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ.. ప్రస్తుతం జీఎస్టి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సీబీఈసీని సీబీఐసీగా మారుస్తున్నట్లు తెలిపారు. ఫైనాన్స్ బిల్లు 2018లో భాగంగా సెంట్రల్ బోర్డు ఆఫ్ రెవెన్యూ (సీబీఆర్) చట్టం 1963, దీంతో పాటు సెంట్రల్ గూడ్ అండ్ సర్వీసెస్ టాక్స్ చట్టం 2017లో మార్పులు చేసి సీబీఈసీ స్థానంలో సీబీఐసీని తీసుకువస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.


## సాన్యో బ్రాండ్‌తో పానసానిక్ ఎసీలు

**న్యూఢిల్లీ :** కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీ పానసానొక్ సాన్యో బ్రాండ్‌తో ఎయిర్‌కండిషనర్స్‌ను ఈ వేసవి సీజన్‌లో తీసుకురావాలనుకుంటోందని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. అయితే ఈ ఎయిర్‌కండిషనర్లను ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయిస్తారు. యువతను ఆకర్షించేందుకు ఆకర్షణీయమైన డిజైన్లనులో వీటిని తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తారని కంపెనీ అధికారి వివరించారు. దేశీయ మార్కెట్లో టీవీ ప్యానెల్స్‌ను విడుదల చేసిన ఏడాదిన్నర తర్వాత ఏసీల వైపు దృష్టి మరలించింది. ఇదిలా ఉండగా కంపెనీ ప్రభుత్వ రంగానికి చెందిన ఎనర్జీ ఎఫీసియన్స్ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)కు బిడ్డింగ్ ద్వారా 60వేల ఏసీ యూనిట్లఆర్డర్ దక్కించుకుందని కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో మనీష్ శర్మ చెప్పారు. కంపెనీ వ్యూహాత్మంగా టీవీ, ఏసీలను ఆన్‌లైన్ విక్రయిస్తామని ప్రకటించింది. దీంతో పాటు కంపెనీ ప్రభుత్వరంగానికి చెందిన సంస్థల నుంచి ఆర్డర్ తీసుకుని సరఫరా చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం పిలిచే టెండర్లలో కూడా పాల్గొంటుందని ఆయన వివరించారు. పానసానిక్ దేశీయ మార్కెట్లో పది లక్షల యూనిట్లను ఏసీలను విక్రయించింది. డిసెంబర్ 2009లో పానాసానొక్ సాన్యోలో 50.2 శాతం వాటాలను కొనుగోలు చేసింది. అటు తర్వాత 2011లో పానాసానొక్‌కు సాన్యో అనుబంధ సంస్థ మారిపోయింది.




## రుణాల డిమాండ్ రెండంకెల్లో...


**ముంబై:** బ్యాంకు రుణాల డిమాండ్ రెండంకెల్లో దూసుకు పోతోంది. జనవరి 19తో ముగిసిన పక్షం రోజుల్లో రుణాల డిమాండ్ 10.58శాతం పెరిగి రూ.81,71,399 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది జన వరి 20, 2017లో బ్యాంకు రుణాల డిమాండ్ రూ.73,89,528 కోట్లని ఆర్‌బీఐ తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. అయితే అంతకు ముందు పక్షం రోజులతో పోల్చుకుంటే స్వల్పంగా అంటే 11.11శాతం పెరిగి రూ.82,05,644 కోట్లకు ఎగబా కగా.. క్రితం ఏడాది ఇదే కాలం లో రూ.73,84,568 కోట్లని తెలిపింది. డిసెంబర్ 2017లో ఆహారేతర రుణాల డిమాండ్ పది శాతం పెరిగితే, అదే డి సెం బ ర్ 2016లో నాలుగు శాతం మాత్రమే పెరిగింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాల రుణాల డిమాండ్ డిసెంబర్‌లో 9.5 శాతం పెరిగితే అదే డిసెంబర్ 2016లో 8.2 శాతం పెరిగింది. ఇక డిపాజిట్ల విషయానికి వస్తే జనవరి 19, 2018 పక్షం రోజుల నాటికి చూస్తే 5.10 శాతం పెరిగి రూ.1,09,77,980 కోట్లకు చేరగా.. అంతకు ముందు పక్షం రోజుల్లో రూ.1,04,45,112 కోట్లుగా నమోదైంది. గత కొన్ని నెలల నుంచి చూస్తే డిపాజిట్ల కంటే కూడా రుణాల డిమాండ్ బాగా పెరుగు తూవస్తోంది. రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజాగా విడుదల చేసిన నోట్‌లో స్వల్పకాలంలో బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచుతా యని ప్రకటించింది. ఎందుకంటే డిపాజిట్‌ల కంటే రుణాల డిమాండ్ ఎక్కు వగా ఉందని నోట్‌లో వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం జన వరి 5, 2018 వరకు బ్యాంకు రుణాల డిమాండ్ రూ.2.02 లక్షల కోట్లు కాగా.. బ్యాంకు డిపాజిట్లు మాత్రం రూ.1.27 లక్షల కోట్లుగా ఉన్నాయి. పీఎస్ యు బ్యాంకులకు ప్రభుత్వం రూ.88,139 కోట్ల మూలధనం సమకూ రుస్తామని ప్రకటించడంతో పరిస్థితుల్లో కొంత మార్పులు రావ చ్చునని అంచనా వేసింది. దీంతో రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉం టుందని పేర్కొంది. దీనికి ప్రత్యామ్నయంగా ఆర్‌బీఐ వద్ద బ్యాం కులు అదనపు ఎస్ఎల్ఆర్ హోల్డింగ్‌ను తగ్గించుకునే అవకాశం అయితే ఉంటుంది. ఆ డబ్బుతో బ్యాంకులు రుణాలు ఇచ్చుకోవచ్చు.. అయితే బ్యాంకులు దాని జోలికిపోవని .. దీంతో పాటు బాండ్ల ఈల్డింగ్ పెరిగి ట్రెజరి నష్టాలను కొనితెచ్చుకున్నట్లు అవుతుందని ఇక్రా చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాంకులు ఎక్కువ వడ్డీరేట్లు ఆశచూ పించి డిపా జిట్లు సేకరిస్తుందని ఇక్రా నివేదికలో పేర్కొంది. ఇటీవలే స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బల్క్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 50 బేసిస్ పా యింట్ల నుం చి 140 బేసిస్ పాయింట్లకు పెంచిన విషయం తెలిసిందే. అయితే ఈ డిపాజిట్లు రూ.1 కోటి నుంచి రూ.10 కోట్ల వరకు మాత్ర మేనని గుర్తుం చుకోవాలి. గత రెండు నెలలలో వడ్డీరేట్లు పెంచడం ఇది రెండవసారి.




### ఆర్‌బీఐ పాలసీరేట్లు...


## క్యూ3 ఫలితాలు కీలకం

**● ఈ వారం మార్కెట్**




**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్ తర్వాత మొట్ట మొదటి ట్రేడింగ్ సోమవారం నాడు ప్రారంభం కాబోతోంది. ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేసే అంశాల విషయానికి వస్తే ప్రధానంగా రిజ ర్వుబ్యాంకు పరపతి సమీక్షతో పాటు డిసెం బర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలు మార్కె ట్లకు కీలకం కానున్నాయి. ఈ వారంలో అతి పెద్ద బ్లూచిప్ కంపెనీలు టాటామోటార్స్, పీఎన్‌బీ, సిప్లాలు ఫలితాలు ప్రకటిం చానున్నాయి. ఇవే మార్కెట్లకు దశదిశ చూపించబోతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గత వారం బడ్జెట్‌లో ఈక్విటీ మార్కెట్లో దీర్ఘకాలిక మూలధనం లాభాలపై (ఎల్‌టిసీజీ)పై పది శాతం పన్ను విధిస్తామని ప్రకటిం చడంతో పాటు ద్రవ్యలోటు అదుపు లక్ష్యాన్ని సడలిం చడం రెండు ఇన్వెస్టర్లకు మింగుడుపడలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం అంచనా కంటే పెరగడంతో పాటు, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం రెండు కలిసి వచ్చే ద్రవ్యపరపతి సమీక్షలో రిజర్వుబ్యాంకు వడ్డీరేట్ల తగ్గింపు జోలికిపోయ్యే అవకాశాల్లేవు. బడ్జెట్‌లో ప్రభుత్వం ఎల్‌టీసీజీని ప్రవేశపెట్టడంతో స్వల్పకాలికానికి దీని ప్రభావం మార్కెట్లపై ఉంటుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం నాడు సేవల రంగానికి చెందిన పర్చేజ్‌మేనేజర్స్ ఇండెక్స్ విడుదలకానుంది. దాని ప్రభావం మార్కెట్లపై కనిపిస్తుంది. గత రెండు నెలల నుంచి స్టాక్ మార్కెట్లు లాభాలతో దూసుకుపోతున్నాయి. బడ్జెట్ తర్వాత కరెక్షన్ వచ్చే అవకాశం ఉంది. షేర్ల ధరలు కూడా వాస్తవ విలువ కంటే భారీగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఈ షేర్లు వాస్తవ విలువకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ పండితులు అభిప్రాయ పడుతున్నారు. ఈ వారం త్రైమాసిక ఫలితాలు ప్రకటించే కంపెనీలు ఇలా ఉన్నాయి. టాటా మోటార్స్, హీరోమోటోకార్ప్, లూపి న్, పీఎన్‌బీ, సిప్లా, ఆంధ్రా బ్యాంకు, బీహెచ్ ఈ ఎల్, సెయిల్‌లున్నా యి. ఎస్‌టీ టీతో పాటు ఎల్‌టీసీజీని తీసుకురావడం పట్ల ఇన్వెస్టర్లు అసంతృప్తితో ఉన్నారు. మొత్తానికి మోడీ సర్కార్ బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టి కేంద్రీక రించింది. పెద్దమొత్తంలో కేటాయింపులు అయితే ప్రకటించారు కానీ.. వాటిని ఎలా అమలు చేస్తారనేది అత్యంత కీలకమని మార్కె ట్ నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి గత వారం బడ్జెట్ రోజున లాభాల నుంచి నష్టాల్లోకి జారుకున్న మార్కెట్ శుక్రవా రం పూర్తి స్థాయిలో కుప్పకూలింది. మొత్తానికి గత వారం సూచి 983.69 పాయింట్లు నష్టపోయింది.

## ఎఫ్‌పీఐల పెట్టుబడులు రూ.22వేల కోట్లు



**న్యూఢిల్లీ :** గత నెలలో స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్లు 3.5 బిలియన్ డాలర్లు లేదా రూ.22వేల కోట్లు పెట్టుబడులు పెట్టాయి. కార్పొరేట్ లాభాలు సంతృప్తికరంగా ఉంటాయని దాంతో మంచి లాభాలను ఆర్జించాలనే ఉద్దేశంతో వారంతా పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టారు. అయితే ఈ జోరుకు కొద్దిగా కాలం ఫుల్‌స్టాప్ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్లో అరుణ్‌జైట్లీ ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధనం లాభాలపై పది శాతం పన్ను విధిస్తామని ప్రకటించడంతో విదేశీ పెట్టుబడులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజ గణాంకాల ప్రకారం చూస్తే విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు జనవరిలో ఈక్విటీ మార్కెట్లో రూ.13,781 కోట్లు, డెట్ మార్కెట్లో రూ.8,473 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఈ రెంటిని కలిపితే రూ.22,254 కోట్లుగా తెలుతుంది. దీనికి వ్యతిరేకంగా డిసెంబర్‌తో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్ల నుంచి రూ.3,500 కోట్ల వరకు తరలించు కుపోయారు. విదేశీ ఇన్వెస్టర్లు జనవరిలో పెట్టుబడులు పెరగడానికి ప్రధాన కారణం కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుంది. దీంతో పాటు డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు విడుదల అవుతాయి. ఫలితాలు అంచనా కంటే మెరుగ్గా ఉంటాయని అంచనాతో పాటు అభివృద్ధికి ఊతం ఇచ్చే బడ్జెట్ అనే అంచనాతో విదేశీ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతుంటారని మార్కెట్ నిపు ణులు చెబుతున్నారు. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లో పరిస్థితులు అనుకూలంగా మారడంతో పాటు దేశీయ కార్పొరేట్ కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అంచనా.. అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా వచ్చే ఆర్థిక సంవత్సరం భారత్ వృద్ధి రేటు శరవేగంగా పెరుగుతుందని అంచనా వేయడం కూడా విదేశీ ఇన్వెస్టర్లను భారత్ మార్కెట్లవైపు ఆకర్షించింది. బడ్జెట్లో ఆర్థికమంత్రి దీర్ఘకాలిక మూలధనం లాభాలపై రూ.1 లక్షకంటే ఎక్కువ ఉంటే 10 శాతం పన్ను విధిస్తామని ప్రకటించడంతో స్వల్పకాలానికి మార్కెట్లో పెట్టుబడులకు అడ్డంకులు ఉండవచ్చునని.. అయితే దీర్ఘకాలికానికి ఎలాంటి ఢోకా లేదని చెబుతున్నారు. మొత్తానికి 2017 సంవత్సరం మొత్తానికి చూస్తే విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటి, డెట్ మార్కెట్లో రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టారు.

# సంపన్నుల వలసలు!

**● గతేడాది భారతీయులు 7వేల మంది**



**న్యూఢిల్లీ:** భారతీయ కోటీశ్వరులు తమ మకాం మాతృదేశం నుంచి ఇతర దేశాలకు మార్చుకుంటున్నారు. ప్రపంచదేశాలతో పోల్చుకుంటే చైనా తర్వాత అత్యధికంగా భారతీయ సంపన్నులు విదెశాలకు వలస వెళుతున్నారు. చైనాకు చెందిన హైనెట్‌వర్త్ ఇండివ్యూడివల్స్ 2017లో 7,000 మంది ఇతర దేశాలకు తమ మకాన్ని మార్చుకున్నారు. 2016తో పోల్చుకుంటే ఇది 16 శాతం ఎక్కువ. న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక ప్రకారం 2017లో 7,000 మంది సంపన్న భారతీయులు ఇతర దేశాలకు వలసపోయారు. 2016లో 6,000 మంది పోతే 2015లో 4,000 మంది మిలియనీర్లు మాతృదేశం వదలి కొత్త దేశాలకు తరలిపోయారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 2017లో అత్యంత సంపన్నులైన 10వేల మంది చైనీయులు తమ మకాన్ని ఇతర దేశాలకు మార్చుకున్నారు. ఇక ఇతర దేశాల విషయానికి వస్తే అత్యంత సంపన్నులు టర్కీ నుంచి 6వేల మంది, బ్రిటన్ నుంచి 4వేల మంది, ఫ్రాన్స్ నుంచి 4వేల మంది రష్యా ఫెడరేషన్ నుంచి 3వేల మంది వరకు తమ తమ మాతృదేశాల నుంచి ఇతర దేశాలకు వెళ్లిపోయారు. ఇక భారతీయ సంపన్నులు అత్యధికంగా తమ మకాం అమెరికా, యూఏఈ, కెనెడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌కు తరలిపోగా.. చైనా సంపన్నుల విషయానికి వస్తే వారంతా అమెరికా, కెనెడా, ఆస్ట్రేలియాలకు మార్చుకున్నారు. న్యూవెల్త్ నివేదిక ప్రకారం భారత్ నుంచి చైనా నుంచి సంపన్నులు విదేశాలకు తరలిపోవడం వల్ల ఆ దేశాలకు ఎలాంటి ఇబ్బందుల్లేవని.. ఎందు కంటే ఈ రెండు దేశాలు తరలిపోయిన సంప న్నుల కంటే కొత్తగా మరింత మంది సంపన్నులను త యారు చేస్తున్నాయని వివరణ ఇచ్చింది. సంపన్నులను ఆకర్షిం చడంలో ఆస్ట్రేలియా అగ్రస్థా నంలో ఉంది. గతేడాది 10వేల మంది వివిధ దేశాలకు చెందిన సంపన్నులను రెడ్‌కార్పెట్ వేసి ఆహ్వానించింది. వరుసగా మూడో సంవత్సరం అమెరికాను వెనక్కి నెట్టింది. గత పది సంవత్సరాల నుంచి చూస్తే ఆస్ట్రేలి యా సంపద 83 శాతం పెరిగితే అమెరికా సంపద కేవలం 20 శాతం పెరిగింది. ప్రస్తుతం తాజా పరిస్థితిని చూస్తే సాధారణ అమెరికన్ కంటే ఆస్ట్రేలియన్ అధిక సంపన్నుడు.. పదేళ్ల క్రితం ఈ పరిస్థితి లేదు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే సంపన్నులు తమ మకాంను అమెరికాకు మార్చుకోవాల నుకుంటారు. ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. ఆస్ట్రేలియా ముందు వరుసలో నిలిచింది. రెండవ స్థానంలో అమెరికా నిలిచింది. 2017లో 9,000 మంది అత్యంత సంపన్నులు అమెరికాలో పౌరసత్వం తీసుకుంటే.. కెనడాలో 5,000 మంది, యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 5,000 మంది వలసలు వెళ్లారు. తాజా నివేదిక ప్రకారం చూస్తే ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో భారత్ ఆరవ స్థానంలో నిలిచింది. భారత్ మొ త్తం సంపద 8,230 బిలి యన్ డాలర్లుగా లెక్క కట్టారు. అలాగే ఇక్కడ భారత్‌లో 3,30,400 అత్యంత సంపన్నులు (మి లియన్ డాలర్ల కంటే ఎక్కువ ఆస్తులు ) కలిగి నవారున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే భారత్ ర్యాంకు 9గా నిలిచింది. భారత్‌లో మల్టీ మిలి యనీర్లు 20,730గా తేలిం ది. ప్రపంచ స్థాయిలో చూస్తే ఏడవ ర్యాంకు. రెసిడెంట్ బిలి య నీర్ల విషయానికి వస్తే (దేశంలో ఉండే బిలియనీర్లు) 119గా తేలింది. వారిలో ముగ్గురు గ్లోబల్ లిస్టులో స్థానం సంపాదించుకున్నారు.

ఇక్కడ బిలియనీర్ అంటే రూ. 6,500 కోట్లు లేదా అంత కంటే ఎక్కువ ఆస్తులు కలిగిన వారుగా భావించాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 95వేల మంది మిలియనీర్లు గతేడాది వలసవెళితే.. 2016లో 82వేలు, 2015లో 64వేల మంది ఉన్నారని నివేదిక వివరించింది.




### మెగా హెల్త్‌ప్లాన్‌కు రూ.లక్ష కోట్లు అవసరం

**న్యూఢిల్లీ :** బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం పేదలకు మెగాహెల్త్ కేర్ ప్లాన్ ప్రకటించింది. ఏడాదికి రూ.1,00,000 లక్ష కోట్లు కేటాయింపులు అవసరమని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. గత వారంలో నీతిఆయోగ్ సలహాదారు అలోక్ కుమార్ ప్రకటించిన దాని కంటే పది రేట్లు ఎక్కువ నిధులు అవసరం అవుతాయని వారు చెబుతున్నారు. జాతీయ ఆరోగ్య రక్షణ స్కీం కింద ఏడాదికి రూ.10వేల నుంచి రూ.12వేల కోట్ల వరకు అవసరం అవుతాయని నీతిఆయోగ్ అంచనా వేసింది. అతి పెద్ద పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ఖజానాలపై భారం పడుతుందని చెబుతున్నారు. బీమాలో రెండు శాతం ప్రీమియం ప్రకటించినా.. ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.ఒక లక్ష కోట్ల భారం పడుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

# 22 మందితో భారతీయ నౌక అదృశ్యం


**న్యూఢిల్లీ/ముంబై:** 22 మంది భారతీయులతో కూడిన చమురు ట్యాంకర్ నౌక పశ్చిమ ఆఫ్రికా సమీపంలో అదృశ్యమైపోయిందని విదేశీవ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ఆదివారం తెలిపారు. 22 మంది భారతీయులతో కూడిన వాణిజ్య నౌక మెరైన్ ఎక్స్‌ప్రెస్ గల్ఫ్ అఫ్ గినియాలో బెనిన్ సాగర తీరం వెంబడి అదృశ్యమైపోయింది. నౌక ఆచూకీ తెలుసుకోవడానికి నైజీరియా, బెనిన్ నావికాధికారుల సమన్వయంలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ఒక హెల్ప్ లైన్ (+234 )9070343860 ఏర్పాటు చేశాం అని స్వరాజ్ ట్వీట్ చేశారు. నౌకతో ఎలాంటి సమాచార సంధానం కుదరడం లేదని, నగదు ఇచ్చి విడిపించుకోవాలంటూ ఎలాంటి ఫోన్ కాల్ వచ్చిన దాఖలాలు లేవని ముంబై కేంద్రంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ షిప్పింగ్(డిజిఎస్)కు చెందిన అధికారి ఒకరు చెప్పారు.ముంబై కేంద్రంగా పనిచేస్తున్న నౌక యాజమాన్య సంస్థ ఆంగ్లో ఈస్టర్న్ మేనేజ్‌మెంట్ ఎంతో సహకారం అందిస్తున్నదని, నౌకా సిబ్బంది కుటుంబాల కోసం ఒక అత్యవసర స్పందన కేంద్రాన్ని సైతం నెలకొల్పిందని సదరు అధికారి తెలిపారు.

# బడ్జెట్ కేటాయింపుల్లో తెలుగు రాష్ట్రాల సీఎంలు విఫలం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ** : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విఫలమయ్యారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో 80 శాతం హామీలు అమలు కాలేదని దుయ్యబట్టారు. ఎన్నికల బడ్జెట్ అంటూ జైట్లీ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ వల్ల కార్పొరేట్ కంపెనీలకు తప్ప సామాన్యుడికి లాభం లేదని అన్నారు. ఎన్డీయే హయాంలో రైతుల పరిస్థితి చాలా ఘోరంగా తయారైందని, దేశవ్యాప్తంగా రైతు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని, అయినా సరే రుణమాఫీ చేయడానికి జైట్లీకి చేతులు రావడం లేదని పొంగులేటి దుయ్యబట్టారు. తెలంగాణ విషయానికొస్తే, బడ్జెట్‌లో ఎయిమ్స్‌కి నిధులు రాలేదని, బయ్యారం ఊసే లేకపోగా, హైకోర్టు విభజన ప్రస్తావన కూడా లేదని, చివరకు నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన నిధులు కూడా ఇవ్వలేదని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో మెట్రో, సబర్బన్ రైల్వేకు వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించిన కేంద్రం, హైదరాబాద్ మెట్రో ఊసే ఎత్తలేదని గుర్తుచేశారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న సాగు నీటి ప్రాజెక్టులు చేవెళ్ల ప్రాణహిత, కాళేశ్వరంకు నిధులేవని ప్రశ్నించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం, దళితులపై దాడులు, రాజకీయ హత్యలు, ధర్నా చౌక్ ఎత్తివేయడం వంటి చర్యలే కేసీఆర్ సాధించిన విజయాలు తప్ప కేంద్రంతో పోరాడి సాధించడం తెలియదని విమర్శించారు.

# బీసీ బిల్లుకు పార్టీలు మద్దతివ్వాలి



**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** వెనుకబడిన తరగతుల వారికి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ గురువారం పార్లమెంటులో ఎంపి విజయసాయిరెడ్డి ప్రవేశపెట్టిన ప్రైవేటు బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో ఉన్న రిజర్వేషన్లను జనాభా ప్రకారం 50 శాతానికి పెంచాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ వైఎస్ఆర్‌సిపి ఎంపి విజయసాయిరెడ్డి ప్రవేశ పెట్టిన బిల్లుపై పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉన్న అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని ఆయన ఆదివారం బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రా ల్లో అధికారంలో ఉన్న టిఆర్ఎస్, టిడిపితోపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కమ్యూనిస్టు పార్టీలు, బిఎస్‌పి, ఆర్‌జేడీ, బిజేడీ, జనతాదళ్ పార్టీలు బీసీ బిల్లుకు మద్దతు తెలిపాలన్నారు.

# అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

## ఎంసీహెచ్‌ఆర్డీలో ట్రైనీ ఉద్యోగుల ఆటపాట



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : ప్రభుత్వ పాలన, అధికారం అంతిమ విజయం ఉద్యోగుల నాణ్యమైన పనితీరుపై ఆధారపడి ఉంటుందని స్పెషల్ సీఎస్, ఎంసీహెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ బిపి ఆచార్య అన్నారు. బంగారు తెలంగాణ కల సాకారం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ట్రైనీ జూనియర్ అసిస్టెంట్లకు ఆయన హితబోధ చేశారు. పోటీ పరీక్షలు రాస్తూ తమ కెరీర్‌ను మరింతగా మెరుగుపర్చుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ ముందుకు సాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ట్రైనీ జూనిచర్ అసిస్టెంట్ల సాంస్కృతిక ప్రదర్శన జరిగింది. పలువరు ట్రైనీ అధికారులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని శ్వేతారెడ్డి సరస్వతి వందనంతో ప్రారంభించారు. గానం, సంగీతం, ఇతర ప్రదర్శనలతో ట్రైనీ జూనియర్ అసిస్టెంట్లు అలరించారు. లంబాడ సాంప్రదాయ నృత్యం, తల్లి ప్రేమపై అనురాగంతో కూడిన శ్రావ్యమైన పాటలు కార్యక్రమాన్ని ఓలలాడించాయి. పాటల విభాగంలో పి సునీల్ సంజయ్ పవార్ మొదటి బహుమతిని అందుకున్నారు. 11 మంది సభ్యుల బృందం బోనాలు ఉత్సవాన్ని ప్రదర్శించింది. ఈ ప్రదర్శనకు ఉత్తమ డ్యాన్స్ అవార్డు వరించింది.



# బడ్జెట్ తంత్రంతో... ఎన్నికల బరిలోకి..

## గ్రామస్థాయి నుండి బీజేపీ బలోపేతానికి వ్యూహరచన

- వైద్యం, వ్యవసాయరంగాలపై ప్రత్యేక దృష్టి
- బడ్జెట్‌లోని ప్రతికూల అంశాలతో ప్రతిపక్షం

**న్యూఢిల్లీ** : ఈశాన్య రాష్ట్రాల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలనే కృతనిశ్చయంతో బీజేపీ ఉన్నది. ఆ దిశగా వ్యూహ రచనలు చేస్తున్నది. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి మంత్రంతో ప్రజల ముం దుకు వెళ్లడానికి నిర్ణయించుకుంటోంది. దీంతో పాటు బడ్జెట్‌లో సాగు రంగానికి కేటాయింపు, గ్రామీణాభివృద్ధికి నిధుల వరద, మహిళా సాధికారితకు ఉపయోగపడేలా ఎల్‌పీజీ కనెక్షన్ల పెంపు ఇలా అనేక విషయాలను తెరపైకి తీసుకొస్తూ వచ్చే ఈశాన్య రాష్ట్ర ఎన్నికల్లో విజయబావుట ఎగురవేయాలని చూస్తున్నది. హెల్త్ ఇన్సూరెన్స్, పన్నులు, రాయితీలు ఇలా బడ్జెట్‌లోని ప్రధా నాంశాలను ఎన్నికల ఆయుధంగా పార్టీ మలుచుకుంటున్నది. బడ్జెట్‌లోని అంశాలు తెలుసుకోలేని ప్రతీ ఒక్కరికి వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని బీజేపీ అధిష్టానం కింది స్థాయి నాయకులకు సూచిస్తున్నది. గ్రామీణ అభివృద్ధితో పాటు పేదలను ఆదుకోవాలనేదే బీజేపీ ప్రధాన ఎజెండా అని ప్రజల్లోకి వెళ్లేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ బాసులు వివరి స్తున్నారు. బీజేపీని ఇరుకునపెట్టేందుకు ప్రతిపక్షాలు సైతం సిద్ధం అవుతున్నాయి. బడ్జెట్‌లోని ప్రతికూల అంశాలనే తెరపైకి తీసు కొస్తూ బీజేపీపై గ్రామీణ ప్రాంతంలో చెడు అభిప్రాయం తీసుకొచ్చేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. గుజరాత్‌లో ఆశించినంత అభివృద్ధి సాధించలేకపోయినా.. ఎంతో కష్టపడితే తప్ప బీజేపీ అధికారంలోకి రాలేని పరిస్థితి ఎదుర్కొంది. అదీ కాదన్నట్టు తాజాగా రాజస్థాన్ ఉప ఎన్నికల్లో సైతం బీజేపీకి ఎదురదెబ్బ తగిలింది. ప్రతిపక్షం బలపడుతున్నదని అనడానికి ఇదే సాంకేతకం అని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అజ్మీర్, అల్వార్, మండల్‌గఢ్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షం భారీ మెజార్టీతో గెలించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకొని మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానంలో, అజ్మీర్, అల్వార్ లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల్లోనూ ఘన విజయం సాధించింది. ఈ ఫలితాలు వసుంధరారాజే ప్రభుత్వానికి గట్టి షాక్‌ఇచ్చాయి. వచ్చే ఏడాది నిర్వహించేలోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి గట్టి పోటీ ఇవ్వడానికి కాంగ్రెస్ సన్నద్ధం అవుతున్నది. కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న త్రిపుర ఎన్నికలు ఫిబ్రవరి 18న జరగనున్నాయి. అదేవిధంగా కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కూడా ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఇక కర్ణాటకలో ఎన్నికలు మేలో నిర్వహించే ఆలోచనలో ఎన్నికల కమిషన్ ఉంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ ఎన్నికలు ఈ యేడు చివరలో ఉంటాయి.

త్రిపురలో కమ్యూనిస్టులకు పాలనకు చరమగీతం పాడాలనే ధృఢ సంకల్పంలో బీజేపీ ఉంది. అదేవిధంగా కర్నాటకలో కూడా బీజేపీ జెండా ఎగు రవేయాలని ఆలోచనలో ఉంది. ఈరెండు రాష్ట్రాల్లో కమలం వికసింపజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. బడ్జెట్‌లోని ప్రతికూల అంశాలనే ప్రతిపక్షాలు ఆయుధాలు చేసుకున్నాయి. బడ్జెట్‌లో రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర అందజేస్తామని జైట్లీ ప్రకటించారు. అదేవిధంగా 10కోట్ల నిరుపేద కుటుంబాలకు రూ.5లక్షల బీమాను అందజేయడానికి అంగీకరించింది. దీనికి నమో కేర్‌గా నామకరణం కూడా చేసింది. మరో 2 కోట్ల మరుగుదొడ్లు నిర్మింపజేయిస్తామని, 8 కోట్ల మహిళలకు ఎల్‌పీజీ సిలిండర్లు సైతం పంపిణీ చేస్తామని బడ్జెట్‌లో మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో సైతం రాష్ట్ర నాయకులకు ప్రధాని మోడీ దిశానిర్దేశం చేశారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి, భవిష్యత్ కార్యకలాపాల గురించి ప్రజలకు వివరించాలని సమావేశంలో సూచించారు. సమాజంలోని నిరుపేదలకు బీజేపీ ఏం చేసిందో తెలియజేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా వివరించారు.

# డ్రగ్స్ కేసుతో నా బిడ్డలకు సంబంధంలేదు

## మోహన్‌బాబు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : టాలీవుడ్‌ని కుదిపేసిన డ్రగ్స్ కేసులో తన పిల్లలపై పుకార్లు రావడంపై సీనియర్ నటుడు మోహన్‌బాబు స్పందించారు. వాటితో తన బిడ్డలకు ఎలాంటి సంబందం లేదన్నారు. టాలీవుడ్ మంచి ఇండస్ట్రీ అని.. గొప్పదని అన్నారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచానన్నారు. తన బిడ్డలు గొప్పవాళ్లని.. అటువంటి తప్పు చేయరన్నారు. డ్రగ్స్ విషయం తన దగ్గర ఒకరు ప్రస్తావించినప్పుడు.. లక్ష్మీ ప్రసన్న, విష్ణు, మనోజ్‌లను కూర్చొబెట్టి మాట్లాడానన్నారు. వాళ్లు తప్పు చేస్తే శిక్ష అనుభవిస్తారని మోహన్‌బాబు అన్నారు.

# ఇదేం పోలీసింగ్?

## మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆటోడ్రైవర్ల ధర్నా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : పోలీసులలో మార్పు కోసం ఎన్ని సంస్కరణలు చేసినా అవి ఎందుకు కొరగాకుండా పోతున్నాయి. ఇటీవల పోలీసుశాఖలో కొనసాగుతున్న ఘటనలు ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఇదేం పోలిసింగ్ అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. తాజాగా అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కి నడిపే ఆటో డ్రైవర్లు పోలీసుల వేధింపులు భరించలేక మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ధర్నాకు దిగారు. వివరాల్లోకి వెళితే.. రోజుకొక మద్యం ఫుల్ బాటిల్ లేదా రూ.1000 రూపాయల రొక్కం ఇవ్వాలని ట్రాఫిక్ కానిస్టేబుళ్లు డిమాండ్ చేస్తుం డటంతో మలక్‌పేట ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డిని ఆటోడ్రైవర్లు ఆశ్రయించారు. ట్రాఫిక్ సీఐ వెంకట్‌రరెడ్డి బాధిత ఆటో నాయకులతో మాట్లాడి మీ దిక్కున్నచోట చెప్పు కోండి.. అనడంతో మళ్లీ ట్రాఫిక్ కానిస్టేబుళ్ల వేదింపులు షురూ అయ్యాయి. దీంతో హోం మంత్రి, ట్రాఫిక్ కమిషనర్‌ని కలిసి వినతిపత్రాలను ఆటో డ్రైవర్లు సమ ర్పిం చినా ఫలితం లేకపోయింది. ఓ వైపు క్యాబ్‌ల తాకిడి తదితరాలతో తమ బతుకులు బండలవుతున్న తరుణంలో ట్రాఫిక్ పోలీసులు తమపై కనికరం చూపకపోగా రోజూ వారీ మామూళ్ల కోసం వేధింపులకు పాల్పడటం ఎంత మేరకు సబబు అన్నది ఆటో డ్రైవర్ల వేదనగా ఉంది. తమ కుటుంబాన్ని నడిపేందుకు తమకిదే జీవనా ధారమని, ప్రస్తుతం చాలీ చాలనీ ఆదాయంతో బతుకు భారాన్ని నెట్టు కొస్తున్నామన్నది పలువురు ఆటోడ్రైవర్లు చెబుతున్నారు. ఇవన్నీ తమకేవీ పట్టవని రోజుకు ఓ ఫుల్ బాటిల్ లేదా రూ.1000 రొక్కం సమర్పించాల్సిందేనని ట్రాఫిక్ కాని స్టేబుళ్లు ఏమాత్రం కనికరం లేకుండా తమనుంచి మామూళ్లు వసూ ళ్లకు పాల్పడు తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీంతో సదరు సీఐ, కానిస్టేబుళ్ల వేధింపులు భరించలేక ట్రాఫిక్ సిబ్బందికి డబ్బులిచ్చే వీడియో ప్రూఫ్‌తో వచ్చి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసి, మలకపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# రెండేళ్లలో 2.53 లక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం ఉద్యోగుల సంఖ్య 3996గా నమోదైంది. అదేవిధంగా 2016, 2018 మధ్య పశు సంవర్ధకశాఖ, డెయిరీ అండ్ ఫిషరీస్ శాఖలో 1,519 ఉద్యోగాలు కొత్తగా అందుబాటులోకి వచ్చినట్టు తెలుస్తున్నది. 2016 మార్చి నాటికి 2,342 ఉండగ, మార్చి 1, 2018 నాటికి 3,861 ఉంటుందని అంచనా వేస్తున్నారు. అణు ఇంధన శాఖలో కూడా గత రెండేళ్లలో కొత్తగా 6,279 ఉద్యోగాలు పెరిగాయి. 2016 నుండి 2018, మార్చి 1 నాటికి అటామిక్ ఎనర్జీ శాఖలో 6,279 ఉద్యోగాలకు చేరుతాయని అంచనా వేస్తున్నారు. 2016, మార్చి 1 నాటికి 30,639 ఉద్యోగులు ఉండగా, రానున్న మార్చిలో ఈ సంఖ్య 36,918కి చేరుతుందని బడ్జెట్ పత్రాలు అంచనా వేస్తున్నాయి. 2018 నాటికి పౌర విమానయాన శాఖలో 1197 ఉద్యోగాలు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఇక హోంమంత్రిత్వ శాఖ పరిధిలో గత రెండేళ్లలో అత్యధికంగా పోలీస్ శాఖలో లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. మార్చి 1, 2016లో పోలీస్ శాఖలో 10,24,374 మంది ఉద్యోగులు ఉండగా, మార్చి 1, 2018 నాటికి వీరి సంఖ్య 11,25,093కు చేరుతుందని అంచనా. ఇక విదేశీ వ్యవహారాలు, పర్యావరణం, మైనార్టీ వ్యవహారాలు, గనుల మంత్రిత్వ శాఖలోనూ అదనపు పోస్టులు అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా సాంస్కృతిక మంత్రిత్వశాఖలో వచ్చే మార్చి కల్లా మరో 3,024 మంది ఉద్యోగులు చేరే అవకాశం ఉంది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో మార్చి, 2018 నాటికి 1,196 ఉద్యోగాలు సృష్టించబడనున్నాయి. 2016లో దీని పెరుగుదల సంఖ్య 9,672గా నమోదైంది. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో మార్చిలో 2,234 ఉద్యోగాలను భర్తీ చేస్తుందని అంచనా వేస్తున్నారు. 2016 నాటికి ఇది 5,119కి చేరింది. మైనార్టీ శాఖలో మార్చి నాటికి 772 మంది కొత్త ఉద్యోగులుగా చేరే అవకాశం ఉంది. 2016లో అసలు సంఖ్య 774గా నమోదైంది. గనుల శాఖలో కూడా 772 ఉద్యోగులు పెరిగి సంఖ్య మొత్తంగా 8,562కి చేరుకోనుంది. 2016 నాటికి గనుల శాఖలో 7,790 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని బడ్జెట్ పత్రాలు వివరించాయి.

# ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి

- పేద వైశ్యులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- రాజకీయ, ఆర్థిక రంగంలో రాణించాలి
- తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య పిలుపు

**పరిగి, ప్రభ న్యూస్** : ఆర్యవైశ్యులు సంఘటితం కావడంతో పాటు విశ్వశక్తితో ఎదగాలని తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోషయ్య అన్నారు. స్థానిక శారదా గార్డెన్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ 4వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో స్పీకర్ మధుసూదనాచారీ, స్థానిక ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికి అవి వైశ్యులకు అందడం లేదన్నారు. వైశ్యులలో కూడా చాలామంది పేద వారు ఉన్నారని వైశ్యులంటే అందరూ ధనికులే అన్న విధంగా చూడడం సరికాదన్నారు. నీరుపేద వైశ్యులందరికి సంక్షేమ పథకాలు అందాలన్నారు. సమాజంలో సేవా ధృక్పతం కలిగిన వారు కేవలం ఆర్యవైశ్యులేనన్నారు. వైశ్యులు సంఘటితంగా ఉండి రాజకీయ, ఆర్థిక రంగాలలో ఎదగాలని సూచించారు. వైశ్యుల సంక్షేమానికి తన వంతూ పూర్తి కృషి చేస్తానన్నారు.

**వ్యాపారం చేయడం వైశ్యులకే సాధ్యం : స్పీకర్ మధుసూదనాచారి**

రి అన్నారు. స్థానిక కొప్పుల శారదా గెర్డెన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి టిఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులను అన్ని విధాల ఆదుకునేందుకు టిఆర్ఎస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఆర్యవైశ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండాలని సూచించారు. సమాజానికి ఆర్యవైశ్యుల సేవలు చాలా అవసరమన్నారు. ఆర్యవైశ్యులు ఎవరిని



చేతులు చాచకుండా అవినీతి రహితంగా వ్యాపారాలు చేస్తారని ప్రశంసించారు. అనంతరం వికలాంగులకు ఐవిఎఫ్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ చైర్మెన్ కోలేటి దామోదర్, స్థానిక సర్పంచ్ విజయమాల, ఐవిఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజమౌళిగుప్త, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ స్థానిక ఐవిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, జిల్లాలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

**ఐవిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పెళ్ళి రోజు వేడుకలు..**

స్థానిక కొప్పుల శారదా గార్డెన్ ఫంక్షన్ హాలులో జరిగిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 4వ వార్షికోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఐవిఎఫ్ రాష్ట్ర నాయకులు రాజమౌళి, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి పెళ్ళి రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డి పెళ్ళి రోజును మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సమక్షంలో ఆయన సతీమణి ఉమారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. రాంమ్మోహన్‌రెడ్డి దంపతులతో ఒకరికొకరు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమిళనాడు మాజీ గవర్నర్, పెద్దలు, పితృ సమానులు రోశయ్య సమక్షంలో పెళ్ళి రోజును జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

# కన్నడ తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటు




**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : కన్న డ రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. నూతన అధ్యక్షుడిగా సందీప్ కుమా ర్ మక్తాల ఎన్నికయ్యారు. ఆయన రెండోసారి ఈ పదవికి ఆయన ఎన్నికయ్యారు. బెంగుళూరులోని కబ్బన్ ప్రెస్‌క్లబ్‌లో ఈ ఎన్నిక వివరాలను కన్నడ రాష్ట్ర తెలంగాణఅసోసియేషన్ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో అధ్యక్ష నియా మకంతోపాటు రాష్ట్రకమిటీనీ ప్రక టించారు. బెంగుళూరులో తెలం గాణ భవన్‌ను ఏర్పాటు చేసేందుకు కేఆర్‌టీఏ కృషి చేస్తోంది. ఇప్ప టికే కర్నాటక ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు నూతన అధ్యక్షుడు సందీప్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఈవీ సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా చకినాల రాజేందర్, నాగేందర్, సంయుక్త కార్యదర్శులుగా శరత్‌చంద్ర, భవ్య తదితరులను ఎన్నుకున్నారు.

# ముందస్తు ప్రణాళికతో సత్ఫలితాలు

## 11 లక్షల మంది చేరవేత ఆర్టీసీ ఘనత

### టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రమణారావు సంతృప్తి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : మేడారం జాతర సందర్భంగా ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించామని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు తెలిపారు. మేడారం నుండి వివిధ ప్రాంతాలకు తరలివెళుతున్న ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రయాణికులు క్షేమంగా తిరిగి వెళ్లేందుకు మంచి కండీషన్‌లో ఉన్న బస్సులను సమకూర్చామన్నారు. మేడారం జాతరకు ప్రత్యేకంగా నడుపుతున్న బస్సుల ట్రిప్పుల సంఖ్య 34,500లు కాగా వివిధ ప్రాంతాల నుండి 11 లక్షల మంది ప్రయాణికులను వారి వారి గమ్య స్థానాలకు చేరవేయడం జరిగిందని రమణారావు వివరించారు. జాతర విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికతో ఏర్పాట్లు చేయడంతో పూర్తి స్థాయిలో సేవలు అందించామని పేర్కొన్నారు. మేడారం ప్రయాణికుల రవాణా సౌకర్యం కోసం సుమారు 12000ల మంది అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. విధి నిర్వహణ, ప్రయాణికులను చేరవేయడంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదన్నారు. సాదారణ జనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులను నడిపిన ఘనత తమ సంస్థకు దక్కుతుందని రమణారావు వెల్లడించారు. వరంగల్ కేంద్రం నుండి మేడారం వరకు ఆపరేట్ చేసిన బస్సులు పూర్తి స్థాయిలో కండీషన్‌లో ఉండటంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు. మేడారం జాతరలో విశేష సేవలు అందించిన సిబ్బందిని, అధికారులను రమణారావు అభినందించారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవార్లను దర్శించుకొని తిరుగు ప్రయాణం అవుతున్న భక్తుల రవాణా సౌకర్య ఏర్పాట్ల విషయంలో అన్ని విధాలుగా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నట్లు మేనేజిండ్ డైరెక్టర్ తెలిపారు. భక్తుల రద్దీ మేరకు తగిన బస్సులు సమకూర్చడం జరిగిందన్నారు.

# రైల్వేలో డేటాబేస్ కాంట్రాక్టు వ్యవస్థ

- పకడ్బందీగా కార్మిక చట్టాల అమలు
- మొదటిసారిగా నూతన విధానానికి శ్రీకారం
- ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ల డ్రాఫ్ట్‌కు ఆమోదం

**న్యూఢిల్లీ** : రైల్వేలో కాంట్రాక్టు ఉద్యోగులను నియ మించుకునేందుకు ఆ శాఖ రంగం సిద్ధం చేస్తున్నది. డాటాబేస్ ఆధారంగా వీరి నియామకం ఉండనుంది. నాన్ ఆపరేషనల్ ఏరియాల్లో హౌస్ కీపింగ్, క్లీనింగ్, కన్సల్టెన్సీ, ట్రైనింగ్‌తో పాటు పలు రకాల రైల్వే సేవల్లో మొదట్ట మొదటి సారిగా కాంట్రాక్టు ఉద్యోగాలకు తెరలేపనుంది. జనరల్ కండిషన్స్ ఆఫ్ కాంట్రాక్ట్ (జీసీసీ) సర్వీసెస్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ల కమిటీతో రూపొందించిన డ్రాఫ్ట్‌కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వంతెన నిర్మాణం, బిల్డింగ్‌ల నిర్మాణం, గేజ్ కన్వర్షన్ ప్రాజెక్టు ఇలా కొన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం రైల్వే శాఖ కొత్త నియమ నిబంధనలను తీసుకొచ్చేందుకు సిద్ధం అవుతున్నది. డిజిటల్ కాంట్రాక్ట్ లేబర్ మేనేజ్‌మెంట్ సిస్టం అనేది అన్ని కాంట్రాక్టు కార్మికుల డేటాబేస్ రైల్వేలకు సేవలను అందిస్తుంది. మొదటి సారిగా ఈ కొత్త విధానాన్ని శాఖ తీసుకొచ్చింది. ఈ సిస్టంను కాంట్రాక్టర్ లేదా ఇండియన్ రైల్వేతో భర్తీ చేస్తుంది. కొత్త రకం నిబంధనలతో రైల్వే ఈ కాంట్రాక్టును తీసుకురావడానికి నిర్ణయించుకుంది. హౌస్‌కీపింగ్, క్లీనింగ్ వంటి తదితర పనులకు సంబంధించి అన్ని కాంట్రాక్టు రంగంలో ఈ సిస్టంను తప్పక అమలు




చేస్తున్నట్టు జనరల్ కండిషన్స్ ఆఫ్ కాంట్రాక్ట్ (జీసీసీ) పేర్కొంది. కంప్యూటరైజ్‌డ్ సిస్టమ్‌లో కార్మికు వ్యక్తిగత వివరాలన్ని డేటాబేస్‌ను కల్గి ఉంటుంది. పోలీస్ వెరిఫికేషన్ చేసి, మెడికల్ ఇన్సూరెన్స్, పీఎఫ్, ఐడెంటిటీ సర్టిఫకేట్ సైతం భారత ప్రభుత్వం నుండి జారీ చేయనున్నారు. అటెండెన్స్ డేటా, పని షిఫ్ట్, భద్రతతో పాటు కార్మిక చట్టపరమైన శిక్షణ, జీతం వంటి అన్ని వివరాలు కల్గి ఉంటుంది. కార్మికుడు పనిచేసే సైట్ వివరాలతో పాటు అతనికి ఓ గుర్తింపు కార్డును కూడా జారీ చేయనున్నారు. బ్లడ్ గ్రూపు, ఫోటో, ఏ రకం కార్మికుడు వంటి అన్ని అంశాలు గుర్తింపు కార్డుపై ముద్రించబడి ఉంటాయని రైల్వే బోర్డు వివరించింది. బయోమెట్రిక్ ద్వారా హాజరు లెక్కించడం జరుగుతుంది. బడ్జెట్ సమావేశంలోని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ వ్యవస్థను తీసుకురానున్నామని, దీంతో ఉద్యోగాల నియామకంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. పీఎఫ్, రోజు వారీ కూలీ వంటి అనేక అంశాలపై కాంట్రాక్టర్లపై ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు గోయల్ వివరించారు. ఈ సమస్యను పరిష్కరించడానికిగాను ఓ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. నంబర్ ద్వారా తమ ఫిర్యాదును నమోదు చేసుకోవచ్చని వివరించారు.


లైంగికపరమైన ఇబ్బందులు, వసతులు, కూలీ వంటి ఎలాంటి అంశంపై అయినా టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా తమ కంప్లైట్ నమోదు చేసుకోవచ్చని వివరించారు. కార్మిక చట్టాలకు లోబడి ఈ వ్యవస్థ నిర్వహణ ఉంటుందని తెలిపారు. వ్యవస్థీకృత రంగంలోని అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పించనున్నట్టు గోయల్ చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో దీన్ని ముందుగా తీసుకొస్తామని, తరువాత దేశ వ్యాప్తంగా అమలుకు ప్రయత్నిస్తామని తెలిపారు. జనవరి 24న రైల్వేబోర్డు విడుదల చేసిన పాలసీ ప్రకారం ముందుకు వెళ్తున్నట్టు పీయూష్ ప్రకటించారు.

### మూడు హామీలే మిగిలాయి..

# అన్నీ నెరవేర్చాం!

**●అన్యాయం చేశామనడం అవాస్తవం**

**●నా వద్ద గణాంకాలున్నాయి: హరిబాబు**



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూ రో: రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అయితే ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని భాజాపా రాష్ట్ర అధ్యక్షులు, విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు అన్నారు. ఆదివారం హరిబాబు ఆంధ్రప్రభతో మాట్లాడుతూ గడచిన మూడున్నరేళ్లలో రాష్ట్రానికి చాలా చేశామన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన వాటితో పాటు ప్రకటించని వాటిని కూడా ఎన్నో కేటాయిస్తూ వచ్చామన్నారు. కేంద్రం రాష్ట్రా నికి పూర్తి స్థాయిలో సంపూర్ణ సహకారం అందించిందన్నారు. విభజన చట్టం ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఐదు సంస్థలకు సంబంధించి తాజా బడ్జెట్‌లో రెండు సంస్థలకు అకౌంట్లు ప్రారంభించి నిదులు కేటాయించడం జరిగిందన్నారు. గిరిజన విశ్వ విద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ, దుగ్గరాజుపట్నం ఓడరేవు, కడప స్టీల్ ప్లాంట్, విశాఖకు రైల్వేజోన్‌లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో తాజా బడ్జెట్‌లో గిరిజన విశ్వ విద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటికి పదేసి కోట్లు చొప్పున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. త్వరలోనే ఆయా సంస్థల పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇంకా మూడు సంస్థలు మాత్రమే రాష్ట్రంలో ప్రారంభం కావాల్సి ఉన్నాయన్నారు. మూడున్నరేళ్లలో చాలా ప్రాజెక్టులు పూర్తి చేశామని మిగిలిన ఏడాదిన్నర కాలంలో మూడు సంస్థలు తప్పకుండా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలు దశల వారీగా పూర్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి కేంద్రం అండగా ఉంటుందని భాజాపా ప్రభుత్వం చేసిన కేటాయింపులు పట్ల ప్రజలు కూడా సంతృప్తికరంగా ఉన్నారన్నారు. కేవలం కొన్ని వర్గాలు మాత్రమే రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసినట్లు ప్రచారం చేస్తున్నారని అయి తే ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏ విధంగా సహకరించిందన్నది తమ వద్ద గణాంకాలుతో సైతం ఆదారాలున్నాయన్నారు.

# రెండెకరాల మీకు లక్షల కోట్లెలా వచ్చాయి?

**●బాబుపై సోము వీర్రాజు పరోక్ష ధ్వజం ●రూలింగే లేదు.. అంతా ట్రేడింగేనని వ్యాఖ్య**



కర్నూలు బ్యూరో, ప్రభ న్యూస్: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాష్ట్రంలో బిజెపి, తెలుగుదేశం పార్టీ ల మధ్య రగిలిన చిచ్చు చల్లారడం లేదు. తాజాగా బిజెపి ఎంఎల్‌సి సోమవీరరాజు మరోసారి తెలుగుదేశం పార్టీ నాయకులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. టిడిపి నాయకులు అవినీతికి వారసులంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం కర్నూలు పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్‌హాలులో కర్నూలు బిజెపి అసెంబ్లీ బూతుస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమవీరరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై పరోక్షంగా ఆరోపణలు గుప్పించారు. మేము నిప్పులాంటి వారము, మీరు అవినీతికి వారసులు. రాష్ట్రంలో ఒక మహా నేతను భూస్థాపితం చేసి రాజ్యమేలుతున్న వారు మీరంటూ చంద్రబాబుపై పరోక్ష విమర్శలు చేశారు. బిజెపిని రాష్ట్రంలో బలోపేతం చేయడమే నా అజెండా అని నాకు సొంత అజెండా లేదని తెలిపారు. రాష్ట్రంలో రూలింగ్ లేదు, కేవలం ట్రేడింగ్ మాత్రమే జరుగుతుందని ఎద్దేవ చేశారు. రెండు ఎకరాల రైతునంటున్న మీకు లక్షల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని పరోక్షంగా ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. తమ పార్టీ అధ్యక్షుని ఆదేశాల మేరకే అవినీతిపై ఎదురు తిరుగుతున్నామని, తమకు ఎలాంటి సొంత అజెండా లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి నాంది పలికింది కేంద్ర ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర నిధులు రాష్ట్రంలో కొంతమంది స్వార్ధపరులకు ఆదాయ వనరులుగా మారాయని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే భారీగా అవినీతి జరగడం నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్రమోదీ బొమ్మ వాడటానికి కూడా రాష్ట్రం భయపడుతుందని విమర్శించారు. కేంద్రం అమలుచేస్తున్న అభివృద్ధి పనులలో ప్రధాని పేరు ఎక్కడ రాష్ట్రప్రభుత్వం ప్రచురించడంలేదని వాపోయారు. కరెంట్ సమస్య తీర్చడానికి 5వేల కోట్ల నిధులు మోదీ ప్రభుత్వం ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వమే దీనిని ఒప్పుకుందని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి 9 యూనివర్శిటీలు ఇస్తే ప్రస్తుతం ఎపికి 16 యూనివర్శిటీలను కేటాయించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.100కోట్లు కేటాయించింది మోదీ కాదా అని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం కోసం అనేక నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ వాటిని రాష్ట్రప్రభుత్వం ప్రచారం చేయడంలో విఫలమవుతుందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు బిజెపి ప్రభుత్వం సంసిద్దంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో బిజెపి రోజురోజుకు బలపడుతున్నందున కొంత మంది టిడిపి నాయకులు ఓర్వలేక బిజెపిపై లేనిపోని విమర్శలు చేయడం బాధకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా బిజెపి ప్రభుత్వంతో ఉందామా లేదా అన్న సంక్షేమంలో ఉండటం ఆయన నైజానికే వదిలివేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం కష్టకాలంలో ఉన్నప్పటికీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిధులు కేటాయించి ఆదుకున్నారని ఆయన గుర్తుచేశారు. రానున్న ఎన్నికలలో బిజెపి కార్యకర్తలు గట్టిగా గెలుపుకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రానున్న రోజులలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బిజెపికి అనుకూల పవనాలు వీస్తాయని సోమవీరరాజు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు హరిబాబు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సీనియర్ నేతలు కపిలేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ఎల్పీ భేటీపై కసరత్తు

**●ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేయనున్న సీఎం**

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఆర్ఎస్ఎల్పీ భేటీ నిర్వహించాలని ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిర్ణయించారు. ఈనెల 6 లేదా 7న సమావేశం జరిగే అవకాశం ఉందని పార్టీవర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ తాజాగా నిర్వహించిన సర్వే ఫలితాలతో ఉత్సాహంగా ఉండగా, జిల్లాల వారీగా ఎమ్మెల్యేలను పిలిచి.. వీటివివరాలు అందించనున్నట్లు సమాచారం. ఇక పార్టీ కార్యక్రమాల క్యాలెండర్‌ను కూడా ప్రకటించి, నేతలను.. క్యాడర్‌ను క్రియాశీలం చేసేలా షెడ్యూల్ విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 27న పార్టీ వార్షికోత్సవం జరగనుండగా, అప్పటివరకు పలు కార్యక్రమాలను క్యాడర్ జనంలోకి వెళ్ళేలా ప్రకటించనున్నారు. కొత్త పంచాయతీలు, పాస్ పుస్తకాలు తదితర అంశాలపైనా సిఎం నేతలకు పలు బాధ్యతలు అప్పగించే అవకాశం కనబడుతోంది.

# సినీ నటి కుష్బూపై కేసు


చెన్నై: సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు కుష్బూపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇచ్చిన సమయానికి కంటే ఎక్కువసేపు పార్టీ సమావేశం నిర్వహించినందుకు ఈ చర్య తీసుకున్నారు. నెల్లై జిల్లా, ముక్కూడల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పోలీసులు రాత్రి 10 గంటల వరకే ఈ సమావేశానికి అనుమతి ఇచ్చారు. సమయం ముగిసినా సమావేశం కొనసాగడంతో పోలీసులు కుష్బూ, నేతలపై ఐపీసీ 143, 188 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# యూపీ బీజేపీ ఎంపీ కన్నుమూత

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ హుకుం సింగ్ శనివారం రాత్రి నోయిడాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూసారు. కొద్ది నెలలుగా ఆయన శ్వాస సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. 20 రోజులుగా ఆయన మంచానికే పరిమితమయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా భారీ ఆధిక్యతతో గెలుపొందారు. 79 ఏళ్ల హుకుం సింగ్‌కు సోమవారం పార్లమెంటులో నివాళులర్పిస్తారు. అనంతరం ఎలాంటి సభా కార్యక్రమాలు చేపట్టకుండా సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తారు.


# రాజీనామాలకు సిద్ధం

**●ఎంపీ అవంతి శ్రీనివాస్**




అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా ఎంపీ పదవులకు రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీ అవంతి శ్రీనివాస్ అన్నారు. రాజీనామాలపై చంద్రబాబు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. టీడీపీ పార్లమెంటరీ సమావేశ అనంతరం మీడియాతో అవంతి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఏపీకి హోదా లేకున్నా ప్యాకేజీ రూపంలో అన్ని ఇస్తామని చెప్పారనీ, బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశాన్ని బడ్జెట్‌లో ఎందుకు ప్రస్తావించలేదో అర్థంకావడం లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ప్రజల్లో నెలకొన్న ఆందోళన కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

**బీజేపీ పాలిత రాష్ట్రాలకే కేంద్రం ప్రాధాన్యం : టీజీ వెంకటేష్**




బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం ప్రాధాన్యతనిస్తోందని రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ప్రతి విషయాన్ని చర్చించడం జరిగిందన్నారు. రాష్ట్రప్రయోజనాల మాకు ముఖ్యమని, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై దశలవారీగా ఉద్యమం చేస్తామన్నారు. ముందుగా పార్లమెంటులో నిరసన తెలుపుతామని టీజీ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి ఇవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారని అన్నారు. గత మూడున్నరేళ్లలో చంద్రబాబు తొలిసారిగా కేంద్రంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. రాష్ట్రానికి ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతూ వస్తుందని కానీ ఇప్పటికీ కొన్ని పరిష్కారం కాలేదన్నారు. ఇచ్చినవి కొన్ని ఉన్నా, ఇవ్వాల్సినవి చాలా ఉన్నాయన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కేంద్ర ఆర్థిక శాఖామంత్రి జైట్లీ సుముఖంగా ఉన్నారని వెంకటేష్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రావల్సిన నిధులు, విభజన హామీలకు సంబంధించి కేంద్ర మంత్రులు, ప్రధానితో చర్చిస్తామన్నారు.

**కేంద్రంపై ఒత్తిడి: ఎంపీ బుట్టా రేణుక**



రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎంపీ బుట్టా రేణుక చెప్పారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. విభజన హామీలు, ఆర్థికలోటు, పోలవరం, ప్యాకేజీ తదితర సమస్యల పరిష్కారం కోసం కేంద్రంపై రాజీలేని పోరాటం చేస్తామని రేణుక అన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో చర్చించిన అనంతరమే బడ్జెట్ ప్రవేశపెడతారనీ, అందులో టీడీపీకి చెందిన కేంద్రమంత్రులు రాష్ట్ర నిధులపై ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించగా, కొన్ని గంటల ముందు మాత్రమే బడ్జెట్‌ను మంత్రి మండలి ముందు ఉంచడం జరుగుతుందని, ఆ సమయంలో గమనించడం కష్టమన్నారు.

**పార్లమెంటులో నిరసన... జేసీ దివాకర్‌రెడ్డి**




కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చెందిన అన్యాయంపై పార్లమెంటులో నిరసన తెలియజేస్తామని పార్లమెంటు సభ్యుడు జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఐతే ముందుగా రాష్ట్ర సమస్య పరిష్కారం కోసం కేంద్ర మంత్రులను కలవడం జరుగుతుందన్నారు. సమావేశంలో పొత్తుల సమస్య రాలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాలే ప్రధానమన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సీఎం చంద్రబాబుపై చేసిన ఆరోపణల కు స్పందిస్తూ ప్రస్తుత రోజుల్లో డబ్బు సంపాదించడం చాలా సులభమన్నారు. వ్యాపారాల ద్వారా డబ్బు సంపాదించవచ్చన్నారు. రామోజీరావు, అంబానీలే ఇందుకు నిదర్శనమని జేసీ గుర్తు చేశారు.

**విభజన హామీల కోసం పోరాటం.. ఎంపీ రామ్మోహన్‌నాయుడు**



విభజన హామీల అమలు కోసం రేపటి నుంచి పార్లమెంటులో పోరాటం చేస్తామని ఎంపీ కింజవరపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. హామీల అమలు విషయంలో అడుగు ముందుకు పడటంలేదన్నారు. బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారన్నారు. కేంద్రం స్పందించకపోతే మరోసారి సీఎంతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని పేర్కొన్నారు. టీడీపీ ఎన్డీఏలో మిత్రపక్షమైనా ప్రజాసమస్యలపై పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.


**విభజన హామీలు నెరవేర్చాలి.. ఎంపీ గల్లా జయదేవ్**



విభజన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. ప్రధానంగా పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపు, రైల్వే జోన్, ప్రత్యేక ప్యాకేజీ, ఆర్థిక లోటు తదితర అంశాలు బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై ప్రజలు సర్వత్రా అసంతృప్తికి గురయ్యారన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి ఏపీకి రావల్సిన కేటాయింపులపై కేంద్రంతో చర్చించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూనే సమస్యల పరిష్కారానికి కేంద్రంపై నిరంతర పోరాటం చేస్తామని జయదేవ్ పేర్కొన్నారు.


**ఏపీకి ఇబ్బందికరం.. ఎంపీ తోట నరసింహం**

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఏపీకి ఇబ్బందికరంగా ఉన్నాయని ఎంపీ తోట నరసింహులు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు రాజీలేని పోరాటం సాగిస్తామన్నారు. టీడీపీకి రాష్ట్ర, ప్రజాప్రయోజనాలే ముఖ్యమన్నారు. ప్రధాన సమస్యలు పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు.



విభజన హామీల అమలుకు పార్లమెంటులో తమ నిరసన తెలియజేస్తామన్నారు. రాష్ట్రానికి రావల్సిన కేటాయింపులపై ముందుగా కేంద్రంతో చర్చిస్తామన్నారు. బడ్జెట్ కేటాయింపులో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం పార్లమెంటులో భిన్న రూపాల్లో తమ నిరసన తెలియజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**ఆఖరి బడ్జెట్‌లో సైతం రాష్ట్రానికి అన్యాయం: ఎంపీ కంభంపాటి రామ్మోహన్**



ఆఖరి బడ్జెట్‌లో అయిన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని భావించామని, అయితే అన్యాయం జరిగిందని ఎంపీ కంభంపాటి రామ్మోహన్ అన్నారు. విభజన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఏ మాత్రం ప్రయోజనం లేని బడ్జెట్ వల్ల కొత్త ఆవేశం ఉండడం సహజమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఆచితూచి అడుగులు వేస్తున్నామని చెప్పారు. దేశంలోని 29 రాష్ట్రాల్లా కాకుండా ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల మనోభావాలను కేంద్రం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. విభజన హామీలు రాష్ట్రా నికి రావాల్సిన ప్రయోజనాలు ఒక హక్కని, వీటిని సాధించే దిశగా పోరాటం ఉంటుందని ఎంపి కంభంపాటి రామ్మోహన్ స్పష్టం చేశారు.

**రాష్ట్ర ప్రయోజనాల కోసం గళం విప్పుతాం: ఎంపీ మురళీమోహన్**



రాష్ట్ర ప్రయోజనాల కోసం, కేంద్రం హామీలను అమలు చేసేంత వరకు తమ నిరసన గళాన్ని కొనసాగిస్తామని ఎంపి మురళీమోహన్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు బీజేపీ మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న తాము ఇకపై ఒక కఠిన నిర్ణయం తీసుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఇన్ని రోజులు అనిగిమనిగి ఉంది కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని ఇకపై ఉపేక్షించేది లేదని అన్నారు.

**రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ఆకాంక్ష: మండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్**



రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ఆకాంక్ష అని, రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని మండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్ అన్నారు. పార్లమెంటు వేదికగా రాష్ట్ర సమస్యలపై టీడీపీ ఎంపీలు గళం విప్పుతారన్నారు. తమ స్వరాన్ని పెంచడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. మిత్ర ధర్మం పాటిస్తూనే రాష్ట్ర సమస్యలపై కేంద్రంపై టీడీపీ పోరాటం చేస్తుందన్నారు. సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారానికి తొలుత ప్రయత్నిస్తామని, తప్పని పరిస్థితుల్లో పోరాటం చేస్తామని పేర్కొన్నా రు. విపక్ష వైకాపా బడ్జెట్ బాగుందని బీజేపీతో స్వరం కలపడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామ్యమైనా రాష్ట్రప్రయోజనాల కోసం టీడీపీ విపక్షంలా వ్యవహరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాజీలేని పోరాటం సాగిస్తామని పయ్యావుల స్పష్టం చేశారు.

### ఛత్తీస్‌ఘడ్‌లో పోలీస్‌ను

# హత్య చేసిన మావోలు

రాయ్‌పూర్: ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు అతన్ని అతి కిరాతకంగా గొంతు కోసి చంపేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సౌత్ బస్తర్ ప్రాంతంలో జరిగింది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సౌత్ బస్తర్ రేంజ్) తెలిపిన వివరాల ప్రకారం మృతుడి పేరు సీతారాం బాగ్దే. ఇతను కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఫార్సేగఢ్‌లో నివశిస్తున్న అతని సోదరి ఇంటికి వెళ్లిన అతను బీజాపూర్‌కు తిరుగు ప్రయాణం అయ్యాడు. అయితే శనివారం సాయంత్రం ఫార్సేగఢ్, టోయనర్ ప్రాంతాల మధ్యగల కచ్లరం గ్రామం వద్ద మావోయిస్టులు ఓ ప్రయాణికుల బస్సును అడ్డగించారు. అందరినీ దించి వేసిన తరువాత దానికి నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మిగిలిన వారితో పాటు తన మోటర్ సైకిల్‌పై ఉన్న బాగ్దేను అతని ఐడెంటిటీ కార్డు ద్వారా గుర్తించిన మావోయిస్టులు ఆయన్ను బలవంతంగా అడవిలోకి తీసుకు పోయారు.

ఆదివారం ఉదయం కొందరు స్థానికులు బాగ్దే మృతదేహాన్ని కచ్లరం గ్రామ పరిసరాల్లో కనుగొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళిన భద్రతా బలగాలు రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాడీని పరిశీలించగా గొంతు కోయబడి ఉన్నట్లు గుర్తించామని డిఐజీ తెలిపారు. సోమవారం ఒక రోజు బంద్‌కు మావోయిస్టులు పిలుపు ఇచ్చిన కారణంగా ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి వారు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని ఆయన అన్నారు.

# రోబో సృష్టికర్త.. 11ఏళ్ల చిన్నోడు

ఇంఫాల్: మణిపూర్‌కు చెందిన పదకొండేళ్ళ అభినందన్ దాస్ తన సొంత తెలివితేటలతో రోబోను తయారు చేశాడు. అది గ్లాస్‌ను పట్టుకోవడాన్ని ప్రదర్శింపచేశాడు. అద్భుతాలను సృష్టించాలంటే చదువుతో మేధస్సు ఎంతో అవసరం. దీనికి వయస్సుతో సంబంధలేదని ఆ విద్యార్థి రుజువు చేశాడు. యార్లపట్‌లోని మెగా మణిపూర్ స్కూలులో ఆరో తరగతి చదువుతున్న అభినందన్ దాస్.. వ్యర్థ పదార్థాలతో.. సొంతంగా 'రోబో' తయారు చేసాడు. ఆ రోబోకు 'మెగానంద్-18' అనేపేరు కూడా పెట్టాడు. ఐవీపైపులతో హైడ్రాలిక్ సిస్టమ్ ఉపయోగించడం ద్వారా ఈ రోబో చేతులు కదిపేలా తయారు చేశాడు. ఈ రోబో మంచినీళ్ళ గ్లాసును కూడా పట్టుకోవటాన్ని చూపించాడు. రోబో తయారీకి 20 రోజులు పట్టిందని తెలిపాడు.

### పురుషోత్తంరెడ్డి కేసులో

# ఏసీబీ విస్తృత సోదాలు

**●ఎనిమిది చోట్ల దాడులు ●8 ఇళ్లు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం ●కూతురు, డ్రైవర్‌ను విచారించిన పోలీసులు**

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన నేరంపై పరారీలోఉన్న హెచ్ఎండిఎ అధికారి పురుషోత్తం రెడ్డి ఆస్తుల వేటను అధికారులు ఇంకా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం పురుషోత్తం రెడ్డికి చెందిన దాదాపు రూ. 10 కోట్ల ఆస్తులను సీజ్ చేసిన ఏసీబీ అధికారులు ఆదివారం కూడా దాడులను కొనసాగించారు. ఆదివారం వేర్వేరు బృందాలు అత్తాపూర్, సైదాబాద్, బంజారాహిల్స్, ప్రశాసననగర్, కూకట్‌పల్లి, బోయన్‌పల్లి తదితర ప్రాంతాలలో దాడులు నిర్వహించి ఎనిమిది ఇళ్ళను సీజ్ చేశారు. ఈ దాడులలో పురుషోత్తం రెడ్డి కూతురు విధిత నివాసం, డ్రైవర్ రవిందర్ ఇళ్ళలోనూ సోదాలను నిర్వహించారు. కూతురు ఇంట్లో నుంచి కొన్ని దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తం రెడ్డి కన్సల్టెంట్లను కాకుండా నేరుగా వచ్చే వారికి ప్రాధాన్యమిచ్చే వారని అధికారులు గుర్తించారు. మంచిరేవుల ప్రాంతంలోని ఒక వెంచర్‌కు అనుమతులను నిబంధనలను పక్కకు పెట్టి ఇచ్చారని, సదరు వెంచర్ యజమానులకు కావాల్సిన రహదారి భూమిని ఇప్పించేందుకు ఒక రైతుపై బెదిరింపులకు కూడా దిగినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. సెలవులో వెళ్ళినప్పటి నుంచి పురుషోత్తం రెడ్డి ఎవరితోనూ మాట్లాడటం లేదని, డ్రైవర్ కూడా పలు పర్యాయాలు తన అధికారితో మాట్లాడేందుకు ప్రయత్నించి నా ఫలితం లేదని అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. ఆదివారం జరిపిన దాడు లలో కీలక సమాచారంతో పాటు కొన్ని విలువైన డాక్యుమెంట్లు కూడా లభించా యి పురుషోత్తంరెడ్డి వద్ద పని చేసే అధికారులను, ఆయనతో సన్నిహితంగా ఉన్న వారెవరనే విషయాలను తెలుసుకుని వారందరినీ విచారిస్తున్నారు.

# వీర్రాజు వైసీపీ అద్దె మైకు

**●టీడీపీ నేత పి.ఆర్. మోహన్**

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైకాపా దర్శకత్వంలో నటిస్తున్న ఎంఎల్‌సి సోము వీర్రాజుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విమర్శించే అర్హత లేదని టిడిపి నేత, శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ఛైర్మన్ పి.ఆర్. మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడచిన నాలుగేళ్ళలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఆదర్శంగా తీసుకుని అమలు చేశాయన్న విషయం తెలియదా అని నిలదీశారు. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు సైతం చంద్రబాబునాయుడు పనితీరును ప్రశంసిస్తుండటం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వ్యక్తిగత అభిప్రాయాలతో టిడిపి, బిజెపి మైత్రిని ఏ విధంగా దెబ్బతీస్తారన్నారు. జగన్ డైరెక్షన్‌లో వీర్రాజు నటిస్తున్నారా? లేక విజయసాయిరెడ్డి స్క్రిప్టును ఫాలో అవుతున్నారా? సమాధానం చెప్పాలన్నారు. సోము వీర్రాజు శైలి చూస్తుంటే వైకాపాకు అద్దె మైక్‌లా వ్యవహరిస్తున్నట్లుందన్నారు. బిజెపి నేతలతో పాటు రాష్ట్ర ప్రజలు సైతం ఛీ కొడుతున్నా ఆయన వైఖరిలో మార్పు ఏ మాత్రం రాలేదన్నారు. ఇప్పటికైనా మిత్ర ధర్మాన్ని విస్మరించి నోరు పారేసుకోకుండా మాటలను పొదుపుగా వాడాలన్న విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని వీర్రాజుకు మోహన్ సూచించారు.

### కేంద్ర బడ్జెట్‌లో

# ఆశించిన కేటాయింపుల్లేవు


**● దేవరపాళెంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి**



నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: నాలుగేళ్ళ క్రితం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రాన్ని గాలికి వదిలేసిందని ఫలితంగానే అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందన్నారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తామని చెప్పిన టీడీపీ అధికా రంలోకి వచ్చాక మాటమార్చేసి ప్యాకేజి వైపు మొగ్గుచూపిందన్నారు. ప్రస్తుతం బడ్జెట్‌లో కూడా ఆశించిన స్థాయిలో రాష్ట్రానికి కేటాయింపులు జరగలేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక హోదా కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేకించి ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్‌లను ఏర్పాటు చేస్తామని జగన్మోహన్ రెడ్డి ఆర్యవైశ్యులకు హామీ ఇచ్చారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం ఆయన నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మోపూరు, నరసింహకొండ, దేవరపాళంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా దేవరపాళెంలో ఏర్పాటుచేసిన జిల్లా ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనంలో జగన్ మాట్లాడుతూ పలు రంగాల్లో వెనుకబడి ఉన్న ఆర్యవైశ్యుల కోసం అధికారం చేపట్టిన వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామన్నారు. అదే విధంగా ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు గౌరవార్ధం ప్రతియేటా నవంబర్ 1వ తేది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ విధానం వల్ల పలువురు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చాయని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్యవైశ్యులకు అన్నివిధాలా అండగా ఉండడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ఉన్న వాసవీ సత్రాలను, వాటి నిర్వహణ బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే పేదలకోసం తక్కువ ధరలో నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు రాజన్న పేరుతో క్యాంటీన్లను ఏర్పాటుచేస్తామని వివరించారు. అదేవిధంగా వెనుకబాటుకు సంబంధించి కుల, మతాలకు సంబంధం లేకుండా అందరినీ ముందుకు నడిపిం చేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు.

అదేవిధంగా ఆర్యవై శ్యులు పేరుకే అగ్రకులంలో ఉన్నప్పటికీ పలు రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేత దృష్టి సారిస్తామన్నారు. అలాగే వ్యాపారవర్గాలపై పెరుగుతున్న దాడులను కూడా అరికట్టేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

# పేదరికం లేని సమాజానికి ప్రభుత్వం కృషి: శిద్దా



**అమరావతి, ఆంధ్రప్రభ:** పేదరికంలేని సమాజం నిర్మాణం కోసం తమ ప్రభుత్వంవిశేష కృషి చేస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఆదివారం ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ పరిధిలోని ముండ్లమూరు మండలం పోలవరం ఎస్సీ కాలనీలో నిర్వహించిన దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న దళిత వాడల లో ఉన్న సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక సారించారన్నా రు. దీనికోసం దళిత తేజం - తెలుగుదేశం కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారన్నారు. ఫించన్లు, రేషను కార్డులు, నివేశన స్థలాలు, మౌలిక వసతల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడ ఇటువంటి కార్యక్రమం నిర్వహించలేదని చెప్పారు. గత ప్రభుత్వం దళితకోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిదని విమర్శించారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే గుణం, సత్తా ఒక తెలుగుదేశానికే ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు పార్టీ నేతలు నిత్యం ప్రజల మధ్యలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు అభిలాష అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమా కార్యక్రమాలు ఎస్సీ వర్గాలకు చెందిన వారంతా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలన్నారు.

# భారత్‌తో మైత్రికి ప్రాధాన్యత ఇస్తాం.. కానీ..

బీజింగ్: భారత్‌తో చెలిమికి, సంబంధాలకు తాము ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ పేర్కొన్నారు. కానీ ఇదే సమయంలో తమ దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో పూర్తి నిబద్ధతతో ఉంటామని ఆయన స్పష్టంచేశారు. 'చైనా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ జర్నల్'కు రాసిన వ్యాసంలో వాంగ్ యీ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది వివిధ దేశాలతో దౌత్య సంబంధాల గురించి ఆయన ఇందులో సమీక్షించారు. డోక్లాం వివాదం గురించి కూడా ప్రస్తావించారు. 'డోక్లాంలోకి అక్రమంగా ప్రవేశించిన భారత బలగాలను వెనక్కు పంపే విషయంలో సంయమనంతో వ్యవహరించాం. దౌత్యపరమైన మార్గాల్లో ప్రతిష్టంభన పరిష్కరించాం. భారత్‌కు మేం ఇస్తున్న విలువ, ప్రాధాన్యానికి ఈ ఘటన అద్దం పడుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రాంతీయ శాంతి, సుస్థిరతను దృష్టిలో ఉంచుకొని డోక్లాం విషయంలో చొరవతీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి చైనా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వాంగ్ యీ అన్నారు. గతేడాది జూన్‌లో భారత్- చైనాల మధ్య తలెత్తిన డోక్లామ్ వివాదం 73 రోజులపాటు సాగిన విషయం తెలిసిందే. తమది కాని భూభాగంలో చైనా అక్రమంగా రోడ్డు నిర్మాణాలు చేపట్టడంతో భారత్ అభ్యంతరం వ్యక్తంచేసింది.

సిక్కిం సమీపంలోని డోక్లామ్‌లో చైనా సైన్యం అక్రమ నిర్మాణాలను ఇండియన్ ఆర్మీ అడ్డుకోవడంతో ఉద్రిక్తతలు తలెత్తి ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం చోటు చేసుకుంది. ఒకానొక సందర్భంలో చైనా తీవ్ర హెచ్చరికలు సైతం చేసింది. 1962లో ఏం జరిగిందో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలని డ్రాగన్ బెదిరించే ప్రయత్నం చేస్తే, భారత్ కూడా అంతే దీటుగా జవాబిచ్చింది. ఇది అప్పటి భారత్ కాదంటూ చైనాకు కౌంటర్ ఇచ్చింది. వివాదస్పద ప్రాంతం నుంచి వైదొలగాలని, దౌత్యపరమైన చర్చల వల్లే మాత్రమే సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ పట్టుబట్టడంతో చైనా వెనక్కు తగ్గింది. ఇరు సైన్యాలు ఆ ప్రాంతం నుంచి వైదొలగడంతో పరిస్థితి సద్దుమణిగింది.


# తెరాసవి హత్యా రాజకీయాలు

- రాహుల్ దృష్టికి తీసుకెళ్ళి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా
- శ్రీనివాస్ హత్యలో తెరాస పాత్రలేదని చెప్పగలరా? కేసీఆర్‌ను ప్రశ్నించిన కుంతియా
- కాల్‌డేటాను దాస్తున్నారు: జైపాల్‌రెడ్డి
- కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే అంతుచూస్తాం: ఉత్తమ్
- హోంశాఖ ప్రతిష్టను దిగజార్చారు: జానా
- కేసీఆర్ నడిపిస్తే ఖాకీలు నడుస్తున్నారు: షబ్బీర్
- హత్య వెనుక రాజ్యం హస్తం: భట్టి
- శాసనసభలో పోరాటం చేస్తాం: రేవంత్‌రెడ్డి
- న్యాయపోరాటం చేస్తాం: కోమటిరెడ్డి



**నల్గొండ, ప్రభన్యూస్ బ్యూరో** :కాంగ్రెస్‌నేతలు గాంధేయ మార్గంలో వెళ్తారు.. దానిని టీఆర్ఎస్ నేతలు అలుసుగా తీసుకుని హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా అన్నా రు. సీఎం కేసీఆర్‌కు సవాల్ చేస్తున్నా.. కాంగ్రెస్‌నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో ఎమ్మెల్యే పాత్రలేదని చెప్పగలరా? లేదంటే సీబీఐ విచారణకు సిద్దమేనా అంటూ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. శ్రీనివాస్ హత్య విషయాన్ని యువనేత, ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్ళి సీబీఐ విచారణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. హత్య విషయాన్ని పార్లమెంట్‌లో కూడా ప్రస్తావనకు తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. దారుణ హత్యకు గురైన కాంగ్రెస్ నేత, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీభర్త శ్రీనివాస్ సంతాపసభ నల్గొండ పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఎంఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సంతాపసభ, నిరసన సభకు కాంగ్రెస్ ముఖ్యనేతలంతా హాజరయ్యారు.

### కాంగ్రెస్ కన్నెర్ర చేస్తే..: కుంతియా



ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్రవ్యవహా రాల ఇన్‌చార్జీ కుంతియా మాట్లాడుతూ ఎంతో మంది తల పండిన నేతలు నల్గొండ జిల్లాలో ఉన్నారని నేతలంతా కన్నెర్ర చేస్తే టీఆర్ఎస్‌కి కష్టాలేనని చెప్పా రు. గాంధేయ మార్గంలో కాంగ్రెస్‌నేతలు పోతుంటే అధికార టీఆర్ఎస్ అలుసుగా తీసుకొని దాడులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితులను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకుంటారని చెప్పారు.

కాంగ్రెస్ శాసనసభపక్షనేత కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ పోలీసులు విచారణ జరిపినతీరు.. హత్యకేసులో నిందితులకు బెయిల్ వచ్చిన తీరు చూస్తే కట్టుకథలా ఉందని అన్నారు. పోలీసులు హోంశాఖ ప్రతిష్టను దిగజార్చా రని చెప్పారు. కాల్‌డేటాను తెప్పించి విచారించి కుట్రదారు లను, టీఆర్ఎస్ నాయకులను బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీస్‌శాఖ సీరియస్‌గా వ్యవహ రించడం లేదని చెప్పారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

శాసన మండలి ప్రతిపక్షనేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ శ్రీనివాస్‌ది ముమ్మాటికి రాజకీయ హత్య అని చెప్పారు. కేసీఆర్ నడిపిస్తే పోలీసులు నడుస్తున్నారని అన్నారు. కాల్‌డేటా ఉన్నా పోలీసులు చిన్న మర్డర్‌గా చిత్రీకరించారని మండిపడ్డారు. ఎస్‌పి శ్రీనివాసరావు ను ఐపీఎస్ అని చెప్పేందుకు నాకు సిగ్గుగా అనిపిస్తుందన్నారు.

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లుభట్టి విక్ర మార్క మాట్లాడుతూ శ్రీనివాస్ హత్య వెనుక రాజ్యం హస్తం ఉందని అన్నారు. ప్రశ్నించే నాయకులపై టీఆర్ఎస్ ప్రభుత్వం కేసులు పెట్టడమే కాకుండా హత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డా రు. 24వ తేదీ రాత్రి 4గంటలపాటు ఘర్షణ జరిగిందని పోలీసులు చెప్తున్నప్పటికి ఆపరిసర ప్రాంతాలకు ఎందుకు వెళ్ళలేదని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్‌ది ముమ్మాటికి రాజకీయ హత్య అని, శాసనసభలో హత్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఈ కేసును వదలబోమని కేంద్ర హోంశాఖ, సీబీఐ డైరెక్టర్‌కు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కేసు విషయంలో పోలీసులు ఉల్లిపాయకోసం హత్యజరిగిందంటూ కట్టుకథలల్లి మమా అనిపించారని అన్నారు. క్షణికావేశంలో జరిగిందని ఎస్‌పి శ్రీనివాస్‌రావు జడ్జిమెంట్ రాశారని హత్యకేసులో నిందితులకు ఐదు రోజుల్లో ఆరు మందికి బెయిల్ ఎలా మంజూరవుతుందని ప్రశ్నించారు. దొరగారి గడీదగ్గర పోలీసులు కాపలా కుక్కల్లా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు.

### శిక్షించే వరకు పోరాటం: కోమటిరెడ్డి



శాసనసభపక్ష ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నిందితులు, సహకరించిన వారికి శిక్షపడేంత వరకు కేసును వదిలిపెట్టనని చెప్పారు. న్యాయపోరాటం చేసైనా కేసులో నిందితు లను శిక్షించే విధంగా ముందుకు పోతానన్నారు. మెరుగు గోపిని పార్టీలోకి పంపి మోహన్‌ను డబ్బులతో లోబర్చుకొని అతి కిరాతకంగా దారుణ హత్య చేశారని అన్నారు. నాపై కోపం ఉంటే ప్రజాక్షేత్రంలో తెలుసుకోవాల న్నారు. ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నేను చేయిలేపితే నీకంటే బలంగా ఉంటుందని చెప్పారు.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మధుయాష్కీ మాట్లాడుతూ హత్యా రాజకీయాలతో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయలేరన్నారు. టీఆర్ఎస్ పార్టీ రాబంధుల పార్టీగా మారిందని అన్నారు. మాజీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మందనిలో మధు హత్య జరిగి ఏడాది గడుస్తున్నా పురోగతి లేదని చెప్పారు. పోలీసుల అండతో టీఆర్ఎస్‌పార్టీ గల్లీ లీడర్లుకూడా కాంగ్రెస్ నేతలను భయపెడుతున్నారని చెప్పారు. సంతాప సభలో కాంగ్రెస్ ముఖ్యులు వి.హన్మంతరావు, పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మల్లు రవి, జగ్గారెడ్డి, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే వంశీ చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, పాల్వాయి స్రవంతి, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ జోలికొస్తే అంతుచూస్తాం: ఉత్తమ్



టీపీసీసీ అధ్యక్షులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఇకనుంచి అంతుచూస్తామని టీఆర్ఎస్‌ను హెచ్చరించారు. అధికారపార్టీ, అధికారులే శ్రీనివాస్ హత్యకు కారణమన్నారు. కేసులో ముఖ్యమంత్రి న్యాయం చేయ కపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటా యని హెచ్చరిం చారు. జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డి భాగస్వామ్యం ఉండడంతోనే కనీసం విచారం కూడా వ్యక్తం చేయలేదని అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం శ్రీనివాస్‌ను టీఆర్ఎస్‌లో చేరాలని హెచ్చరించినా పార్టీ మారకపోవడం.. ప్రాణహాని ఉంది భద్రత కల్పించాలని లిఖిత పూర్వకంగా సీఎం, అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతోనే హత్య జరిగిందన్నారు. నిందితులకు కాల్‌డేటా పరిశీలించి దర్యాప్తు చేయమంటే స్థానిక పోలీసులు ఒత్తిడికి తలొగ్గి నిజాన్ని దాస్తున్నారని మండిపడ్డారు.

### ఆధారాలు దాచేస్తున్నారు: జైపాల్‌రెడ్డి



కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్‌ను హత్యచేసి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేశారన్నారు. సాక్ష్యాలు, కాల్‌డేటా బయటకు రాకుండా దాస్తున్నారని చెప్పారు. సీబీఐని ప్రభుత్వం అడగకపోతే మేం ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత కేసును పునర్‌పరిశీలిస్తామన్నారు. చంపినోళ్ళు, సహకరించినోళ్ళను శిక్షిస్తామని చెప్పారు. కాంగ్రెస్ బలాన్ని ఎప్పటికి తక్కువ అంచనా వేయవద్దని అన్నారు.

## శ్రీనివాస్ హత్య పోలీసులకు సవాల్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్గొండ కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసు దర్యాప్తును పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. హత్య వెనుక స్థానిక డిఎస్‌పి, ఎస్‌పిల ప్రమేయం ఉందని, వారి కనుసన్నల్లోనే తమ నేతను ప్రత్యర్థులు హత్య చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. హత్య జరిగిన రెండు రోజులకే నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించడం, వారు బెయిల్‌పై బయటకు రావడం కూడా చకచకా జరిగిపోయాయి. కేసు దర్యాప్తు చేస్తున్న నల్గొండ టూ టౌన్ సిఐ అజ్ఞాతంలోకి వెళ్ళడం మరింత సంచలనం రేకెత్తించింది. హత్య జరగడానికి ముందు, తర్వాత టిఆర్ఎస్ ఎంఎల్ఎ సోదరులతో సంభాషించినట్లు ఆధారాలు లభ్యం కావడంతో పథకం ప్రకారమే శ్రీనివాస్ హత్య జరిగిందన్న కాంగ్రెస్ వాదనకు బలం చేకూరుస్తోందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు అంశాలతో పాటు సేకరించిన ఆధారాలు వెంటనే పంపించాలని డిజిపి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్ళినట్లు తెలిసింది. నల్గొండ సిఐ అజ్ఞాతంలోకి వెళ్ళడం వెనక ఉన్న కారణాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. కీలకమైన కేసు దర్యాప్తు చేస్తున్న సమయంలో అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్ళవలసి వచ్చిందన్న విషయంపై సంజాయిషీని కోరాలని జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావును ఉన్నతాధికారులు ఆదేశించారు. శ్రీనివాస్ హత్య ఘటన దర్యాప్తు ఒక సవాల్‌గా మారిందని అధికారులంటున్నారు. అధికార పార్టీ కనుసన్నల్లో పని చేస్తున్నారన్న అపప్రదను దూరం చేసుకోవడంతో పాటు ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం కలిగించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## ముగుస్తున్న చరిత్ర బీజేపీది.. : సుస్మితా

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ:** బీజేపీ చరిత్ర ముగుస్తోందనీ...రానున్నది రాహుల్ శకమని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు, ఎంపి సుస్మితా మోహన్‌దేవ్ జోస్యం చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీనే కాంగ్రెస్ అంటే వణికిపోతున్నారని, సీఎం కేసీఆర్ ఓ లెక్కా?అని పార్టీ శ్రేణులకు అభయమిచ్చారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఇందిరాభవన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సుస్మితాదేవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా కేసీఆర్ రాష్ట్రంలోని మహిళలను ఒకే విధంగా చూడాలని , పేదమహిళలకు రూ. 30 తో కొనుగోలు చేసిన నాసిరకం చీరలు పెంచుతారా ? ఆ చీరలను తన కూతురు కవిత ధరించగలదా ? తనకు తెలిసి కల్వకుంట్ల కవిత లక్షలు విలువ చేసే చీరలు ధరించడాన్ని పార్లమెంట్‌లో చూస్తానని అన్నారు.




### సమస్యలపై సర్కార్‌ను నిలదీస్తాం : నేరెళ్ల శారద

ప్రజాసమస్యలపై క్షేత్ర స్థాయిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద చెప్పారు.ఇప్పటికే బూత్ స్థాయిలో ఐదు మందితో కమిటీలను ఏర్పాటు చేస్తామని, వాటిని మరింత విస్తృతం చేస్తామన్నారు. పార్టీ పరంగా మహిళలకు గుర్తింపు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నేండ్లు కష్టపడినా గుర్తింపు రావడంలేదని మహిళలు బాధపడుతున్నారని చెప్పారు.

### మహిళలు శక్తిసంపన్నులు : పొన్నాల, సర్వే

జనాభాలో సగం ఉన్న మహిళలు అత్యంత శక్తిమంతులని, వారనుకుంటే సాధించలేదని పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, కేంద్ర మాజీ మంత్రి సర్వేసత్యనారాయణ అన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జీ కమలా థాయా ,ఎమ్మెల్సీ ఆకుల లలి త, ఎమ్మెల్యే ఎన్ పద్మావతి మాజీ ఎమ్మెల్యే అరుణతారతో పాటు మహిళా కాంగ్రెస్ నేతలు దుర్గా రాణి, చందన్ స్వప్న, భాను ప్రియ, పటాన్‌చెరువు సుధా, శంషాద్ బేగం, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గాంధీభవన్‌కు ర్యాలీగా వచ్చారు.




## ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారు

### సీపీఎం రాష్ట్ర మహాసభలో జాతీయ కార్యదర్శి ఏచూరి

**నల్గొండ (టౌన్), ప్రభన్యూస్** : దేశంలో మోడీ హిందూ, ముస్లిం మధ్యల ఘర్షణ పెట్టి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభల సందర్భంగా ఆదివారం బహిరంగసభను స్థానిక లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించారు. సభకు ముందు గొల్లగూడలోని మేఖల అభినవ్ స్టేడియం నుంచి రెడ్‌షర్ట్ వలంటీర్లతో నిర్వహించిన కవాతును జాతీయ నాయకులు బి.వి.రాఘవులు జెండా ఊపి ప్రారంభించారు. బహిరంగసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏచూరి మాట్లాడుతూ దేశంలో ఆర్థిక, సామాజిక దౌర్జన్యం తీవ్రంగా పెరిగిందని, వీటికి వ్యతిరేకంగా పోరాటం తప్ప మరోదారి లేదన్నారు. దోపిడికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదుల దౌర్జన్యాలను అంతం చేసేందుకు నల్గొండ జిల్లాలో నాడు నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాట స్ఫూర్తిని పునికిపుచ్చుకొని బలమైన ఉద్యమాలు నిర్వహించాలన్నారు. మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలేతప్ప సామాన్య ప్రజలకు ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. సంపన్న వర్గాలకు రుణాలు మాఫీ చేశారే తప్ప పేద వారిపై అప్పు, వడ్డీలభారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న పాలకులు వారు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తే ప్రయోజనం ఉంటుందే తప్ప మరొకటిలేదన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆర్థిక దోపిడి, సామాజిక దోపిడికి వ్యతిరేకంగా ఎరుపు, నీలి జెండాలతో ఉద్యమాలను చేపట్టాలని నల్గొండ జిల్లా ఎర్రకొండగా మరోసారి నిరూపించుకునేందుకు ఈరోజు నిర్వహించిన కవాతే విశ్వాసం పెంచుతుందని పేర్కొన్నారు. సభకు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అధ్యక్షత వహించగా జాతీయ నాయకులు బి.వి.రాఘవులు, రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు వి.శ్రీనివాసరావు, హేమలత, అరుణ్‌కుమార్, చెరుపల్లి సీతారాములు, ఎండి జహంగీర్, ముల్కపల్లి రాములు, జి.నాగయ్య, నంద్యాల నర్సింహ్మారెడ్డి, సున్నం రాజయ్య, బి.వెంకట్‌లు పాల్గొన్నారు.

## నర్సరీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** నర్సరీలను పెంచుతున్న రైతులకు కూడా ఉచిత విద్యుత్ అందివ్వాల్సిన అవసరం ఉందని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ రైతులు ఆదివారం పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. నర్సరీల పెంపకాన్ని ప్రభుత్వం వ్యాపారంగా గుర్తించి రైతులను ఇబ్బందులు పెడుతుందన్నారు. అందువల్లనే తమకు ఉచిత విద్యుత్ దక్కటం లేదన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నర్సరీల సాగుదారులను కూడా తక్షణం రైతులుగా గుర్తించి వారికి కూడా ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకూ వారికి జనసేన అండగా ఉంటుందని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

# పొత్తులుండవ్..

## ఇక ఒంటరి పోరే!

- నియోజక వర్గాల పెంపు లేదు • ముందస్తు ఎన్నికలు లేవు
- తెలంగాణ భాజపా నేతలకు అమిత్‌షా నిర్దేశం
- మీడియా చిట్‌చాట్‌లో కె.లక్ష్మణ్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణలో ఏ రాజకీయ పార్టీతో పొత్తులుండవని, ఒంటరిపోరుకే సిద్ధం కావాలని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పార్టీ రాష్ట్ర నేతలకు స్పష్టం చేశారు.ఇప్పట్లో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు కూడా ఉండదని, అలాగే ముందస్తూ ఎన్నికలు వచ్చే అవకాశం అంతకంటే లేదని ఆయన ఖరాఖండిగా చెప్పారు. ఈ మూడు విషయాలను పార్టీ నేతలు దృష్టి సారించి ముందుకు సాగాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రం లో తెరాసతో కలిసిపోటీ చేసే అవకాశమే లేదని, సొంత బలంతోనే 2019లో జరిగే ఎన్నికలకు వెళ్ళడానికి పార్టీ రాష్ట్ర నేతలంతా సిద్దంగా ఉండాలని సూచించారని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో జరిగిన భేటీ వివరాలనుఆది వారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో నిర్వహిం చిన చిట్‌చాట్‌లో లక్ష్మణ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో తెరాసతో కలిసి పోటీ చేసే ఉద్దేశం కూడా జాతీయ పార్టీకి లేదని అమిత్‌షా స్పష్టంగా చెప్పారని తెలిపారు. ఈ నేపథ్యంలో తెరాస ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై మరింత దూకుడు పెంచుతా మనన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో అసెంబ్లీ సీట్లను పెంచాలని స్పష్టంగా ఉందని, అయితే ఈ నిబంధనలను పదేళ్ళలో ఎప్పుడైనా అమలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంద న్నారు. ఈ నేపథ్యంలో 2019లో జరగనున్న ఎన్నికలకు ప్రస్తుత మున్న సీట్ల సంఖ్యతోనే పోటీ చేయాల్సి ఉంటుంద న్నారు. ఇక మీడియాలో వస్తున్న విధంగా కేంద్ర ప్రభుత్వానికి ముందస్తూ ఎన్నికలకు వెళ్ళే ఉద్దేశ్యం లేదని అమిత్‌షా స్పష్టంగా చెప్పారని లక్ష్మణ్ వెల్లడిం చారు. ప్రస్తుతం తెలంగాణ లో భాజపా చేపడు తున్న కార్యక్రమా లు.... చేస్తున్న ఆందోళన కార్యక్రమాలపై పార్టీ జాతీయ నాయకత్వం పూర్తి అసంతృప్తిని వ్యక్తం చేసింద న్నారు. రానున్న జూన్ మాసం నుంచి మాస్‌లెవల్‌లో కార్యక్రమాలను పెద్దఎ త్తున చేపట్టనున్నామని లక్ష్మణ్ వివరించారు.

అలాగే రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని కూడా అమిత్‌షాకు వివరించామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 31వేలకుపైగా ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఉండగా 23వేల వరకు కమిటీలను పూర్తి చేశామని అన్నా రు. 19వేల పోలింగ్ కమిటీల నాయకులతో ఫోన్లద్వారా ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, తగు ఆదేశాలు కూడా జారీ చేస్తున్నామన్నారు. అలాగే పార్టీ పక్షాన 835 మండలకు కమిటీలను వేయాల్సి ఉండగా 779 మండలాలకు కమిటీలను వేశామన్నారు. అలాగే యువమోర్చాకు 835 మండలాలకుగానూ 735 మండల కమిటీలు, ఓబీసీలో 835 మండలలాకుగానూ 490 మండల కమిటీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు.

అలాగే దళితమోర్చకు 434 మండలాలు, కిసాన్‌మో ర్చకు 400 మండలాలు, మహిళామోర్చకు 400 మం డలాలు, మైనార్టీ మోర్చకు 380 మండలాలు, గిరిజన మోర్చకు 200 మండలాల కమిటీలను వేశామన్నారు. అలాగే నాలుగు పోలింగ్ బూత్‌లకు ఒక శక్తి కేంద్రం చొప్పున కమిటీలను వేశామన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టపరుచుకుంటునే మరోవైపు మా ప్రధాన రాజకీయ శతృవైన తెరాసను దీటుగా ఎదుర్కొం టామన్నారు.


## కమలం గూటికి ఎన్‌ఆర్‌ఐ అమరేందర్‌రెడ్డి

వనపర్తి జిల్లాకు చెందిన కొత్త అమరేందర్‌రెడ్డి భాజపాలో చేరారు. ఆదివారం నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అమరేందర్‌రెడ్డి పెద్దసంఖ్యలో అభిమానులు, అనుచరులతో తరలివచ్చారు. ముందుగా అమరేందర్‌రెడ్డి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు.

అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ, అమరేందర్ రెడ్డిని పార్టీలో చేరకుండా ఉండేందుకు అధికార పార్టీ నేతలు పెద్దఎత్తున ఒత్తిడి చేశారన్నారు. కానీ వాటికి తలవొగ్గకుండా భాజపాలో చేరడం అభినందనీయ మన్నారు. రాష్ట్రంలో భాజపాకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనం ఈ చేరకలేనని లక్ష్మణ్ అన్నారు. అమరేందర్‌రెడ్డి రాకతో వనపర్తిలో పార్టీ మరింత పటిష్టమ వుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ పతాకం వనపర్తిలో ఎగరాలని లక్ష్మణ్ అభిలాషించారు. కాగా తెరాస ప్రభుత్వం పట్ల ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోందని, నిరుద్యోగ యువతకు పూర్తిగా మొండిచేయి చూపించిందని మండిపడ్డారు. సిఎం కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు ఇచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోసం కృషి చేసిన వారిని మాత్రం విస్మరించా రన్నారు. ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే తప్ప నీళ్లు ఇచ్చేందుకు కాదన్నారు.

## మోడీ బడ్జెట్..ప్రగతికాముక బడ్జెట్

### దేశపురోభివృద్ధికి దోహదం : కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా లకు అన్యాయం జరగలేదని కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నాయకుడు దత్తాత్రేయ అన్నారు. ఏమైనా సమస్య ఉంటే ఇరు రాష్ట్రా ల సిఎంలు ఢిల్లీకి వెళ్ళి ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలసి చర్చించాలన్నారు. అంతే తప్ప రెండు రాష్ట్రా ల్లోని ప్రధాన ప్రతిపక్షపార్టీలకు భయపడి కేంద్రంపై నిందలు వేయడం సరికాదని ఆయన హితవు పలికారు.ఆదివారం నాంపల్లిలో భాజపా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతాసాంబమూర్తి, మీడియా సెల్ కన్వీనర్ సుధాకర్‌శర్మ, అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, సమగ్రదేశాభివృద్ధికి దోహదపడే బడ్జెట్‌ను ప్రతిపక్షాలు పనిగట్టుకుని విమర్శించడం సరైంది కాదన్నారు. 2017-2018 ఆర్థిక సంవత్సరానికి రూ.24.47 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడితే... కేంద్రం రూ. 25.57 లక్షల కోట్లను ఖర్చు చేసిందని వివరించారు. ఎన్‌ఆర్‌హెచ్‌ఎం (నేషనల్ రూరల్ హెల్త్ మిషన్) పథకం కింద రూ. 5 లక్షల రూపాయలను 10 కోట్ల మందికి వర్తింప చేసేవిధంగా బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ పథకం సుమారు 50 కోట్ల మందికి వర్తించే అవకాశముందన్నారు. పన్నుల రూపంలో తెలంగాణకు 2017-2018లో రూ 16,420 కోట్లను కేంద్రం ఇవ్వగా, ఈ సంవత్సరం రూ. 19,207 కోట్లు రానున్నాయని వివరించారు. అలాగే రామగుండలోని ఎన్టీపీసీకీ స్టేజ్-1 పనులకు రూ,2.059 కోట్లు, రెండు, మూడు స్టేజ్‌ల పనులకుగానూ రూ,1,818 కోట్లు రానున్నాయని తెలిపారు. రైల్వే అభివృద్ధి పనుల కోసం గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,700 కోట్లను ఖర్చు చేయగా, రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.1,750 కోట్లు కేటాయించారని దత్తాత్రేయ వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆదుకునేందుకు గత సంవత్సరంలో రూ, 56,992 కోట్లు రాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికిగానూ రూ,63,836 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం తీసుకున్న ప్రధానమంత్రి ఫజల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఫలితంగా రైతులు పలు రకాలుగా నష్టపోతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ సర్కారు ఉద్వాసనకు కౌంట్‌డౌన్ షురూ

- కంటిముందే కాషాయ సర్కారు
- కమీషన్ ప్రభుత్వాన్ని ఓడించండి
- అభివృద్ధికి భరోసా ఇచ్చే బీజేపీకే ఓటు
- బెంగళూరులో మోడీ ఎన్నికల గర్జన



**బెంగళూరు:** కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం నిష్క్రమణ ద్వారం వద్ద ఉన్నదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హయాంలో 10 శాతం కమీషన్ ప్రభుత్వంగా విమర్శించారు. రాష్ట్రంలో కాషాయ రంగు వీస్తున్నదని మోడీ ధీమాగా చెప్పారు. కర్నాటకలోని మొత్తం 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికలకు శంఖారావం పూరిస్తున్నట్టుగా రాష్ట్ర బీజేపీ 85 రోజుల పాటు చేపట్టిన పరివర్తన యాత్ర ముగింపును పురస్కరించుకొని ఇక్కడి ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో 150కి పైగా అసెంబ్లీ స్థానాల్లో గెలుపును బీజేపీ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో మోడీ సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం ప్రభుత్వం. ఇక్కడ 10 శాతం కమిషన్ ఇవ్వకుండా ఏ ఒక్క పని జరగదు. ఒక ప్రభుత్వానికి అది గుర్తింపు కావడం సిగ్గుచేటు అని విమర్శించారు. రాష్ట్రం అవినీతిలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ విముక్త ప్రభుత్వం అంటే దానర్థం వంశపారంపర్య పాలన, ఆశ్రిత పక్షపాతం, అవినీతి, దోపిడి నుంచి విముక్తి పొందడం అని మోడీ అన్నారు. ఇద్దరు రాష్ట్రమంత్రుల నివాసాల్లో ఐటీ దాడులు, ఒక కాంగ్రెస్ సీనియర్ నేతపై జరిగిన దాడిలో బయటపడిన బినామీ ఆస్తి గురించి సైతం ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో స్టీల్ మాఫియా, ఇసుక మాఫియా, రవాణా మాఫియా ఉందని ఆరోపించారు. ఒక ఉక్కు వంతెన నిర్మాణం పేరుతో కోట్లాది రూపాయలను జేబుల్లో వేసుకోవడానికి కొందరు కుట్రపన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత, బీజేపీ ఆందోళనతో ఆ ప్రాజెక్టును విరమించుకున్నారు అని విమర్శించారు. నగరంలో ఒక కీలకమైన ట్రాఫిక్ కూడలి వద్ద ఒక ఉక్కు వంతెన ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదన, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అది రద్దు కాబడిన అంశాన్ని ఆయన ప్రస్తావించారు. బీజేపీ, దాని అనుబంధ సంస్థలకు చెందిన కార్యకర్తలను హత్యకు గురయ్యారని అన్నారు. అది సామాజిక వ్యవస్థకు అవమానం. రాష్ట్ర సామాజిక వ్యవస్థపై దాడులు చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయండని కర్నాటక ప్రజలను విజ్ఞప్తి చేస్తున్నాను. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని అతి దగ్గరలో చూస్తున్నాను అని మోడీ అన్నారు. బెంగళూరులో నేరస్తులదే రాజ్యమని ఆయన విమర్శించారు. యావత్ ప్రపంచం సులభంగా వ్యాపారం చేయడం గురించి చర్చిస్తుంటే, కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సులభంగా హత్యలు చేయడం పై చర్చలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. అందరితో కలిసి, అందరి అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని పురోగతి దిశగా ముందుకు తీసుకువెళుతుందని హామీ ఇచ్చారు.

## వేడివేడిగా మోడీ పకోడీలు!

- ఉపాధి వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసన
- ప్రధాని సభకు దగ్గర్లో విక్రయాలు

**బెంగళూరు:** మరి కొద్ది గంటల్లో స్థానిక ప్యాలెస్ గ్రౌండ్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ సభ ప్రారంభం కానుంది. సరిగ్గా అక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న మెహక్రి సర్కిల్ దగ్గరకు పట్టభద్రుల వస్త్రాలు ధరించిన కొందరు కాలేజీ విద్యార్థులు చేరుకున్నారు. ఉద్యోగాల కల్పనపై మోడీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సభకు వెళుతున్న వారికి, దారిన పోతున్నవారికి పకోడీలు విక్రయించసాగారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని విద్యార్థులను పంపించివేశారు. వివరాల్లోకి వెళితే.. గడచిన నాలుగు సంవత్సరాల్లో ఉపాధి కల్పన పెద్దగా జరగలేదు కదా అని ఒక న్యూస్ ఛానల్ తాజా ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు టీవీ చానల్ స్టూడియో వెలుపల పకోడీలు అమ్ముకుంటూ రోజుకు రూ.200 సంపాదిస్తున్న వ్యక్తి ఉద్యోగం చేస్తున్నట్టుగా భావించాలని ప్రధాని సమాధానమిచ్చారు. దీనికి నిరసనగా ఆదివారం మోడీ సభకు సమీపంలో నిలిచిన యువ విద్యార్థులు మోడీ పకోడీ, అమిత్ షా పకోడీ, కర్నాటక బీజేపీ అధ్యక్షుడు యడ్యూరప్పను ప్రస్తావిస్తూ డ్యాడ్ యడ్డీ పకోడీలను విక్రయించసాగారు. అనంతరం పోలీసులు వారి నుంచి పట్టభద్రుల వస్త్రాలను స్వాధీనం చేసుకొని, విద్యార్థులను కస్టడీలోకి తీసుకున్నారు.

## మోడీ మాటల్లో టాప్ అంటే..

- బెంగళూరు సభలో ప్రధాని సరికొత్త భాష్యం



**బెంగళూరు:** ప్రధాని నరేంద్ర మోడీ తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ టాప్ ప్రాధాన్యతకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు. టాప్‌లో టి అంటే టమోటా, ఒ అంటే అనియన్(ఉల్లిగడ్డ), పి అంటే పొటాటో(బంగాళాదుంప) అని అర్థమని ఆదివారం ఇక్కడ జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని వివరించారు. ఎవరైతే కాయగూరలు, పండ్లు పండిస్తున్నారో వారికి మేం టాప్ ప్రాధాన్యత ఇస్తాము. నేను టాప్ అని అన్నానంటే దాని ఉద్దేశ్యం దేశంలో ఎక్కడికి వెళ్లినా సరే ఈ మూడు కాయగూరలు కనిపిస్తాయి అని అందుకు నిదర్శనంగా రైతులజీవన స్థితిగతులను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆపరేషన్ గ్రీన్స్ ప్రకటించిందని మోడీ వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్.యడ్యూరప్ప ముఖ్యమంత్రి అయిన వెంటనే కర్నాటకలో సాగునీటి వ్యవస్థ మెరుగుదలకు రూ.ఒక లక్షకోట్లు కేటాయిస్తారని రైతులకు ప్రధాని హామీ ఇచ్చారు.

## నాగా ఒప్పందంపై మోడీని నిలదీసిన రాహుల్



**న్యూఢిల్లీ:** ప్రధాని మోడీ దేశ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కుతూ వంచనతో పాలన సాగిస్తున్నారని, ఇందుకు ఉదాహరణగా అడ్రస్ లేకుండా పోయిన నాగాలాండ్ శాంతి ఒప్పందంను తీసుకొవచ్చు అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. 2015 ఆగష్టు నెలలో నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్‌తో కలిసి ప్రధాని నాగాలాండ్ శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారని, ఈ సందర్భంగా ఇదొక చారిత్రాత్మక ఒప్పందం అని, దీన్ని సాధించిన ఘనత తనదేనని మోడీ నాడు పేర్కొన్నారని, ఈశాన్య భారతంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నారని, కానీ నేటి వరకూ దాని అడ్రస్ లేకుండా పోయిందని రాహుల్ విమర్శించారు. ఈనెల 27న అక్కడ ఎన్నికలు కూడా జరుగనున్నాయి.

## మోడీకి ప్రత్యామ్నాయం రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ** : ప్రధాని మోడీకి ప్రత్యామ్నాయంగా దేశం రాహుల్ గాంధీని గుర్తించిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సూరజ్‌వాలా పేర్కొన్నారు. ప్రధానికి రోజుకు ఆరుసార్లు దుస్తులు మార్చుకోవడంపై ఉన్న శ్రద్ధ దేశ సమస్యలపై, రాష్ట్రాల అవసరాలపై లేకుండా పోయింది అన్నారు. ప్రతిపక్షాల ఐక్యత 2019లో రాజకీయ మార్పిడికి కారణం అవుతుందని ఆయన పేర్కొన్నారు. 2019లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడబోతున్నాం అని కూడా అన్నారు. తాజాగా రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లలో జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు తమ అసహనాన్ని వెలిబుచ్చారు. కేవలం నెలల వ్యవధిలోనే మరో 8 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అప్పుడు బీజేపీ భవితవ్యం మరింత గందరగోళంలో పడుతుంది అన్నారు.

## ట్రంప్ వెన్నంటే భారతీయులు

- వీసాల జారీపై వలసదారుల సంతోషం
- అమెరికా సర్కార్‌కు మద్దతుగా భారీ ర్యాలీ



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసాల జారీలో తీసుకొస్తున్న సంస్కరణల విషయంలో ప్రతిభావంతులైన పలువురు భారతీయులు తమ తమ భార్యలు, పిల్లలతో కలిసి సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది భారతీయులు వైట్‌హౌస్ ఎదుట చేరుకుని ట్రంప్ చేపడుతున్న సంస్కరణలకు మద్దతు తెలిపారు. గొలుసుకట్టు వలసదారుల నియంత్రణ, లాటరీ తరహా వీసాలకు స్వస్తి పలకాలని భావిస్తున్న ట్రంప్‌తో తాము ఎల్లవేళలా వెన్నంటి ఉంటామని వివరించారు. మెరిట్ ఆధారంగా అమెరికాలో ఉద్యోగం చేయడానికి అవకాశం కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూయార్క్, ఫ్లోరిడా, మాంచెస్టర్‌లలో పని చేస్తున్న పలువురు భారతీయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వీరంతా గ్రీన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న వారే ఉన్నారు. తాము కూడా ట్రంప్ తీసుకునే నిర్ణయాలను సమ్మతిస్తున్నామని, ప్రతిభావంతులకు అవకాశం కల్పిస్తే.. అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని భావిస్తున్నామని నేషనల్ పాలసీ, రిపబ్లికన్ హిందు కూటమి డైరెక్టర్ క్రిష్ణ బన్సల్ చెప్పుకొచ్చారు. అమెరికాలో నివసిస్తున్న ప్రతిభావంతులైన వేలాది మందికి గ్రీన్ కార్డులు అందజేస్తే.. అమెరికాకు ఆర్థిక వ్యవస్థ పటిష్టం చేయడానికి కృషి చేస్తారని బన్సల్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ట్రంప్ పాలసీలకు మద్దతు తెలుపుతూ నినాదాలు చేస్తూ వైట్‌హౌస్ వరకు ర్యాలీ చేపట్టారు. మంచి జీవితాన్ని అనుభవించాలని అనుకుని వచ్చిన వారికి గ్రీన్ కార్డు అందజేస్తే బాగుంటుందని వర్జినియాలో నివాసం ఉంటున్న తంజావూరుకు చెందిన 13 ఏళ్ల రోనాల్డ్ రేగన్ మిడిల్ స్కూల్ విద్యార్థిని అక్షిత రమేశ్ చెప్పారు. గ్రీన్‌కార్డుల కోసం మరికొన్ని సంవత్సరాలు వేచి ఉంటే.. తరువాత కొన్ని దశాబ్దాల్లో వారి తల్లిదండ్రులు చట్టబద్ధంగా నివసించే హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని అక్షిత చెప్పారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ పెరుగుతూపోతోందని, ఏడాదికి సుమారు 4లక్షల మంది ప్రతిభావంతులైన ఉద్యోగులు అమెరికాకు అవసరం అవుతున్నారని ఆర్గనైజింగ్ బృందం సభ్యుడు అనిల్ శర్మ తెలిపారు.

## మార్చి నెలలో మోడీ నేపాల్ పర్యటన

**కాట్మండు:** భారత ప్రధాని నరేంద్ర మోడీ నేపాల్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశాన్ని సందర్శించే అవకాశం ఉందని సిపిఎన్-యుఎంఎల్ కూటమి కార్యదర్శి ప్రదీప్ గ్యావలి ఆదివారం ఇక్కడ విలేకరులతో అన్నారు. వామపక్ష కూటమి నేత కె.పి. శర్మ ఒలి నేపాల్ కొత్త ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం భారత ప్రధాని సందర్శన ఉండవచ్చని గ్యావలి తెలిపారు. మోడీ ఒలికి రెండు సార్లు ఫోన్ చేశారు. ఇరువురు నేతలు వారి వారి దేశాలను సందర్శించాలని పరస్పరం ఆహ్వానించుకున్నారు అని చెప్పారు. అపనమ్మకాన్ని పారద్రోలడమే లక్ష్యంగా విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ఇటీవలి సందర్శన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఒక ఉపకరణంగా పనిచేస్తుందని గ్యావలి తెలిపారు. వామపక్షకూటమి భారత్‌తో ఒక సుహృద్భావ సంబంధం అభివృద్ధిని ఆశిస్తున్నదని చెప్పారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు, ఒలి నేతృత్వంలో సిపిఎన్- యుఎంఎల్, ప్రచండ నేతృత్వంలో సిపిఎన్-మావోయిస్టు సెంటర్ మధ్య ఏకీకరణ గురించి విలేకరులు ప్రశ్నించగా రెండు కార్యక్రమాలు వచ్చే నెలలో పూర్తవుతాయని గ్యావలి వెల్లడించారు.

## 81ఏళ్ల బామ్మకు డిప్లమా

**బీజింగ్:** దశాబ్దాల ఆశయాన్ని 81ఏళ్ల బామ్మ ఎట్టకేలకు సాధించింది. చైనాలోని తియాన్జిన్ యూనివర్సిటీ నుంచి అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించి తన చిరకాలవాంఛ తీర్చుకుంది. దీంతోపాటు వర్సిటీలో డిప్లొమా సాధించిన అత్యంత పెద్ద వయస్కురాలిగా రికార్డ్ సైతం నెలకొల్పింది. ఈ అత్యంత అరుదైన ఘటనకు సంబంధించిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. 81సంవత్సరాల వయసున్న ఎక్స్యూయి చైనాలోని తియాన్జిన్ యూనివర్సిటీ నుంచి డిప్లోమా సాధించింది. పట్టా ప్రదానోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలో ఆమె మాట్లాడుతూ జీవితమంటే నిరంతర సవాల్‌గా భావిస్తాను అన్నారు. నన్ను నేను మెరుగుపరుచుకోవడానికి, చిన్న వయసులో సాధించలేని నా ఆశయాన్ని మలి వయసులో సాధించేందుకు గొప్ప అవకాశమిచ్చి నా కల నిజమయ్యేలా చేసిన తియాన్జిన్ వర్సిటీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. నా ఆశయానుగుణంగా నా సొంత మార్గం లో నేను జీవించటానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తాను అన్నారు. ఎదుటి వారి ఒత్తిడికి లొంగిపోకూడదన్నారు. ఆమె తన సుదీర్ఘ జీవితంలో ఎదుర్కొన్న కష్టనష్టాలను అక్కడున్న విద్యార్థులకు వివరించారు.

ఎక్స్యూయి తన విద్యాసాధన కోసం తియాన్జిన్ యూనివర్సిటీలో ఈ.కామర్స్ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో 77ఏళ్ల వయసులో ఉండగా మార్చి 2014లో ఎన్‌రోల్ చేయించుకున్నారు. దీనికోసం ఆమె యూనివర్సిటీలోని డిస్టన్స్ ఎడ్యుకేషన్ విధానాన్ని ఎంచుకున్నారు. ప్రతిరోజు ఉదయం 5గంటలకు లేచి విద్యాభ్యాసం చేసేవారు. విద్యాభ్యాసం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. నా జీవితానికి విలువైన బహుమతి విద్యాభ్యాసం అన్నారు. ఎక్స్యూయి చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్ మరియు లాటిన్ భాషలపై పట్టు సాధించారు. కంప్యూటర్ విద్యలోనూ ఆమె ఆసక్తి చూపి ఫొటోషాప్, ఎక్సెల్ తదితర సాఫ్ట్‌వేర్‌లపై కూడా విశేష ప్రతిభ చూపుతారు. ఫొటోగ్రఫీ, స్విమ్మింగ్ తనకు ఇష్టమైనా వ్యాపకాలని ఆమె తెలిపారు.

## మృతదేహాన్ని 70 కి.మీ. ఈడ్చుకెళ్లిన బస్సు



**బెంగళూరు:** వేగంగా వస్తున్న వాహనం ఎవరినైనా ఢీకొట్టినప్పుడు 200-300 మీటర్లు లాక్కెళ్లిన ఘటనలు చూసి ఉంటాం. లేదంటే ఒకట్రెండు కిలోమీటర్ల దూరం అలాగే వెళ్లిన ఘటనలూ చూసి ఉంటాం. కానీ కర్ణాటక ఆర్టీసీ బస్సు మాత్రం మృతదేహాన్ని ఏకంగా 70 కి.మీ. దూరం ఈడ్చుకెళ్లింది. వివరాల్లోకి వెళితే.. కేఎస్ఆర్టీసీ బస్సు శుక్రవారం రాత్రి నాన్ ఏసీ స్లీపర్ బస్సు కూనూరు నుంచి బెంగళూరుకు వచ్చింది. మైసూర్- మండ్య - చెన్నపట్న మార్గంలో బస్సు నడిచింది. బస్సు చెన్నపట్న సమీపంలోకి రాగానే దేన్నో బలంగా ఢీకొట్టినట్లుగా శబ్దం అయ్యింది. అర్ధరాత్రి వేళ కావడంతో డ్రైవర్‌కి ఏం కనిపించలేదు. దీంతో బహుశా రాయి కావచ్చని భావించిన అతడు అలాగే బస్సును నడుపుకుంటూ వచ్చాడు. మెజిస్టిక్ బస్ స్టాండ్‌కెళ్లి ప్రయాణికుల్ని దింపిన తర్వాత రాత్రి 2.35 గంటల సమయంలో శాంతినగర్ డిపోలో బస్సును నిలిపి విశ్రాంతి గదికెళ్లాడు. ఉదయం 8 గంటల సమయంలో బస్సును కడిగేందుకు అక్కడి నుంచి తీస్తుండగా.. బస్సు కింది భాగంలో మృతదేహం ఉండటాన్ని పారిశుద్ధ్య సిబ్బంది గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు 30-40 ఏళ్ల మధ్య ఉంటుందని అంచనాకు వచ్చిన పోలీసులు మృతదేహాన్ని విక్టోరియా ఆస్పత్రికు తరలించారు. బెంగళూరు- మైసూరు మార్గంలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

## తమిళ రాజకీయాల్లో మరో ట్విస్టు

**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో మరో మలుపు. సమత్తువ మక్కల్ కట్చి, నామ్ తమిళర్ కట్చి పార్టీలు కలసి ఓ కొత్త కూటమిని ఏర్పాటు చేశాయి. ఈ విషయాన్ని ఎస్ఎంకే అధ్యక్షుడు, హీరో శరత్‌కుమార్ స్వయంగా వెల్లడించారు. ఆదివారం మధురై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఇక ఎన్టీకే అధినేత సీమాన్‌తో కలసి పోరాడతామని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారని ఆరోపించిన ఆయన, అంశాల వారీగా తమ పోరాటం ఉంటుందని అన్నారు. రజనీ, కమల్‌కు వ్యతిరేకంగా తరచూ మాట్లాడే శరత్ కుమార్, సీమాన్‌లు చేతులు కలపడం చర్చనీయాంశమైంది.

## వాస్తవాన్ని అంగీకరించని ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశ ఆర్థిక పరిస్థితిపై అవగాహనలేమితో ఉదాసీనంగా వ్యవహరిస్తూ యథార్థాన్ని తిరస్కరిస్తుందని మాజీ ఆర్థికమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత చిదంబరం వ్యాఖ్యానించారు. క్లిష్ట ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వానికి అవగాహన కల్పించిన ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యన్‌ను చిదంబరం 'మంచి వైద్యుడు'గా అభివర్ణించారు. అయితే చెడ్డరోగి వ్యాధి నివారణకు సూచించిన మెరుగైన వైద్యాన్ని తిరస్కరించి తన సొంత వైద్యాన్ని అవలంబిస్తాడన్నారు. అక్టోబర్ 2014లో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియమితులైన అరవింద్ సుబ్రహ్మణ్యన్ మంచి వైద్యుడైతే, ఎన్డీయే ప్రభుత్వం ఒక చెడ్డ రోగిగా వ్యవహరిస్తోందని చిదంబరం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం దేశ ఆర్థిక పరిస్థితిని యథాతథంగా స్వీకరించడాన్ని తిరస్కరిస్తూనే ఉందన్నారు. దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యను తిరస్కరి స్తుంది, ప్రతిపక్షాల వాదన తిరస్కరిస్తుంది. చివరికి తన నియమించుకున్న సొంత ఆర్థిక సలహాదారుల సూచనలు సైతం తిరస్కరిస్తుందన్నారు. ఒక చెడ్డరోగి వ్యాధినివారణకు అవసరమైన ఔషధాలను తీసుకోక పోగా తనే వ్యాధి నిర్ధారణ చేసుకుని సొంతంగా వైద్యం చేసుకుంటాడని ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక విధానాలను వరుస ట్వీట్లతో పరోక్షంగా ఎండగట్టారు. సంస్కరణలు రూపొందించడానికి, షెడ్యూల్స్ ఏర్పాటు చేయడానికి బడ్జెట్ ఒక సందర్భంగా పేర్కొన్నారు.

## ఒడిషాలో భారీ అగ్ని ప్రమాదం




**కటక్:** ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లా బాదంబాడి ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించింది. 2హోటళ్లు, దుకాణ సముదాయంలో మంటలు వ్యాపించాయి. దీంతో వాటిలో ఉన్న సామాగ్రి అంతా దగ్ధమైంది. 10 అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది మంటలు అదుపు చేశారు. సమీపంలోని భవనాలకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది నిరోధించారు. ఈ సందర్భంగా ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది గాయపడ్డారు.

## బడ్జెట్ సెషన్‌లో బోఫోర్స్‌పై చర్చ!



**న్యూఢిల్లీ :** బోఫోర్స్ కుంభకోణం 27 ఏళ్ల కింద వెలుగులో కొచ్చింది. ఈ విషయాన్ని పార్లమెంటరీ కమిటీ పరిశీలించ నుంది. ప్రస్తుత బడ్జెట్ సెషన్‌లో ఈ అంశంపై నివేదికను పూర్తి చేయనున్నట్టు సభ్యులు తెలిపారు. బోఫోర్స్ చాలా ఏళ్ల నాటి పెండింగ్‌లో ఉన్న అంశం అని పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి కాగ్ రిపోర్టు ఇచ్చింది. ఇక పబ్లిక్ అకౌంట్స్ కమిటీ రంగంలోకి దిగి బోఫోర్స్ కుంభకోణంలో ని అంశాలను లోతుగా పరిశీలించి ఆడిట్ చేసి, కాగ్ ఇచ్చిన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి. 1989 నుంచి 1990 మధ్య కాగ్ ఇచ్చిన నివేదికలోని కొన్ని అంశాలను మరింత లోతుగా చర్చించడానికి గాను ఆరుగురు సభ్యులతో కూడిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కానీ నివేదికను ప్యానెల్ ఎదుట సమర్పించడంలో అలసత్వం ప్రదర్శించారని, సంబంధిత మంత్రిత్వ శాఖ, ప్రభుత్వం కేసును నీరుగార్చిందని సబ్‌కమిటీలోని సభ్యుడు, బిజు జనతా దళ్ (బీజేడీ) నాయకుడు భారత్హరి మహతబ్ ఆరోపించారు. బడ్జెట్ సెషన్‌లో దీనికి ముగింపు ఉంటుందని మరో సభ్యుడు చెప్పారు. బోఫోర్స్ ఒప్పందంలో అవినీతి జరిగిందని ఆయన చెప్పుకొచ్చారు. పబ్లిక్ అకౌంట్ సబ్ కమిటీ రిపోర్టును ఫైనల్ చేసి ప్రధాన కమిటీకి అందజేయాలి. అప్పుడు దానికి అప్రువల్ లభిస్తుందని సభ్యుడు వివరించారు. ప్రధాన కమిటీకి నాయకుడిగా కాంగ్రెస్‌కు చెందిన మల్లికార్జున్ ఖర్గే ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలపై కొన్ని రోజుల క్రితం సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 12 ఏళ్లతరువాత హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ పిటిషన్ దాఖలు చేయడంతో బోఫోర్స్ కుంభకోణం మరోమారు తెరపైకి వచ్చింది.

## మెహందీ ఫంక్షన్: 502 మంది పెళ్లికూతుళ్లు



**సూరత్:** సామూహిక వివాహం కార్యక్రమాల్లో భాగంగా సూరత్‌లో జరిగిన మెహందీ కార్యక్రమ ఫొటో ఇది. వీరంతా అహిర్ సామాజిక వర్గానికి చెందిన 502 మంది పెళ్లికూతుళ్లు. గిన్నిస్ రికార్డు సృష్టించేందుకు అందంగా ముస్తాబై తమ చేతులకు మెహందీ పెట్టించుకున్నారు.

## మైనస్ 55 డిగ్రీల చలిలో నిర్మలా సాహసం

**న్యూఢిల్లీ:** గతంలో భారత రక్షణ మంత్రులెవరూ చేయని సాహసం చేశారు నిర్మలా సీతారామన్. మైనస్ 55 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉన్న.. లఢక్‌లోని అత్యంత ఎత్తయిన పోస్ట్‌ను సందర్శించారు. సైనికులతో మాట్లాడారు. ఇండియా- చైనా సరిహద్దులో.. ఉన్న ఈ ప్రాంతం ప్రపంచంలోనే అత్యంత ఎత్తయినది. సముద్రమట్టానికి 16 వేల 7 వందల కిలోమీటర్ల ఎత్తులో ఉంటుంది.



# సినిమా విందుకు సిద్ధంకండి!


సైరా

ఏడాదికి అత్యధిక సంఖ్యలో చిత్రాలను నిర్మిస్తూ...చరిత్ర సృష్టిస్తోంది టాలీవుడ్. దాదాపు రెండు వందల చిత్రాలు రూపకల్పన జరుగుతున్నాయి. వీటిలో మూడొంతులు చిన్న చిత్రాలు. పది నుంచి పాతిక సినిమాలు మాత్రమే ప్రేక్షకుల్లో అమితాసక్తిని కలిగిస్తుంటాయి. వీటి కోసమే అంతా ఎప్పుడు విడుదలకు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు. అలాంటి భారీ సినిమాలు మరికొద్ది నెలల్లో తెరపైకి రాబోతున్నాయి. మరి ఆ సినిమా విందుకు మీరూ సిద్ధంకండి...

### మహానటి...

దక్షిణాది సినిమా తరాలుగా చెప్పుకునే అభినేత్రి సావిత్రి. మహానటి అని పిలిపించుకున్న ఈ నాయిక జీవిత కథతో మహానటి అనే సినిమా రూపొందిస్తున్నారు దర్శకులు నాగ్ అశ్విన్. కీర్తి సురేష్ సావిత్రి పాత్రలో నటిస్తుండగా...ఇతర పాత్రల్లో సమంత, విజయ్ దేవరకొండ తదితరులు నటిస్తున్నారు. మహానటి జీవిత చరిత్రతో వస్తున్న తొలి చిత్రం కావడం మహానటి ప్రత్యేకత. మార్చి 29న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

### రంగస్థలం...

80వ దశకపు గ్రామీణ ప్రేమకథను చూపించబోతున్న సినిమా రంగస్థలం 1985. రామ్ చరణ్, సమంత జంటగా నటిస్తున్నారు. మైత్రీ మూవీస్ నిర్మాణంలో దర్శకులు సుకుమార్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మార్చి 30న రంగస్థలం 1985 విడుదల కాబోతోంది. ఈ కాలంలో గ్రామీణ కథను తెరకెక్కించడమే రంగస్థలం విశేషం.

### కృష్ణార్జున యుద్ధం..

నాని ద్విపాత్రాభినయం నటిస్తున్న తాజా సినిమా కృష్ణార్జున యుద్ధం. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా లాంటి రెండు కామెడీ ఎంటర్‌టైనర్‌లు తెరకెక్కించిన దర్శకుడు మేర్లపాక గాంధీ...ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రేక్షకులను థ్రిల్ చేసే అంశాలు ఈ చిత్రంలో ఉంటాయని...మన ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కృష్ణార్జున యుద్ధం అందిస్తుందని నాని నమ్మకంతో చెబుతున్నారు. ఏప్రిల్ 12న ఈ సినిమా తెరపైకి రాబోతోంది. నాని ద్విపాత్రాభినయం ఈ చిత్ర ప్రత్యేకత.

### 2.0..

రోబో సీక్వెల్ 2.0 ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగిస్తోంది. రజినీకాంత్ శంకర్ కలిసి చేస్తున్న ఈ చిత్రం భారీ వ్యయంతో నిర్మితమవుతోంది. అక్షయ్ కుమార్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. భారతీయ సినిమా సాంకేతక అభివృద్ధిని 2.0 చూపించబోతోంది. ఖర్చు విషయంలో కాదు..కథ విషయంలో ఇంత కొత్త చిత్రాన్ని ఇంకెవరూ తెరకెక్కించలేరని రజినీ ఇటీవల చెప్పడం 2.0లోని నవ్యతకు నిదర్శనం. ఏప్రిల్ 14న ఈ సినిమా విడుదల కాబోతోంది. 400 కోట్ల రూపాయల నిర్మాణ వ్యయంతో ఆసియాలోనే తొలి భారీ చిత్రం కావడం 2.0 విశేషం..

### నా పేరు సూర్య....

అల్లు అర్జున్ సైనికుడి పాత్రలో నటిస్తున్న చిత్రం నా పేరు సూర్య , నా ఇల్లు ఇండియా. ఆవేశపూరితుడైన సైనికుడిగా అల్లు అర్జున్ కనిపించబోతున్నారు. ఏప్రిల్ 27న నా పేరు సూర్య తెరపైకి రానుంది. కథా రచయిత వక్కంతం వంశీ దర్శకుడిగా మారి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శ్రీధర్ నిర్మాణ బాధ్యతలు వహిస్తున్నారు. అల్లు అర్జున్ తొలిసారి సైనికుడి పాత్ర చేస్తుండటం నాపేరు సూర్య ప్రత్యేకత.

### భరత్ అనే నేను..

గతంలో శాసనసభ్యుడి పాత్రలో నటించారు మహేష్ బాబు. ప్రస్తుతం తాజా చిత్రంలో ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. ఆయన రాష్ట్రాధినేతగా నటిస్తున్న చిత్రం భరత్ అనే నేను. దర్శకులు కొరటాల శివ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మించిన భరత్ అనే నేను ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. మహేష్ రాజకీయ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా నటించడమే ఈ చిత్రంలో విశేషం.

### సైరా నరసింహారెడ్డి...

దేశభక్తుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న చిత్రం సైరా నరసింహారెడ్డి. చిరు నటిస్తున్న 151వ చిత్రమిది. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్ చరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నయనతార నాయికగా నటిస్తోంది. అమితాబ్, రానా తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. తొలి స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే ఆంగ్లేయుల పాలనను ధిక్కరించి ప్రజల్లో స్ఫూర్తినింపిన దేశభక్తుడి జీవిత చరిత్ర వెండితెరపైకి తీసుకురావడం సైరా నరసింహారెడ్డి ప్రత్యేకత.


రంగస్థలం
నాపేరు సూర్య
భరత్ అనే నేను
2.0
కృష్ణార్జున యుద్ధం


మహానటి

## ఇంత ఘన విజయాన్ని ఊహించలేదు

- ఛలో థ్యాంక్స్ మీట్ లో నాగశౌర్య




ఛలో చిత్రం తమకు మర్చిపోలేని ప్రయాణమని కథానాయకుడు నాగశౌర్య అన్నారు. గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఛలో విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ థ్యాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ లోని ఓ హోటల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ పాల్గొని ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగశౌర్య మాట్లాడుతూ....ఛలో కథ విన్నప్పుడు బాగుంటుంది అనుకున్నాం కానీ...ఇంత ఘన విజయాన్ని ఊహించలేదు. టికెట్స్ దొరకడం లేదని ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఇది నిజమేనా అని ఆశ్చర్యమేస్తోంది. ఛలో సినిమా మా అందరికీ ఒక అద్భుతమైన ప్రయాణం. మర్చిపోలేని అనుభూతులను మిగిల్చింది. గతంలో సినిమాల ఎంపికలో నేను చేసిన తప్పులన్నీ ప్రేక్షకులు ఈ చిత్రంతో మర్చిపోయారు. నటీనటులంతా తమ పాత్రల్లో గొప్పగా నటించారు. మొత్తం చిత్ర బృందానికి ఛలో విజయం ఘనత దక్కుతుంది. చిత్ర విజయవంతం కావాలని ఆశీర్వదించిన మెగాస్టార్ చిరంజీవి గారికి కృతజ్ఞతలు. అన్నారు. దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ...ఇవాళ మేమంతా విజయోత్సవం జరుపుకుంటున్నాం అంటే అందుకు ఒకే ఒక కారణం మా నిర్మాత ఉషా మూల్పూరి గారు. సినిమా చిత్రీకరణలో మమ్మల్ని నిత్యం ప్రోత్సహించారు. మా వెంటే ఉన్నారు. నేను మంచి సినిమా చేయగలను అని నమ్మిన నాగశౌర్యకు కృతజ్ఞతలు అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయిక రశ్మికా మండన, నిర్మాతలు ఉషా మూల్పూరి, శంకర్ ప్రసాద్ మూల్పూరి, గీత రచయిత కాసర్ల శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## 'ఫిదా'లా తొలిప్రేమను

# అద్భుతం అంటారు



వరుణ్‌తేజ్, రాశీఖన్నా నాయకానాయికలుగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, ఎల్ఎల్‌పి పతాకాలపై రూపొందిన తొలిప్రేమ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా

దిల్‌రాజు మాట్లాడుతూ, 98లో వచ్చిన తొలిప్రేమ సినిమాకు నేనే డిస్ట్రిబ్యూటర్‌ని. ఇప్పుడొస్తున్న తొలి ప్రేమకు నేనే డిస్ట్రిబ్యూటర్‌ని. ఆ తొలిప్రేమ ఎలా యూత్‌ఫుల్ చిత్రమైందో...ఈ సినిమా కూడా నూరుశాతం అలాంటి యూత్ సినిమానే. రెండేళ్ల క్రితం వెంకీ నాకు చెప్పిన అందమైన ప్రేమకథ ఇది. వరుణ్‌కు ఫిదా తర్వాత ఈ సినిమా రావడం ప్లస్ అవుతుంది. ఫిదా సినిమా విడుదలైన తొలి ఆట నుంచి అద్భుతం అని ఎలా అన్నారో...ఇప్పుడు అలాగే అంటారు. వరుణ్, రాశీఖన్నా మధ్య అందమైన కెమెస్ట్రీ కుదిరింది. రెండు తెలుగు రాష్ట్రాలలో చిత్రం విడుదల కావడానికి ఒకరోజు ముందుగా అమెరికాలో విడుదలవుతుంది. మెగాఫ్యాన్స్‌కు పండుగలాంటి సినిమా అని అన్నారు.

నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ, మెగాస్టార్‌తో సినిమా తీయాలని 33 ఏళ్ల క్రితం తణుకు నుంచి చెన్నై వెళ్లాను. తర్వాత అల్లు అర్జున్‌తో ఆర్య-2, రామ్‌చరణ్‌తో మగధీర, పవన్‌కల్యాణ్‌తో అత్తారింటికి దారేది సినిమాలు చేసే అవకాశం లభించింది. ఇప్పుడేమో వరుణ్‌తేజ్‌తో ఈ సినిమా చేశాం. గ్యారంటీగా సినిమా పెద్ద హిట్టవుతుంది అన్నారు.

హీరో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ, దర్శకుడు వెంకీకి తొలి చిత్రమే అయినా ఎంతో బాగా మలిచారు. తను భవిష్యత్‌లో పెద్ద దర్శకుడవుతాడు. ఇక ఈ సినిమాను అందరికంటే ఎక్కువగా నమ్మింది నిర్మాత దిల్‌రాజుగారే. ఈ సినిమాకు ఆయన ఓ సపోర్ట్‌గా నిలిచారు. బాపినీడు, ప్రసాద్‌గారు సినిమాను అద్భుతంగా నిర్మించారు. సినిమాటోగ్రాఫర్ జార్జ్ విలియమ్స్ ప్రతీ సీన్‌ను ఎంతో అందంగా చూపించారు. తొలిప్రేమ అనే టైటిల్‌తో 20 సంవత్సరాల తర్వాత అదే టైటిల్‌తో నేను చేస్తున్న సినిమా ఇది. ఆ సినిమాకు ఇది రీమేకో, కాపీయో కాదు. కథకు తగ్గ టైటిల్ అనిపించే పెట్టాం. బాబాయ్ టైటిల్‌ను పాడు చేస్తానని ఎవరూ అనుకోవద్దు. మా కుటుంబం నుంచి తేజు సినిమా ఈ నెల 9న, నేను నటించిన ఈ సినిమా ఆ మరుసటి రోజు 10న విడుదలవుతుంది. మా మధ్య ఎలాంటి పోటీ లేదు. ఇద్దరం చిన్నప్పట్నుంచి కలిసే పెరిగాం. నా సినిమా ఎంత పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నానో..తేజు సినిమా కూడా అంతే సక్సెస్ కావాలని కోరుకుంటున్నా అని అన్నారు.

దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ, కథను రాసింది, విడుదలచేసేది దిల్‌రాజుగారైతే.. సినిమాను నిర్మించింది మాత్రం బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌గారు. జీవితం ఓ సర్కిల్ అని వినే ఉంటాం. నా జీవితంలో అలాగే జరుగుతోంది. తొలిప్రేమ సినిమాను చేసినపుడు, చూసినపుడు ప్రేక్షకులకు ఓ ఫ్రెష్‌నెస్ ఎలా కలిగిందో..అలాంటి ఫ్రెష్‌నెస్‌తోనే ఈ సినిమాను మేం చేశాం. ఈ సినిమా టైటిల్ పెట్టినపుడు కాస్త భయపడ్డాం. వరుణ్ టైటిల్ అయితే పెడుతున్నాం..ఫరవాలేదు కదా! అన్నాడు. ఆ సినిమాతో నేను పోలిక పెట్టను కానీ..గౌరవాన్ని కాపాడుతానని మాట ఇస్తున్నాను. సినిమా అంటే సమష్టి కృషి అని ఎందుకంటారో నాకు ఇప్పుడు అర్థమవుతోంది. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చుతుందన్న నమ్మకం ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు రాధాకృష్ణ, నటుడు హైపర్ ఆది, డిస్ట్రిబ్యూటర్ ఎల్.వి.ఆర్, కొందరు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు తోడుగా 'మనం సైతం'

నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్వచ్ఛంద సంస్థ మనం సైతం తన సేవా దృక్పథాన్ని చాటుకుంటోంది. శనివారం హైదరాబాద్‌లోని ఫిలించాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఏడుగురు అభాగ్యులకు ఈ సంస్థ ఆర్థిక సాయం అందించింది. చిత్ర పరిశ్రమలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ అనారోగ్యం పాలై అండ కోసం ఎదురుచూస్తున్న ఏడుగురికి ఈ సంస్థ చెక్కులను అందజేసింది. అనంతరం సంస్థ నిర్వాహకుడు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ, ఒక్కరితో మొదలైన ఈ సంస్థ ఇవాళ లక్ష మందికి పైగా సభ్యులతో బలోపేతమవుతోంది. సహాయం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే చేయి అందించే మనసున్నవాళ్లు ఎందరో ఉంటారు. సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను చూసి చిరంజీవి, పవన్‌కల్యాణ్, కొరటాల శివ, పూరి జగన్నాథ్, టీఆర్ఎస్ నేత సంతోష్‌కుమార్, సంస్థ సభ్యుడు బందరు బాబి సతీమణి కవిత ఇలా ఎందరో స్పందించారు. ఆర్థిక సాయం అందించి మనం సైతం వెంట తామూ ఉన్నామనే భరోసా కలిగించారు యూకే నుంచి రామ్ నామనగిరి స్పందించారు. దాతలందరికీ కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను అని అన్నారు.

సీనియర్ నటి జయసుధ మాట్లాడుతూ, చారిటీ కార్యక్రమాలు చేయడం అంత సులువైన విషయం కాదు. ఎంతో పట్టుదల, ఓపిక ఉండాలి. నేనూ గతంలో ఓ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాను. కానీ కొనసాగించలేకపోయాను. మనం బృందం కలిసికట్టుగా కార్యక్రమాలను చేస్తున్నారు. నా దృష్టిలో సేవ చాలా కష్టమైనప్పటికీ దానిని మించిన తృప్తి ఉండదు అని అన్నారు. హాస్యనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ, నేను సేవా కార్యక్రమాలకు దూరంగా ఉంటానని చాలామంది అనుకుంటారు. కానీ నా జీవితంలో ఎంతోమందికి సహాయం చేశాను. అది ఎవరికీ తెలియదు. నా తొలి చిత్రం నుంచి కాదంబరి నాకు తెలుసు. ఎప్పుడూ ఏదో వ్యాపకంలో ఉండటం కాదంబరికి అలవాటు అని అన్నారు. దర్శకుడు హరీష్‌శంకర్ మాట్లాడుతూ, నాకు వీలైనంత సాయం ఈ సంస్థకు తప్పకుండా అందిస్తాను అని పేర్కొనగా, నటుడు సుధీర్‌బాబు మాట్లాడుతూ, మనం సైతంలో ఇప్పట్నుంచి నేనూ భాగమే అని చెబుతున్నా అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, ఇంకా మనం సైతం సభ్యులు బందరు బాబి, సురేష్, వేణు, గాయని విజయలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాప్రభ

‘మణికట్టు మాంత్రికులు యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు ఎలాంటి పిచ్‌పైన అయినా బంతిని సుడులు తిప్పగల సమర్థులు. రానున్న వన్డేల్లో వారి ప్రాధాన్యత ఏమిటో ఈ మ్యాచ్ ద్వారా చాటిచెప్పారు. సెంచూరియన్ పిచ్ నుంచి వీళ్లకు పూర్తి మద్దతు లభించింది. ఐదు వికెట్లతో ఉత్తమ గణాంకాలు నమోదు చేసిన చాహల్, మూడు వికెట్లతో రాణించిన కుల్దీప్ ఆతిథ్య జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. దీంతో బ్యాట్స్‌మన్ పని సులువైంది. విజయం నల్లేరుమీద నడక అయింది. డర్బన్‌తో పోల్చితే ఈ పిచ్ కాస్తంత గట్టిగా ఉంది. ఈ అవకాశాన్ని స్పిన్నర్లు సద్వినియోగం చేసుకున్నారు. పిచ్ పొడిగా మారితే మా స్పిన్నర్లు రెచ్చిపోతారని తెలుసు. అనుకున్నట్లుగానే ప్రత్యర్థులకు వీరిద్దరు ఎలాంటి చాన్స్ ఇవ్వలేదు. అందునా ద.ఆఫ్రికా మిడిలార్డర్ అనుభవ రాహిత్యంపై దెబ్బకొట్టాము. ప్రస్తుతం2-0 ఆధిక్యంతో సిరీస్‌పై పట్టుబిగించడం సంతోషకరంగా ఉంది’

**- కోహ్లీ (టీమిండియా కెప్టెన్)**

‘జట్టుగా మేమంతా విఫలం అయ్యాం. బ్యాటింగ్ వైఫల్యమే ఈ ఓటమికి ప్రధాన కారణం. సరైన ప్రదర్శన చేయలేదు. నాతో సహా, చాలా మంది అనవసర తప్పిదాలతో అవుటయ్యారు. 118 పరుగులను కాపాడుకోవడం అన్నివేళలా సాధ్యం కాదు. ఒకింత కష్టతరమే. జరిగిన దాని గురించి ఎక్కువగా ఆలోచించాలని అనుకోవడం లేదు. తదుపరి మ్యాచ్‌లపై దృష్టిసారిస్తాం. సీనియర్లు దూరం కావడం కూడా జట్టుపై కొంత ప్రభావం చూపింది’

**- మక్రమ్ (ద.ఆఫ్రికా కెప్టెన్)**



# సఫారీలను తిప్పేశారు



## ● స్పిన్ ఉచ్చులో విల విల ● చిత్తుగా ఓడిన ఆతిథ్య జట్టు ● 9 వికెట్లతో కోహ్లీసేన ఘనవిజయం ● సిరీస్‌లో 2-0 తో టీమిండియా ఆధిక్యం

**సెంచూరియన్:** టెస్టు సిరీస్ పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేలా టీమిండియా రెచ్చిపోయింది. వరుసగా రెండో వన్డేలోనూ ద.ఆఫ్రికా జట్టును చిత్తుగా ఓడించింది. 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆరు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 119 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి, 20.3 ఓవర్లలోనే అధిగమించింది. శిఖర్ ధావన్ 51, కెప్టెన్ కోహ్లీ 46 పరుగులతో అజేయంగా నిలిచారు.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోహ్లీ సేన ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. మరోసారి మన స్పిన్నర్ల దెబ్బకు సౌతాఫ్రికా విల విల్లాడిపోయింది. సుడులు తిరుగుతున్న బంతితో సఫారీలకు చుక్కలు కనిపించాయి. గల్లీ క్రికెటర్లలాగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా.. కేవలం 32.1 ఓవర్లలో 118 పరుగులకే ఆలౌటైంది. చాహల్ 5, కుల్‌దీప్ 3 వికెట్లు తీశారు. చాహల్‌కు వన్డేల్లో ఐదు వికెట్లు పడటం ఇదే తొలిసారి. స్పిన్నర్లు రంగంలోకి దిగనంత వరకు బాగానే ఆడిన సౌతాఫ్రికా, ఆ తర్వాత తడబడింది. ఓపెనర్ హసీం ఆమ్లాను భువనేశ్వర్ బోల్తా కొట్టించాడు. రివ్యూ కెళ్లినా ఫలితం లేకపోయింది. 10 ఓవర్లకు 39/1, 13 ఓవర్లకు 50 పరుగులు చేయగలిగింది. 14 ఓవర్‌లో చాహల్ బౌలింగ్‌కు రావడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రెండవ ఓవర్‌లోనే వరుస బంతుల్లో డికాక్, మక్రమ్‌లను పెవిలియన్ చేర్చాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ మిల్లర్‌ను ఔట్ చేయడంతో ఆతిథ్య జట్టు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కేవలం ఆరు బంతుల వ్యవధిలో పరుగులేమీ లేకుండానే మూడు వికెట్లు టపటపా నేలకూలాయి. 51 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో జోండో, డుమిని ఐదో వికెట్‌కు 48 పరుగులు జోడించారు. ఈ దశలో కాస్త కోలుకున్నట్లు కనిపించినా.. జోండో (25) ఔటవడంతో మరోసారి వికెట్ల పతనం మొదలైంది. ఆ తర్వాత 19 పరుగుల తేడాలో చివరి 6 వికెట్లు కోల్పోయింది.ఐదో వికెట్‌కు జొండొ (25), డుమ్నీ (25) ల 48 పరుగుల భాగస్వామ్యమే వారి ఇన్నింగ్స్‌లో అత్యధికం. 27వ ఓవర్‌లో 100 పరుగుల మైలురాయిని చేరిన సఫారీ జట్టు, మరో 18 పరుగులకే చాపచుట్టేసింది. ఈ గ్రౌండ్‌లో ఇదే అతి తక్కువ స్కోరు కావడం విశేషం. గతంలో జింబాబ్వే 119 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇప్పుడు సౌతాఫ్రికా ఆ రికార్డును తిరగరాసింది.

119 పరుగుల లక్ష్య ఛేదనతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఓపెనర్ రోహిత్ శర్మ (15) వికెట్‌ను త్వరగా కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన కోహ్లీ, ధావన్ ఇద్దరూ ఆచితూచి ఆడుతూ మరో వికెట్ పడకుండా జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఈ క్రమంలో ధావన్, కోహ్లీ రెండో వికెట్‌కు అజేయ 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 48 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి బయట పడిన ధావన్ కెరీర్‌లో 24వ వన్డే అర్ధ సెంచరీని నమోదుచేశాడు. డర్బన్‌లో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఆరు వికెట్లతో గెలిచిన విషయం తెలిసిందే. తదుపరి మూడవ వన్డే బుధవారం కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

### స్కోరు బోర్డు..

**ద.ఆఫ్రికా:** హసిం ఆమ్లా (సి) ధోని (బి) కుమార్ 23, క్వింటన్‌డికాక్ (సి) పాండ్యా (బి) చాహల్ 20, మక్రమ్ (సి) కుమార్ (బి) కుల్దీప్ యాదవ్ 8, జేపీ డుమ్నీ (ఎల్‌బీడబ్ల్యూ) బి. చాహల్ 25, డేవిడ్ మిల్లర్ (సి) రహనే (బి) కుల్దీప్ యాదవ్ 0, జొండొ (సి) పాండ్యా (బి0 చాహల్ 25, క్రిస్ మోరిస్ (సి) కువార్ (బి)చాహల్ 14, రబాడ (ఎల్‌బీడబ్ల్యూ) బి. కుల్దీప్ యాదవ్ 1, మోర్నీ మోర్కెల్ (ఎల్‌బీడబ్ల్యూ) బి చాహల్ 1, ఇమ్రాన్ తాహిర్ (బి) బుమ్రా 0. మొత్తం స్కోరు 118 (32.2 ఓవర్లకు ఆలౌట్)

**ఇండియా బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 5-1-19-1, బుమ్రా 5-1-12-1, పాండ్యా 5-0-34-0, యుజ్వేంద్ర చాహల్ 8.2-1-22-5, కుల్దీప్ యాదవ్ 6-0-20-3, జాదవ్ 3-0-11-0.

**ఇండియా :**

రోహిత్ శర్మ (సి) మోర్కెల్ (బి) రబాడ 15, శిఖర్ ధావన్ (నాటౌట్) 51, కోహ్లీ (నాటౌట్) 46. ఎక్స్‌ట్రాలు 7. మొత్తం 119(20.3 ఓవర్లలో)

**ద.ఆఫ్రికా బౌలింగ్:** మోర్కెల్ 4-0-30-0, కగిసొ రబాడ 5-0-24-1, మోరిస్ 3-0-16-0, తాహిర్ 5.3-0-30-0, తాబ్రియాజ్ 3-1-18-0.

### ఐసీసీ నిబంధలపై విమర్శలు

**● లంచ్ విరామం వివాదాస్పదం**

టీమిండియా విజయానికి రెండు పరుగుల దూరంలో ఉన్న సమయంలో అంపైర్లు లంచ్‌కు పిలుపునిస్తూ, మ్యాచ్‌ను నిలిపివేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాచీన నిబంధనల అమలుపై ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆదివారం నాటి పరిణామాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మైదానంలోని ఇద్దరు అంపైర్లు అలీమ్‌దార్-ఆడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ తీరుపై టీవీ వ్యాఖ్యాతలు, క్రికెట్ పండితులు మండిపడ్డారు. 118 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా 18 ఓవర్లకు 117 పరుగులు చేసింది. మరో రెండు పరుగులు చేస్తే విజయం పూర్తవుతుంది. సరిగ్గా ఈ సమయంలో అంపైర్లు ఐసీసీ రూల్స్ ప్రకారం లంచ్‌కు పిలుపునిచ్చారు. 15ఓవర్లకు ఇండియా 93 పరుగుల వద్ద ఉన్నపుడు అంపైర్లు లంచ్ సమయాన్ని మూడు ఓవర్లు పొడిగించారు. అప్పటికీ విజయం సాధించలేక పోవడంతో లంచ్‌ను ప్రకటించారు. అయితే కేవలం రెండు పరుగుల దూరంలో ఈ నిర్ణయం తీసుకోవడం విమర్శలకు దారితీసింది. ఈ నిర్ణయం హాస్యాస్పదంగా ఉందని విండీస్ దిగ్గజ ఆటగాడు మైఖేల్ హోల్డింగ్ వ్యాఖ్యానించాడు.

# అందుకే... ధోనీ ఆఫర్ కాదనలేదు...

**కోల్‌కతా:** రిటైరైన మాజీ క్రికెటర్లు చాలా మందిలాగే ఇప్పుడు టీమిండియా మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్లలో ఒకడైన సౌరవ్ గంగూలీ క ూడా తన ఆటో బయోగ్రఫీ రాస్తున్నాడు. ఎ సెంచురీ ఈజ్ నాట్ ఇనఫ్ పేరుతో ఆ బుక్ రిలీజ్ కానుంది. ఈ బుక్‌లో అతను కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ఓ దుర్గా పూజకు వెళ్లడానికి తాను ఓ సర్దార్‌జీ వేషం వేసుకోవాల్సి వచ్చిందని మొన్న చెప్పిన గంగూలీ.. తాజాగా తన చివరి టెస్ట్‌లో జరిగిన ఓ ఆసక్తికర ఘటనను వివరించాడు. 2008, నవంబర్‌లో తన చివరి టెస్ట్ ఆడాడు గంగూలీ. ఆ సమయంలో కెప్టెన్‌గా ఉన్న ధోనీ.. గౌరవసూచకంగా మ్యాచ్ చివరి దశలో కెప్టెన్సీ చేయాల్సిందిగా గంగూలీని అడిగాడు. అయితే తాను ఆ రోజు ఉదయం అందుకు అంగీకరించలేదని, ఫీల్డ్‌లో ధోనీ మరోసారి అదే ప్రస్తావన తీసుకురాగా కాదనలేకపోయానని దాదా ఆ బుక్‌లో వివరించాడు.

ఇందులో మరో విశేషం ఏమిటంటే.. సరిగ్గా ఎనిమిదేళ్ల కిందట అదే రోజు.. గంగూలీ టీమిండియా కెప్టెన్సీని చేపట్టాడు. అనుకోకుండా ఆ అరుదైన క్షణంలో మరోసారి కెప్టెన్సీ చేసే అవకాశం గంగూలీకి దక్కింది. అయితే మూడు ఓవర్ల పాటు మాత్రమే ఫీల్డింగ్, బౌలింగ్‌లను సెట్ చేసిన దాదా.. తర్వాత కెప్టెన్సీని ధోనీకే అప్పగించాడు. కెప్టెన్సీ నీ పనే అని తాను ధోనీతో అన్నట్లు గంగూలీ చెప్పాడు. ఆ సమయంలో ఇద్దరం కాసేపు నవ్వుకున్నామని తెలిపాడు.


# దక్షిణాఫ్రికా చెత్త రికార్డు

రెండో వన్డేలో దక్షిణాఫ్రికా చెత్త రికార్డును మూట గట్టుకుంది. భారత్‌తో సెంచూరియన్‌లో జరిగిన మ్యాచ్‌లో 118 పరుగులకే కుప్పకూలడం ద్వారా, స్వదేశంలో అత్యల్ప స్కోరును నమోదు చేసిన చెత్త రికార్డును సొంతం చేసుకున్నారు. మొత్తంగాచూస్తే భారత్‌పై దక్షిణాఫ్రికాకు ఇది రెండో అత్యల్ప వన్డే స్కోరు. 1999లో నైరోబిలో జరిగిన వన్డేలో దక్షిణాఫ్రికాను 117 పరుగులకే భారత్ ఆలౌట్ చేసింది. కాగా, 1993లో ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో సఫారీలు 69 పరుగులకే చాపచుట్టేశారు. ఆదివారం నాటి మ్యాచ్‌లో భారత స్పిన్నర్లు సఫారీ బ్యాట్స్‌మన్ల భరతం పట్టారు. యుజ్వేంద్ర చాహల్ ఐదు వికెట్లు సాధించి ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు. వన్డేల్లో అతనికిదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం.




# చాహల్.. చల్

చాహల్ 8.2 ఓవర్లలో 22 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు. మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఆరు ఓవర్లు వేసిన కుల్దీప్ 20 పరుగులిచ్చి మూడు వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. వీరిద్దరు 42 పరుగులిచ్చి 8 వికెట్లు సాధించారు. 2009 పోర్టు ఎలిజబెత్ మ్యాచ్ తర్వాత (119 పరుగులు) ఇదే అత్యల్ప స్కోరు. కాగా, వన్డేల్లో ఒకే ఇన్నింగ్స్‌లో మూడు అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టిన స్పిన్ ద్వయంగా చాహల్-కుల్దీప్ నిలిచారు. 1999లో వెస్టిండీస్ స్పిన్నర్లు కార్ల్‌హూపర్-కీత్ అథర్టన్ ఆరు వికెట్లు పడగొట్టిన రికార్డును భారత జోడీ తిరగరాసింది. అదేవిధంగా ద.ఆఫ్రికాపై అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన స్పిన్నర్‌గానూ చాహల్ రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు యువరాజ్ పేరిట ఉంది. అతను 2003లో నమీబియాపై ఆరు పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీశాడు. ఇక ద.ఆఫ్రికా గడ్డపై ఒక వన్డేలో ఐదు వికెట్లు తీసిన రెండో భారత బౌలర్ కూడా చాహలే. 2003 డర్బన్‌లో ఇంగ్లండ్‌పై నెహ్రా 23 పరుగులకు ఆరు వికెట్లు సాధించాడు.



వన్డే మ్యాచ్‌లకు సారథ్యం వహించిన రెండో పిన్న వయస్కుడిగా ద.ఆఫ్రికా ఆటగాడు మక్రమ్ రికార్డు స్థాపించాడు.



# సింధు ఓటమి

**న్యూఢిల్లీ:** ఇండియా సూపర్ 300 టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధు కొద్దిలో ఓటమి పాలైంది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అమెరికా క్రీడాకారిణి బీవెన్ జాంగ్ చేతిలో 18-21, 21-11, 20-22 స్కోరుతో ఓడింది. 2018 సీజన్‌లో ఆమెకు ఇది రెండో టోర్నీ. తొలిసెట్‌లో వెనుకబడిన సింధు, అతికష్టం మీద రెండో సెట్‌లో పుంజుకుని ఆడింది. టైటిల్ రేసులో ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చింది. నువ్వా నేనా అన్నట్లు మూడోసెట్ సాగింది. అయితే అదృష్టం అమెరికన్ క్రీడాకారిణినే వరించింది. జాంగ్‌తో సింధు ఎప్పుడూ సుదీర్ఘ మ్యాచ్‌లనే ఆడుతుంది. దాదాపు అన్ని మ్యాచ్‌లు డిసైడింగ్ రౌండ్ దాకా చేరుతుంటాయి. ఈసారీ అలాగే జరిగింది. ఇద్దరూ చివరిపాయింట్ వరకు పోరాటాన్ని కొనసాగించారు. గతేడాది జరిగిన ఇండోనేషియా సూపర్‌తో సహా మూడు మ్యాచ్‌లలో జాంగ్‌తో తలపడిన సింధు రెండు సార్లు గెలిచి, ఒకసారి ఓడింది. కాగా, ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ ఫైనలిస్ట్, నాలుగోసీడ్ చైనా ఆటగాడు షియుకి పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సొంతంచేసుకున్నాడు. ఫైనల్స్‌లో ఏడో సీడ్ తైవాన్ ఆటగాడు చౌ టియెన్ చెన్‌ను 21-18, 21-14 తేడాతో ఓడించాడు. వీరిద్దరి మధ్య జరిగిన మ్యాచ్ 47 నిముషాల్లోనే ముగిసింది. గతేడాది ఒక్క టైటిల్ కూడా నెగ్గలేక పోయాను. అదృష్టవశాత్తు ఈ యేడాది ప్రారంభంలోనే విజయం సాధించాను అని షియుకి హర్షం వ్యక్తంచేశాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో డెన్మార్క్ ఆటగాళ్లు క్రిస్టియన్‌సేన్, క్రిస్టియానా పెడర్‌సేన్ జోడి పసిడి పతకం నెగ్గింది. ప్రత్యర్థిఆటగాళ్లు ఇండోనేషియా షట్లర్లు ప్రవీణ్ జోర్డాన్, మేలాటి దీవా ఒక్టావియాంటిని జంటను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు.



మిక్స్‌డ్ డబుల్స్ విజేతలు క్రిస్టియన్ సేన్, పెడర్‌సేన్

# మరో రెండు నెలలు..

**గ్రేటర్ నోయిడా:** హైదరాబాద్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరో రెండు నెలలు టెన్నిస్ కోర్టుకు దూరం కానుంది. గాయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆమె, ప్రస్తుతం శారీరకంగా ఫిట్‌గా ఉన్నప్పటికీ, తప్పనిసరి విశ్రాంతికి పరిమితం కావాలని నిర్ణయించుకున్నారు. ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన సానియా గతేడాది అక్టోబర్‌లో మోకాలి గాయం కారణంగా మైదానానికి దూరమైంది. దీంతో అదే సీజన్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌లో పాల్గొనలేక పోయింది. టెక్నికాలిటీస్ గురించి నేను ప్రస్తావించను. ఒక ‘వేళ సర్జరీకి వెళ్లినా, పూర్తిగా కోలుకుంటానన్న గ్యారంటీ లేదు. నొప్పిని అధిగమించే ప్రయత్నం చేస్తున్నాను అని సానియా వివరించింది. గాయం తర్వాత మానసికంగా కాస్తంత కలవరపాటుకు గురైనట్లు చెప్పింది. ఆస్ట్రేలియా ఓపెన్‌లో పాల్గొనకుండా, ప్రేక్షకురాలిగా ఉండటం తనను బాధించిందని చెప్పుకొచ్చింది. అయినా గాయాలు కావడం ఇదేం కొత్తకాదు. గతంలోనూ మూడు సర్జరీలు అయ్యాయి. ఒక అథ్లెట్‌గా నాకు ఇవి మామూలే. భౌతిక నొప్పి కంటే మానసిక గాయమే తీవ్రమైనది అని తన మనోవ్యధను వివరించారు. 2015లో 10 టైటిల్లు, 2016లో 8 టైటిళ్లు నెగ్గిన ఆమె 2017లో కేవలం డబ్ల్యూటీఏ టైటిల్‌కే పరిమితం అయింది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఫెడ్ కప్‌లో భారత్‌కు ప్రతికూలతలు తప్పవని పేర్కొంది. ఈ యేడాది ఇండోనేషియాలో జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొనే అంశంపై ఇప్పుడే ఏం చెప్పలేమన్నది. 15 ఏళ్ల వయసులో (2002) తొలిసారి ఆసియా గేమ్స్ ఆడాను. మళ్లీ అలాంటి అవకాశం వస్తే బాగుండు. మరిన్ని పతకాలు సాధించేందుకు వీలవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ స్వప్నం నెరవేరుతుందని అనుకోవడం లేదు. తిరిగి టెన్నిస్ కోర్టులోకి అడుగు పెట్టడంపైనే నా దృష్టంతా. క్రీడలంటే కేవలం చాంపియన్లు కావడమే కాదు. జీవన విధానం తెలుసుకోవడం. గెలుపు-ఓటములను సమాన రీతిలో అంగీకరించ గలగడం. ఎక్కువ మంది క్రీడాకారులు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దశలో, క్రీడాస్ఫూర్తి, సంస్కృతి అవసరం. క్రీడాదేశమంటే ఎంత మంది చాంపియన్లు ఉన్నారని కాదు.. ఎంత మంది క్రీడాకారులు ఉన్నారన్నదే ప్రధానం. గత కొన్నేళ్లుగా క్రీడల్లో ఇండియా మెరుగవుతున్నది. మరో ఐదేళ్లలో ఇక్కడి స్పోర్ట్స్ టెక్ విలేజ్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుంది. 175 ఎకరాల విస్తీర్ణంలోని ఈ క్రీడాగ్రామంలో టెన్నిస్, క్రికెట్,షూటింగ్, బాడ్మింటన్ అకాడమీలు ఉన్నాయి. మూడొంతుల విస్తీర్ణం క్రీడలకు, ఒక వంతు విస్తీర్ణంలో నివాస భవనాల అభివృద్ధి ఉంటుంది’ అని సానియా చెప్పారు.



# డేవిస్ కప్‌లో ఆస్ట్రేలియాపై జర్మనీ గెలుపు

**బ్రిస్బేన్:** జర్మన్ టెన్నిస్ స్టార్, ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ విజృంభించాడు. డేవిస్ కప్ వరల్డ్‌గ్రూప్ టై గేమ్‌లో ఆసీస్‌పై జర్మనీ విజయం సాధించింది. ఆసీస్ ఆటగాడు నిక్ కిర్గియోస్‌పై 3-1 తేడాతో జ్వెరెవ్ జయకేతనం ఎగురవేశాడు. బ్రిస్బేన్‌లో ఆదివారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో జ్వెరెవ్ విజృంభించి ఆడాడు. 1.48 గంటల పాటు జరిగిన ఈ మ్యాచ్ లో ఒక్క రెండో గేమ్‌లో మాత్రమే ఆస్రేలియా క్రీడాకారుడు గట్టిపోటీ ఇచ్చాడు. జ్వెరెను తారెత్తించాడు. తొలి గేమ్‌లో 6-2తో ఓడినా, అనూహ్యంగా పుంజుకున్నారు. రెండో గేమ్‌ను 7-6తో నెగ్గాడు. కీలకమైన మూడో గేమ్‌లో ఒక్కసారిగా డీలా పడిపోయాడు. జ్వెరెవ్ అద్భుత సర్వీసులను ఎదుర్కోలేక 6-2తో వెనుకబడి పోయాడు. దీంతో జర్మనీ నేరుగా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఇక్కడ బ్రిటన్ లేదా స్పెయిన్‌తో తలపడుతుంది. శక్తివంతమైన ఆస్ట్రేలియాను ఓడించడం ద్వారా తర్వాతి దశపై ఆత్మవిశ్వాసం పెంపొందేలా చేసిందని జర్మన్ కెప్టెన్ మైఖేల్ కొల్‌మన్ చెప్పాడు. ఈటోర్నీలో మా దేశం తరఫున బలమైన ఆటగాళ్లు, నైపుణ్య ఆటగాళ్లను బరిలోకి దించాము. తదుపరి దశకు అర్హులమని చాటుకున్నాం. జ్వెరెవ్ సర్వీసులు అద్భుతం.కేవలం రెండు బ్రేక్ పాయింట్లను మాత్రమే ఎదుర్కొన్నాడు. అతనికిది మంచి పునరాగమనం అని మైఖేల్ వ్యాఖ్యానించాడు. కాగా, తన జట్టు సభ్యుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైంది. ఈ మధుర క్షణాలు అనిర్వచనీయం అని జ్వెరెవ్ సంతోషం వ్యక్తంచేశాడు.

# ‘రష్యా అథ్లెట్లపై నిషేధం ఎత్తివేత విస్మయానికి గురిచేసింది’



పైయాంగ్‌చాంగ్: 28 మంది రష్యా అథ్లెట్లపై నిషేధం ఎత్తివేస్తూ క్రీడల అత్యున్నత న్యాయ స్థానం తీసుకున్న నిర్ణయంతో విస్మయం చెందినట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ చీఫ్ థామస్ చెప్పారు. ‘నిరాశ చెందాను. ఈ తీర్పు ఆశ్చర్యకరం. ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదు.’ అని ఆయన వ్యాఖ్యానించారు. ఐదు రోజుల్లో వింటర్ ఒలింపిక్స్ ప్రారంభం కానున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. డోపింగ్ ఆరోపణల నేపథ్యంలో ఐఓసీ క్రమశిక్షణ కమిటీ 43 మంది రష్యన్ అథ్లెట్లను అనర్హులుగా ప్రకటించిందని థామస్ గుర్తుచేశారు. రష్యా ఆతిథ్యం ఇచ్చిన 2014 వింటర్ గేమ్స్‌లో డోపింగ్‌కు పాల్పడినట్లు సరైన ఆధారాలు లేనందున వీరిపై నిషేధాన్ని క్రీడల కోర్టు కొట్టివేసింది. తాజా తీర్పు క్రమంలో స్పోర్ట్స్ ఆర్బిటరీ కోర్టు అంతర్గత నిర్మాణంలో తక్షణ మార్పులు అనివార్యమని భావించాల్సి వస్తోందని థామస్ చెప్పారు.

# వేలానికి బీసీసీఐ వెబ్‌సైట్ ?

**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్నవంతమైన భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) వెబ్‌సైట్ (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీసీసీఐ.టీవీ) సేవలు నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రం నుంచి సైట్ ఆఫ్‌లైన్‌లోకి వెళ్లిపోయింది. ఇందుకు సాంకేతిక కారణాలేవీ కారణం కాదు. సకాలంలో డొమైన్‌ను రెన్యువల్ చేయక పోవడం వల్లే ఈ విధమైన సమస్య తలెత్తడం విశేషం. వెబ్‌సైట్ రిజిస్ట్రార్లు అయిన రిజిస్టర్.కామ్, నేమ్‌జెట్.డామ్ బీసీసీఐ డొమైన్‌ను బహిరంగ వేలానికి ఉంచాయి. ఇప్పటి వరకు ఏడు బిడ్లు వచ్చాయి. ఇందులో గరిష్టంగా 270 డాలర్లతో ఒక బిడ్ దాఖలైంది. ఈ డొమైన్ కాలపరిమితి 2-2-2006 నుంచి 2-2-2019 వరకు. కాగా, దీనిని 3 ఫిబ్రవరి 2018లోగా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉండగా, బీసీసీఐ స్పందించక పోవడం శోచనీయం. గతేడాది సెప్టెంబర్‌లో శక్తివంతమైన బోర్డు ఐపీఎల్ ప్రసార హక్కుల విక్రయం ద్వారా 2.55 బిలియన్ డాలర్లు, ఐసీసీ నుంచి గరిష్టంగా 405 మిలియన్ డాలర్లను ఆర్జించింది.



Published & Printed by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.